


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★

సంపుటి 08, సంచిక: 338 | ఆదివారం | 09-11-2025 | ఖమ్మం

Published from: **Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar**

పేజీలు: 12+8 | వెల రూ. 5.00



‘ఓటుచోరీ’పై దర్యాప్తు చేయాల్సిందెవరు? **06**

పిఎం, సిఎం సిగ్గుపడాలి
న్యూస్‌పేపర్‌లో మధ్యాహ్న భోజనం వడ్డింపుపై రాహుల్‌గాంధీ మండిపాటు **05**

ఢిల్లీలో భారీ అగ్నిప్రమాదం


# జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌ను గెలిపించండి

## ఉప ఎన్నికలో బిజెపి, బిఆర్‌ఎస్‌ను మట్టికరిపించాలి

- బిజెపి పట్ల మెతకవైఖరితో ముందుకెళ్తున్న గులాబీ పార్టీ
- మోదీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలు, ఓట్ చోరీని తిప్పికొట్టాలి
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పిలుపు
- సిపిఐ వందేళ్ల ఉత్సవాల సందర్భంగా ఈనెల 15 నుంచి వారం రోజులు జాతాలు

ప్రజాపక్షం/హైదరాబాద్

బిఆర్‌ఎస్ గెలిస్తే బిజెపికి ఉపయోగం జరుగుతుందని, బిజెపి అసలు గెలవ వద్దనేది తమ లక్ష్యమని, జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికలో బిజె పి, బిఆర్‌ఎస్ రెండు పార్టీలను ఓడించి కాంగ్రెను గెలిపించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎం ఎల్ ఎ కూనంనేని సాంబశివరావు జూబ్లీహిల్స్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి.నరసింహలతో కలిసి కూనంనేని సాంబశివరావు మాట్లాడారు. కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ బిఆర్‌ఎస్‌కు సొంత



వ్యూహం లేదని, బిజెపితో ఘర్షణ ఎందుకనే వైఖరితో బిజెపికి అనుకూలంగా ముందుకు వెళుతున్నదని, అందులో భాగంగానే గతంలో కేసులు ఉన్నాయని ఉద్దేశంతో కీలక ఎన్నికల్లో బిజెపికి అనుకూల వైఖరిని బిఆర్‌ఎస్ వహించిందన్నారు. ఇప్పుడు కూడా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బిఆర్‌ఎస్ అదే వైఖరిని అవలంబిస్తే సైద్ధాంతికంగా బిజెపికి అవకాశం ఇచ్చినట్లు అవుతుందని, అందుకే బిజెపిని, దానికి అనుకూలంగా వ్యవహరిస్తున్న బిఆర్‌ఎస్‌ను ఓడించి కాంగ్రెస్ ను గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. బిఆర్‌ఎస్ విధానాలు నిలకడగా లేవని, అవసరాన్ని బట్టి అప్పటికప్పుడు మార్చుకుంటున్నారని, లౌకిక విధానం, సామ్రాజ్యవాదం, మతపరమైన తదితర అంశాల విషయంలో బిజెపికి అనుకూలమైన వైఖరిని బిఆర్‌ఎస్ అవలంబిస్తున్నదన్నారు. శత్రువు శత్రువు మిత్రుడు అనే సూత్రంతో బిజెపికి అనుకూలంగా, కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా బిఆర్‌ఎస్ వ్యవహరిస్తున్నదని ఆయన విమర్శించారు. బిజెపి, బి ఆర్ ఎస్ దోస్తీ ఏమిటో తెలియదు కానీ అంతర్గతంగా రెండు పార్టీల మధ్య ఏదో స్నేహం ఉన్నట్లు కనబడుతున్నదన్నారు.

**కుట్రలపై ఆధారపడి అధికారం నిలబెట్టుకునేందుకు ప్రయత్నిస్తున్న మోదీ**

బిజెపి అనుసరిస్తున్న సామ్రాజ్యవాద అనుకూల విధానాల వల్ల దేశానికి నష్టం జరుగుతున్నదని, మోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను, ఓట్ చోరీని తిప్పికొట్టాలని కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ఓటర్ల ప్రక్షాళన పేరుతో తరువాయి 2లో

> ### సమస్యలపై ‘తెలంగాణ దిగ్బంధనం’
>
> రానున్న మూడేళ్ల కాలం ఉద్యమాల కాలమని, కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, కేంద్ర, రాష్ట్ర పాలకుల విధానాలపై ఉద్యమాలు, పోరాటాలు ఉంటాయని, ఈ సమస్యల పరిష్కారం కోసం ‘తెలంగాణ దిగ్బంధనం’ కార్యక్రమానికి కూడా రూపకల్పన చేయనున్నట్లు సాంబశివరావు వెల్లడించారు. ఇప్పటికే ప్రజాసమస్యలపై ఎక్కడికక్కడ తమ గొంతు వినిపిస్తున్నామని, భవిష్యత్‌లో ప్రత్యక్ష మిలిటెంట్ పోరాటాలకు శ్రీకారం చుట్టనున్నట్లు చెప్పారు.



# డిసెంబరు 1 నుంచి పార్లమెంట్

- 19 వరకు జరగనున్న శీతాకాల సమావేశాలు
- అసాధారణ ఆలస్యం, కుదించివేశారని ప్రతిపక్షాలు మండిపాటు

**న్యూఢిల్లీ :** పార్లమెంటు శీతాకాల సమావేశాలు డిసెంబర్ 1 నుండి 19 వరకు జరగనున్నాయి. మూడు వారాల పాటు జరిగే ఈ సమావేశాల్లో మొత్తం 15 సిట్టింగ్‌లు ఉండనున్నాయి. ఈ మేరకు శనివారం కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు శనివారం ప్రకటించారు. అయితే సమావేశాల నిర్వహణపై ప్రతిపక్షాలు స్పందిస్తూ ఇవి అసాధారణంగా ఆలస్యమని, సమావేశాలను కుదించారని మండిపడ్డాయి. 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో ఎన్నికల కమిషన్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) చేపడుతున్న తరుణంలో పార్లమెంట్ సమావేశాలు జరుతుండడంతో ప్రతిపక్షాలు కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడే అవకాశముందని పలువురు భావిస్తున్నారు. సర్‌పై అనేక ప్రతిపక్ష పార్టీలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న తరువాయి 2లో

# ఒకేసారి రూ.60,799కోట్లతో రోడ్ల నిర్మాణం

- మరో రూ.28 వేల కోట్లతో మన్ననూరు నుంచి శ్రీశైలం వరకు, ఫ్యూచర్ సిటీ నుంచి బందర్ సిటీ వరకు గ్రీన్‌ఫీల్డ్ హైవే పనుల ప్రతిపాదనలు
- అబ్దుల్లాపూర్ ఇండస్ట్రియల్ పార్క్ నుంచి విజయవాడ వరకు 8 లేన్లుగా జాతీయ రహదారి విస్తరణ
- రూ.లక్షల కోట్ల పెట్టుబడులు, లక్షలాదిమంది యువతకు ఉపాధి
- రోడ్ల నిర్మాణంలో రాష్ట్రం రికార్డు
- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్



తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం, జిడిపి పెరుగుదల లక్ష్యంగా, ప్రధానంగా మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి రాష్ట్ర చరిత్రలోనే కనీ విని ఎరగని రీతిలో ఒకేసారి రూ.60,799 కోట్లతో రాష్ట్రంలో రహదారుల నిర్మాణం చేపడుతున్నట్లు రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. వీటితోపాటు మరో 28 వేల కోట్ల తో చేపట్టనున్న మన్ననూరు నుంచి శ్రీశైలం వరకు, ఫ్యూచర్ సిటీ నుంచి బందరు పోర్ట్ వరకు చేపట్టనున్న గ్రీన్ ఫీల్డ్ హైవే పనులు ప్రతిపాదనలో ఉన్నాయని తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ‘మౌలిక సదుపాయాల కల్పనతో బహుళ జాతి సంస్థలకు తెలంగాణ కేంద్రంగా మారబోతోంది. రూ.లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి రానున్నాయి, లక్షలాదిమంది గ్రామీణ యువతకు ఉపాధి కలగనుంది’ అని తెలిపారు. ప్రపంచంలోని పెట్టుబడిదారులు అంతా తెలంగాణ రాష్ట్రానికి తరలివచ్చేలా మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు సిద్ధం అవుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పెట్టుబడిదారులు రహదారుల నిర్మాణంతో తెలంగాణ రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లోకి పెద్ద సంఖ్యలో పరిశ్రమలు రానున్నాయి అని ఆ ప్రకటనలో వివరించారు. ఫలితంగా లక్షల కోట్ల పెట్టుబడులు, లక్షలాదిమంది రాష్ట్ర యువతకు ఉపాధి లభించనుందనీ తెలిపారు. అబ్దుల్లాపూర్ ఇండస్ట్రియల్ పార్కు నుంచి విజయవాడ తరువాయి 2లో

## అగ్గికి పత్తి ఆహుతి

ప్రమాదవశాత్తు మంటలు

300 క్వింటాళ్ల తెల్లబంగారం దగ్ధం

బోరున విలపించిన రైతు బండి ఐలయ్య

సిద్దిపేట జిల్లా బెజ్జంకిలో ఘటన



12

# స్వతంత్ర సంస్థలు దుర్వినియోగం

- కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ మండిపాటు
- మహారాష్ట్ర, హర్యానా ఎన్నికల్లో జనాభిప్రాయం మేరకు ఫలితం రాలేదని ధ్వజం
- ఓట్ చోరీకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా సంతకాల సేకరణ చేపడతామని వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్





స్వతంత్ర సంస్థలను కేంద్ర ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని ఎఐఐసిసి తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ విమర్శించారు. మహారాష్ట్ర, హర్యానా ఎన్నికల్లో జనాభిప్రాయం ప్రకారం ఫలితం లేదని ధ్వజమెత్తారు. గాంధీ భవన్‌లో శనివారం జరిగిన మీడియా సమావేశంలో టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్, సీనియర్ నాయకుడు వి.హనుమంతరావుతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఓట్ల చోరీపై రాహుల్ గాంధీ అనేక విషయాలు బయటపెట్టారని బిహార్‌లో కూడా ఓటు చోరీ జరుగుతోందని మీనాక్షి ఆరోపించారు. ఓటు చోరీకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా సంతకాల సేకరణ జరుగుతోందని ఈ ఎన్నికలు ముగిశాక లక్షలాది మంది ప్రజల వద్దకు వెళ్లి సంతకాల సేకరణ చేపడతామన్నారు. నవంబర్ ఆఖరి వారంలో సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్న లక్షలాది మందితో కలిసి ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ఖర్గే, రాహుల్ గాంధీ నేతృత్వంలో ర్యాలీ నిర్వహించబోతున్నట్లు ఆమె ప్రకటించారు.

**ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న బిజెపి**

దేశ ప్రజాస్వామ్య వ్యవస్థను ఖూనీ చేస్తూ బిజెపి అవకతవకలకు పాల్పడుతోందని టిపిసిసి అధ్యక్షులు తరువాయి 2లో



## భావప్రకటన స్వేచ్ఛ లేకపోతే

# ప్రజాస్వామ్యం నిలవదు

- ఇది కేవలం న్యాయసూత్రం కాదు, జీవనసత్యం
- మీడియా చేతులు దాటిన సోషల్ మీడియా
- కొద్దిమంది సంపన్నుల చేతుల్లో కేంద్రీకరణ
- అక్షరశస్త్రధారి సి. రాఘవాచారి 6వ స్మారకోపన్యాసంలో భారత సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి
- ప్రజల పక్షాన పనిచేసేందుకే మీడియాను రాజ్యాంగంలో చేర్చలేదు : కె. శ్రీనివాస్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

‘భావప్రకటన స్వేచ్ఛ లేకపోతే ప్రజాస్వామ్యం నిలవదు’ అని భారత సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి అన్నారు. ‘విశాలాంధ్ర మాజీ సంపాదకులు సి.రాఘవాచారికి భయమనే పదం తెలియదు. సత్యం పట్ల ఎన్ని కష్టాలు వచ్చినా వెనక్కు తగ్గకుండా ‘విశాలాంధ్ర’ను నిలబెట్టారు. విశాలాంధ్రను కేవలం పత్రికగా కాకుండా, ఒక విలువల వేదికగా నిలబెట్టిన మహానుభావుడు రాఘవాచారి’ అని జస్టిస్ సుదర్శన్ రెడ్డి కొనియడారు. అటువంటి మహనీయుని స్మారకోపన్యాసంలో పాల్గొనడం నా అదృష్టం’ అని జస్టిస్ సుదర్శన్ రెడ్డి అన్నారు. సి.రాఘవాచారి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రముఖ జర్నలిస్ట్, విశాలాంధ్ర పూర్వ సంపాదకులు అక్షరశస్త్రధారి సి.రాఘవచారి 6వ స్మారకోపన్యాసం సోమాజిగూడలోని హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ‘ప్రసార మాధ్యమాలు న్యాయ వ్యవస్థ’ అనే అంశంపై జస్టిస్ సుదర్శన్ రెడ్డి ప్రసంగిస్తూ మూడు దశాబ్దాల పాటు సంపాదకుడిగా తరువాయి 12లో


## ఆర్థికపర అంశాలలో ‘సుప్రీం’ జోక్యం చేసుకోదు

సిజెఐ బి.ఆర్.గవాయ్ స్పష్టీకరణ

‘వాణిజ్య కోర్టుల స్టాండింగ్ ఇంటర్నేషనల్ ఫోరం’ ఆరవ పూర్తి సమావేశంలో ప్రసంగం



**న్యూఢిల్లీ :** న్యాయవ్యవస్థ చట్ట పాలనకు స్థిరమైన సంరక్షకుడిగా ఉన్నదని, ప్రాథమిక హక్కుల ఉల్లంఘన లేదా రాజ్యాంగంలోని ఇతర నిబంధనల ఉల్లంఘన జరిగితే తప్ప ఆర్థిక అంశాలకు సంబంధించిన విధానపరమైన విషయాలలో అత్యున్నత న్యాయస్థానం జోక్యం చేసుకోబోదని హామీ ఇచ్చిందని భారత ప్రధానన్యాయమూర్తి (సిజెఐ) బి.ఆర్.గవాయ్ స్పష్టంచేశారు. శనివారం ఇక్కడ జరిగిన ‘వాణిజ్య న్యాయస్థానాల స్టాండింగ్ ఇంటర్నేషనల్ ఫోరం’ ఆరవ పూర్తి సమావేశంలో ఆయన కీలక ప్రసంగం చేశారు. వాణిజ్య, కార్పొరేట్ విషయాలలో సుప్రీంకోర్టు పారదర్శకత, సమగ్రతను నిర్ధారించడంలో అప్రమత్తంగా ఉందని, చట్టపరమైన లేదా కార్పొరేట్ నిర్మాణాలను మోసపూరిత లాభం కోసం దుర్వినియోగం చేసే ప్రయత్నాలను తప్పక తిరస్కరిస్తుందని బి.ఆర్.గవాయ్ అన్నారు. ‘రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు లేదా ఇతర నిబంధనల తరువాయి 2లో



జన్మదినం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛాలను ఇచ్చి శుభాకాంక్షలు తెలిపిన పలువురు మంత్రులు, సినీ, రాజకీయ నేతలు

## ‘విశ్వగురు’వెళ్ళడం ఖాయం

జి–20 సదస్సుకు ప్రధాని మోదీ హాజరుపై కాంగ్రెస్ ఎద్దేవా



**న్యూఢిల్లీ:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ జి–20 సదస్సుకు వెళ్ళడం లేదు కాబట్టి, ఇక ‘విశ్వగురు’ (ప్రధానమంత్రి నరేంద్రమోదీ)ఆ సదస్సుకు వెళ్ళడం ఖాయమని కాంగ్రెస్‌పార్టీ వ్యంగ్యాస్త్రాలు సంధించింది. కౌలాలంపూర్‌లో గతనెల జరిగిన ‘ఏసియన్’ సదస్సులో ట్రంప్ పాల్గొన్నందువల్ల నరేంద్రమోదీ వెళ్ళలేదని, ఇక ఇప్పుడు జి–20 సదస్సును బహిష్కరిస్తున్నట్లు ట్రంప్ చెప్పారు కాబట్టి జోహన్నెస్‌బర్గ్‌లో జరిగే సమావేశాలకు మోదీ ఖాయంగా వెళతారని ఎఐసిసి ప్రధాన కార్యదర్శి, ఆ పార్టీ కమ్యూనికేషన్ల తరువాయి 12లో

## జి–20 సదస్సు

# అమెరికా బహిష్కరణ

డొనాల్డ్ ట్రంప్ ఉద్ఘాటన

తమదేశం నుంచి ఎవరూ హాజరుకాబోరని స్పష్టీకరణ

సదస్సు దక్షిణాఫ్రికాలో జరగడం పూర్తి అవమానకరమని వ్యాఖ్య



**న్యూయార్క్/వాషింగ్టన్:** దక్షిణాఫ్రికాలో జరిగే జి–20 సదస్సుకు అమెరికా బహిష్కరించిందని ఆ దేశ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరోసారి ఉద్ఘాటించారు. ఈ సదస్సుకు తమదేశం నుండి తానుగానీ, తమ దేశ ప్రతినిధులుగానీ హాజరుకాబోరని స్పష్టం చేశారు. జి–20 సదస్సు దక్షిణాఫ్రికాలో జరగడం పూర్తి అవమానకరమైనదిగా పేర్కొన్నారు. దక్షిణాఫ్రికాలో జాతిపరంగా మైనారిటీలుగా ఉన్న గ్రూపుపై నిరంతరాయంగా ఈనాటికి మానవ హక్కుల దోపిడీ కొనసాగుతోందని ట్రంప్ మండిపడ్డారు. ఈవారారంభంలోనే ఆయన స్పందిస్తూ ఈ సదస్సుకు తాను వెళ్ళడంలేదని చెప్పారు. డచ్‌దేశీయులు, ఫ్రెంచ్, జర్మన్ దేశీయులు దక్షిణాఫ్రికాలో జీవిస్తున్నారని, వారిపట్ల తీవ్ర వివక్ష చూపిస్తూ వారిని హతమారుస్తున్నారని ట్రంప్ విమర్శిఃచారు. ఈ మేరకు శుక్రవారం ఆయన తన ట్రూత్ సోషల్‌లో పోస్టింగ్ పెట్టారు. ఆ దేశంలో మానవ హక్కుల దోపిడీ కొనసాగినంతకాలం తమ దేశీయులు అక్కడికి వెళ్ళరన్నారు. ఫ్లోరిడా రాష్ట్రం తరువాయి 12లో




# ప్రపంచం
WORLD NEWS

## గాజాకు మరో 15 మృతదేహాలు అప్పగించిన ఇజ్రాయెల్

**ఖాన్‌యూనిస్:** పశ్చిమ ఆసియాలో శాంతి ఒప్పందం ప్రకారం హమాస్ సంస్థ నెలరోజులుగా ఇప్పటివరకూ 23 మంది బందీల మృతదేహాలను ఇజ్రాయెల్‌కు స్వాధీనం చేయగా, నెతన్యాహూ ప్రభుత్వం శనివారం 15 మంది పాలస్తీనియన్ల మృతదేహాలను గాజా ప్రభుత్వానికి అప్పగించింది. హమాస్ సంస్థ ఇంకా ఐదుగురు బందీల మృతదేహాలను లేదా వారి అస్థికలను ఇజ్రాయెల్‌కు స్వాధీనం చేయాల్సి ఉంది. ఒక్క బందీని అప్పగిస్తే 15 మంది పాలస్తీనియన్లను తిరిగి అప్పగిస్తామన్నది ఇజ్రాయెల్ చేసుకున్న ఒప్పందం. ఈ మేరకు రెండు వైపులా అధికారులు మృతదేహాలను అప్పగించుకుంటున్నారు. ట్రంప్ మధ్యవర్తిత్వంతో అక్టోబరు 10వ తేదీ నుండి గాజాలో శాంతి ఒప్పందం అమలులోకి వచ్చింది. ఇప్పటివరకూ ఇజ్రాయెల్ 300 మంది పాలస్తీనియన్ ఖైదీల మృతదేహాలను గాజాలో ప్రభుత్వానికి అప్పగించింది.

## జన్యుశాస్త్రవేత్త, నోబెల్ గ్రహీత జేమ్స్ వాట్సన్ మృతి



**న్యూయార్క్:** నోబెల్ బహుమతి గ్రహీత జేమ్స్ వాట్సన్ మరణించారు. ఆయన వయసు 97 సంవత్సరాలు. ఆయన ప్రధానంగా జన్యుశాస్త్ర రంగంలో పనిచేశారు. ఆయన ఎన్నో వివాదాలలో చిక్కుకున్నప్పటికీ, జన్యు రంగంలో ఆయన చేసిన కీలక ఆవిష్కరణల ఆధారంగా జన్యుశాస్త్ర అధ్యయనం ముందుకు కొనసాగుతున్నది. 2014లో ఆయన తన నోబెల్ పతకాన్ని 4.8 మిలియన్ డాలర్లకు విక్రయించి వార్తల్లో నిలిచారు. దీర్ఘకాలం గా అనారోగ్యంతో బాధపడుతున్న జేమ్స్ వాట్సన్ న్యూయార్క్‌లోని ఒక ఆసుపత్రిలో మరణించారు. ఆయన భార్య ఎలిజిబెత్ లెవిస్. వారికి ఇద్దరు పిల్లలు. డిఎన్‌ఎ అణువులో ఉన్న డబుల్ హెలిక్స్ నిర్మాణాన్ని ప్రతిపాది స్తూ ఫ్రాన్సిస్ క్రిక్, మారిస్ విల్కిన్స్‌లతో కలిసి 1953లో ఆయన ఒక పరిశోధనా పత్రాన్ని ప్రచురించారు. న్యూక్లియక్ ఆమ్లాల పరమాణు నిర్మాణం, జీవ పదార్థంలో సమాచార బదిలీకి సంబంధించి దానికి ఉన్న ప్రాముఖ్యతను వివరిస్తూ జేమ్స్ వాట్సన్ చేసిన సంచలనాత్మకమైన ఆవిష్కరణ పరమాణు జీవశాస్త్రంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చింది. ఈ ఆవిష్కరణకుగాను 1962లో శరీర ధర్మశాస్త్రం(మెడిసిన్)లో ఆయనకు నోబెల్ బహుమతి లభించింది. ఆయన అనేక సైన్స్ పుస్తకాలు రాశారు. వాటిల్లో ''మాలిక్యులర్ బయాలజీ ఆఫ్ ద జీన్'' 1965లో అత్యుత్తమమైన పాఠ్యపుస్తకంగా విరాజిల్లింది. ఆయన రాసిన ''డబుల్ హెలిక్స్'' అనే పుస్తకం ప్రపంచవ్యాప్తంగా భారీగా అమ్ముడుపోయి 1968లో సంచలనం సృష్టించింది. హ్యూమన్ జీనోమ్ ప్రాజెక్టును స్థాపించడంలో ఆయన ఎంతగానో కృషి చేశారు. ఆ తర్వాత 2003లో ఆ ప్రాజెక్టు ''మానవ జన్యువు మ్యాపింగ్'' పనిని విజయవంతంగా పూర్తిచేసింది. జేమ్స్ ద్యూయీ వాట్సన్ 1928లో ఏప్రిల్ 6వ తేదీన చికాగోలో జన్మించారు.

అమెరికన్ మాలిక్యుయర్ శాస్త్రవేత్త, జన్యుశాస్త్రవేత్త, జంతుశాస్త్రవేత్తగా ఆయన పేరుగాంచా రు. 1947లో ఆయన చికాగో యూనివర్సిటీలో బ్యాలర్ డిగ్రీలు సంపాదించారు. ఇండియానా యూనివర్సిటీ బ్లూమింగ్టన్‌లో పిహెచ్‌డి చేశారు. కొపెన్‌హాగన్ విశ్వవిద్యాలయంలో పోస్ట్ డాక్టోరల్ చేశారు. కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం కావెండిష్ ప్రయోగశాలలో పనిచేశారు. అక్కడే ఆయన ఫ్రా న్సిస్ క్రిక్‌ను కలిశారు. 1956 నుండి 1976 వరకూ హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో జీవశాస్త్ర అధ్యాపకుడుగా పనిచేశారు. పరమాణు జీవశాస్త్రంలో పరిశోధనలకు అందరినీ ప్రోత్సహించారు. 1968 నుండి కోల్డ్ స్ప్రింగ్ హార్బర్ లేబొరేటరీ (సిఎస్‌హెచ్‌ఎల్) డైరెక్టర్‌గా పనిచేశారు. తర్వాత ఛాన్సలర్ స్థాయికి ఎదిగారు. ఈ లేబొరేటరీని మాలిక్యులర్ బయాలజీలో ప్ర పంచ ప్రసిద్ధ పరిశోధనా కేంద్రంగా తీర్చిదిద్దారు. తర్వాత కేన్సర్ పరిశోధనలపై దృష్టి మళ్ళించారు. జాతి–మేధస్సు మధ్య జన్యుపరమైన సంబం ధం ఉందని ఆయన వివాదాస్పద ప్రకటనలు చేసి వాటిని పునరుద్ఘాటించడంతో సిఎస్‌హెచ్‌ఎల్ అప్పటివరకూ ఆయనకు ఇచ్చిన గౌరవ బిరుదులను రద్దుచేసుకుంది. ఛాన్సలర్ పదవి నుండి తొలగించింది.

## మాలీలో ఐదుగురు భారతీయ కార్మికుల కిడ్నాప్

**కోబ్రి:** పశ్చిమ ఆఫ్రికాదేశం మాలీలోని ఒక కంపెనీలో పనిచేస్తున్న ఐదుగురు భారతీయ కార్మికులను ఇస్లామిస్టు ఉగ్రవాదులు కిడ్నాప్ చేశారు. ఆ దేశంలో అల్‌ఖైదా, ఐఎస్ఐఎస్ అనుబంధ ఉగ్రవాదుల కార్యకలాపాలు రోజు రోజుకూ ఉద్ధృతమవుతున్న తరుణంలో భారతీయులు అపహరణకు గురయ్యారు. విదేశీయులను లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాద మద్దతుగల నేర ముఠాలు రెచ్చిపోతున్నాయి. పశ్చిమ మాలీలోని కోబ్రిలో గురువారం ఈ కిడ్నాప్ ఘటన జరిగినట్లు పేరు చెప్పడానికి ఇష్టపడని సంబంధిత కంపెనీ ప్రతినిధి ఒకరు శనివారం చెప్పారు. భారతీయుడికి చెందిన ఈ కంపెనీలో అనేకమంది భారతీయ కార్మికులు, ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఈ ఘటన తర్వాత కంపెనీలో ఉన్న మిగిలిన కార్మికులు, ఉద్యోగులను రాజధాని బొమాకోకి తరలించారు. అపహరణకు గురైన కార్మికులు అందరూ విద్యుద్దీకరణ నిర్మాణ కార్యక్రమాల్లో శారీరక శ్రమచేస్తుండగా సాయుధులైన ఉగ్రవాదులు వారిని అపహరించారు. ఐతే తామే ఈ కిడ్నాపులు చేశామని ఏ ఉగ్రవాద సంస్థా ఇప్పటివరకూ ప్రకటన విడుదల చేయలేదు. ఐతే అల్‌ఖైదా, ఐఎస్ఐఎస్ సంస్థ అనుబంధ ఉగ్రవాద నేరస్థులే ఈ చర్యకు పాల్పడ ఉంటారని అనుమానిస్తున్నారు. విదేశీయులను అపహరించడం, వారిని సమస్యల్లోకి నెట్టడం మాలిలో 2012 నుండీ నిత్యకృత్యంగా సాధారణ విషయంగా మారిపోయింది. గడచిన సెప్టెంబరు నెలలో కూడా ఇద్దరు ఎమిరిటస్ జాతీయులను, ఒక ఇరాన్ జాతీయుణ్ణి కూడా ఉగ్రవాద నేర ముఠాలు అపహరించాయి. ఐతే వారికి 50 మిలియన్ డాలర్లు ధనం ముట్టజెప్పడంతో ఇటీవలే వారు ముగ్గురినీ ఉగ్రవాదులు విడుదల చేశారు.



### తీవ్రరూపం దాల్చిన చమురు సంక్షోభం

మాలీదేశం ప్రస్తుతం సైనిక నియంతల పరిపాలనలో ఉంది. అల్‌ఖైదీ, ఇస్లామిస్టు ఉగ్రవాద గ్రూపులు, నేరముఠాలు సాగిస్తున్న తీవ్ర హింసాకాండతో మాలీ దేశం అతలాకుతలమవుతున్నది. మాలీ రాజధాని బొమాకోలో గడచిన రెండు నెలలుగా తీవ్రమైన ఇంధన కొరత ఉంది. అల్‌ఖైదా ఉగ్రవాద ముఠాలు మాలీలోకి వస్తున్న ఇంధన వనరులను రానివ్వకుండా అడ్డుపడుతున్నాయి. అరాచకాలు సృష్టిస్తున్నాయి.దీంతో దిగుమతి ఇంధన వనరులు దేశంలోకి ప్రవేశించడంలేదు. ఇస్లాం–ముస్లిం జీహదిస్టుల మద్దతుగల ముఠాలు ఈ దారుణాలకు పాల్పడుతున్నాయి.

## నైజీరియాలో ట్రంప్ సైనికచర్య హెచ్చరిక

క్రైస్తవుల మనుగడకు ప్రమాదం!

**అబూజా:** పశ్చిమ ఆఫ్రికాదేశం నైజీరియాలో సైనిక చర్య చేపడతామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ హెచ్చరిక చేశారు. నైజీరియాలో క్రైస్తవులను లక్ష్యంగా చేసుకుని దాడులు, హత్యలకు పాల్పడుతున్న ఘటనల నేపథ్యంలో ట్రంప్ పైవిధంగా హెచ్చరిక చేశారు. ఉత్తర నైజీరియాలో ముస్లిం జనాభా అత్యధికంగా ఉండగా, దక్షిణ నైజీరియాలో క్రైస్తవులు అత్యధికంగా ఉన్నారు. ఈ రెండు ప్రాంతాలమధ్యా తీవ్ర విభజన ఏర్పడింది. క్రైస్తవ మస్తులను హత్య చేస్తున్నారని, ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తూ క్రైస్తవుల హత్యలకు అవకాశం ఇస్తోందని, ఆ దేశంలో క్రైస్తవుల మనుగడకు ప్రమాదం వాటిల్లిందని ట్రంప్ ఆందోళన వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో ఒక పోస్టింగ్ పెడుతూ, పరిస్థితి ఇదేవిధంగా కొనసాగి క్రైస్తవుల హత్యలకు ప్రభుత్వం అవకాశం కలిగిస్తే నైజీరియాకు అమెరికా అందిస్తున్న సహాయాన్ని తక్షణం నిలిపివేస్తామని హెచ్చరించారు. ఈ దారుణాలకు కారణమైన ఇస్లామిస్టు ఉగ్రవాదాన్ని నైజీరియాలో పూర్తిగా తుడిచిపెడతామని హెచ్చరించారు. సైనిక చర్యకు సిద్ధంగా ఉండాల్సిందిగా అమెరికా 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ వార్'కు ఆదేశాలిస్తున్నానన్నారు. నైజీరియాలో మతపరమైన వైరుధ్యాలపై మళ్ళీ విస్తారంగా చర్చ ప్రారంభమైన తరుణంలో ట్రంప్ పైవిధంగా స్పందించారు. ఒక్క నైజీరియాలోనే 3,100 మంది క్రైస్తవులను హతమార్చారనీ,



ప్రపంచవ్యాప్తంగా 4,426 మంది క్రైస్తవులు హతులయ్యారని, నైజీరియాలో క్రైస్తవ మత మనుగడకు ఇది పెద్ద ప్రమాదంగా పరిణమించిందని ట్రంప్ ఆందోళన వ్యక్తం చేశారు. రాడికల్ ఇస్లామిస్టు గ్రూపులే ఇలాంటి దారుణాలకు పాల్పడుతున్నాయని, అందువల్ల నైజీరియాలో తక్షణం సైనిక చర్య చేపట్టాల్సిన ఆవశ్యకత వచ్చిందని అన్నారు. నైజీరియాలో మతస్వేచ్ఛలేదని, అక్కడ క్రైస్తవుల ఊచకోత పెరిగిందని ఇటీవల అనేక ఇంటర్వ్యూలలో ట్రంప్ చెబుతూ వస్తూ ఉండటంతో నైజీరియా దేశాన్ని అమెరికా రక్షణశాఖ తన నిశిత పర్యవేక్షణా జాబితాల దేశాలలో చేర్చింది. ఐతే ఈ విషయంలో ఇతర దేశాల సహాయాన్ని అర్థించినప్పుడు నైజీరియా సార్వభౌమాధికారాన్ని కూడా పరిగణనలోకి తీసుకుని గౌరవిస్తామని అన్నారు.

## పాకిస్థాన్ సైనిక వ్యవస్థ పునర్వ్యస్థీకరణ

ఆసిఫ్ మునీర్‌కు తిరుగులేని అధికారాలు!



**ఇస్లామాబాద్:** భారతదేశం చేపట్టిన ఆపరేషన్ సిందూర్, సైనిక సంఘర్షణ తర్వాత పాకిస్థాన్ తన సైనిక వ్యవస్థను పునర్వ్యవస్థీకరించే పనిలో నిమగ్నమైంది. ఆ దేశంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రాజ్యాంగ 27వ సవరణ కార్యక్రమంలో న్యాయ వ్యవస్థలో మార్పులతోపాటు సైన్యాన్ని కూడా సంస్కరించే దిశగా చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు కమాండర్ ఆఫ్ ద నేషనల్ స్ట్రాటజిక్ కమాండ్ పదవి పుట్టుకొస్తుంది.పదాతిదళం, వైమానిక, నావికాదళాల అధికారాలను ఏకం చేస్తూ యూనిఫైడ్ కమాండ్ ఏర్పాటు ద్వారా ఆసిఫ్ మునీర్‌కు తిరుగులేని అధికారాలు కట్టబెట్టేందుకు రంగం సిద్ధమైంది. ఆర్థికంగా దేశీయంగా అప్పుల ఊబిలో కూరుకున్నప్పటికీ, భారతదేశంపై పైచేయి సాధించేందుకు సైన్యంలో సంస్కరణలు చేపడుతున్నది. యూనిఫైడ్ కమాండ్‌ను ఏర్పాటు చేయడం ద్వారా ఆసిఫ్ మునీర్‌కు సూపర్ పవర్స్ లభిస్తాయి. ఈ 27వ రాజ్యాంగ సవరణ బిల్లును శనివారం మధ్యాహ్నం సెనేట్‌లో ప్రవేశపెట్టారు. సవరణ ద్వారా రాజ్యాంగంలోని 243వ నిబంధనను పునర్లిఖిస్తున్నారు. ఈ ప్రకారం పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఇకమీదట 'చీఫ్ ఆఫ్ డిఫెన్స్ ఫోర్సెస్' స్థాయికి ఎదుగుతారు. ఈ మేరకు సిజెసిఎస్‌సి (ఛైర్మన్ ఆఫ్ ద జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ కమిటీ) రద్దు అవుతుంది.243వ అధికరణలో మార్పుల ప్రకారం ప్రధానమంత్రి సలహా మేరకు రాష్ట్రపతి త్రివిధ దళాధిపతులను నియమిస్తారు. ఫైవ్ స్టార్ ర్యాంక్ ఆఫీసర్లకు జీవితకాల రక్షణ ఉంటుంది. భారత్ నుండి గుణపాఠాలు నేర్చుకున్న పాకిస్థాన్ ఇప్పుడు కమాండర్ ఆఫ్ డిఫెన్స్ ఫోర్సెస్ అనే పదవి ఏర్పాటు చేసే విషయం పరిశీలిస్తోంది.

## దుర్వినియోగం

(మొదటి పేజీ తరువాయి)

బి.మహేష్ కుమార్ గౌడ్ తీవ్రంగా విమర్శించారు. జూబ్లీ హిల్స్ నియోజకవర్గంలో గతంలో పక్క జిల్లాల ఓటర్లను నమోదు చేసి, బిజెపి సహకారంతో బిఆర్ఎస్ గెలిచిన ఉదాహరణను ప్రజలు గుర్తుంచుకోవాలన్నారు. హర్యానా, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో జరిగిన ఓటు చోరీలను ప్రజలు అర్థం చేసుకోవాలని పిలుపునిచ్చారు. దేశంలో జరుగుతున్న ఓటు చోరీలపై రాహుల్ గాంధీ ఎనలేని పోరాటం చేస్తున్నారని, లోక్‌సభతోపాటు మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి చేసిన అవకతవకలను కాంగ్రెస్ ఆధారాలతో సహా నిరూపిస్తోందన్నారు. కర్ణాటకలోని మహదేవ్పుర నియోజకవర్గంలో ఓటర్ల జాబితాలో జరిగిన భారీ తప్పిదాలు, బీజేపీ మోసాలను రాహుల్ గాంధీ ఆధారాలతో సహా బయటపెట్టినా ఎన్నికల సంఘం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరమన్నారు. హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో కూడా బిజెపి చేసిన కుట్రలను రాహుల్ గాంధీ స్పష్టమైన రుజువులతో నిరూపించారని తెలిపారు. హర్యానాలో 25 లక్షలకుపైగా నకిలీ ఓటర్లు, 5 లక్షల డూప్లికేట్ ఓటర్లు, వందలాది తప్పుడు చిరునామాలు, వేలాది తప్పు ఫోటో వివరాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఒకే మహిళ ఫోటోతో 22 ఎంట్రీలు, 100 ఓటరు కార్డులు ఉన్నట్టుగా రాహుల్ గాంధీ గుర్తించారని చేశారని చెప్పారు. బిహార్‌లో కూడా బిజెపి సహకారంతో 'సర్' పేరుతో సంబంధం లేని ఓట్లను తొలగించిందని విమర్శించారు.

ఓటు చోరీ ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించే చర్యగా అభివర్ణించారు. ఎన్నికల సంఘం ప్రస్తుతం బిజెపి చెప్పుచేతుల్లో ఉందని, ఏకపక్షంగా వ్యవహరిస్తోందని మహేష్‌కుమార్ ఆరోపించారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రాహుల్ గాంధీ బీహార్‌లో ప్రారంభించిన 'ఓటు అధికార్ ర్యాలీ' బిజెపిలో వణుకు పుట్టించిందని మహేష్ గౌడ్ అన్నారు. హర్యానా ఫార్ములాను అనుసరించి బిజెపి ఇప్పుడు బీహార్‌లో గెలవాలని ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఇందిరా గాంధీ ఏనాడు అవకతవకలకు పాల్పడలేదు. ఓటు హక్కు కాలరాసే హక్కు ఎవరికీ లేదు అని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

## 'సుప్రీం' జోక్యం చేసుకోదు

(మొదటి పేజీ తరువాయి)

ఉల్లంఘన వరకూ ఆర్థిక పరిగణనలు ఉన్న విధానపరమైన విషయాలను సుప్రీంకోర్టు జోక్యం చేసుకోబోదని నిర్ధారించింది' అదేవిధంగా, ఏదైనా వాణిజ్య చట్టాన్ని వ్యాఖ్యానించడం న్యాయంగా, ప్రజాప్రయోజనాలను కాపాడుకోవడానికి శాసనసభకు అనుగుణంగా ఉండాలని సుప్రీంకోర్టు పునరుద్ఘాటించింది' అని సిజెఐ తెలిపారు. ఆర్థిక స్వేచ్ఛ, నియంత్రణ క్రమశిక్షణ, న్యాయబద్ధత మధ్య సున్నితమైన సమతుల్యతను సుప్రీంకోర్టు స్థిరంగా సమర్థించిందని గవాయ్ వివరించారు. 'రాష్ట్ర అధికారం, నియంత్ర ణ, పన్నులు వంటి ప్రత్యేక అంశాలు స్పష్టమైన శాసనంపై ఆధారపడి ఉండాలని, రాజ్యాంగ పరిమితుల్లో పనిచేయాలన్నది ఇది బలోపేతం చేసింది. నియంత్రణ సంస్థలు ఆర్థిక స్థిరత్వాన్ని, ప్రజల విశ్వాసాన్ని పరిరక్షిస్తున్నప్పటికీ వారి చర్యలు ఎల్లప్పుడూ దామాషా ప్రకారం సహేతుకంగా ఉంటాయని కోర్టు నొక్కిచెప్పింది' అని ఆయన చెప్పారు. వాణిజ్య, కార్పొరేట్ విషయాలలో కోర్టు పారదర్శకత, సమగ్రతను నిర్ధారించడంలో, మోసపూరిత లాభం కోసం చట్టపరమైన లేదా కార్పొరేట్ నిర్మాణాల ప్రయత్నాలను తిరస్కరించడంలో అప్రమత్తంగా ఉంటుంది. ఆర్థిక వ్యవస్థ ఆరోగ్యానికి సకాలంలో పరిష్కారం, జవాబుదారీతనం అనే క్రమశిక్షణ చాలా ముఖ్యమైదని ఇది నొక్కిచెప్పింది. అంతేకాకుండా వాణిజ్యం అంతిమంగా మానవ సంక్షేమం, సామాజిక న్యాయానికి సేవ చేయాలని కూడా గుర్తిస్తున్నట్లు ఆయన అన్నారు. కార్పొరేట్ పాలన, దివాలా, మధ్యవర్తిత్వం, పర్యావరణ జవాబుదారీతనం వంటి విభిన్న రంగాలలో కోర్టు విధానం జోక్య వాదం కంటే సూత్రప్రాయంగా ఉన్నదని భారత ప్రధాన న్యాయమూర్తి చెప్పారు. భారతదేశం డిజిటల్ మరియు గ్రీన్ ఎకానమీ వైపు అడుగులు వేస్తున్నందున వాణిజ్య చట్టం స్థిరత్వం, నైతిక సంస్థను తప్పక ప్రోత్సహించాలని బి.ఆర్.గవాయ్ సూచించారు. 'భారతీయ కంపెనీలు కార్పొరేట్ రిపోర్టింగ్‌లో ఇఎస్‌జిని అనుసంధానించడం పెరుగుతోంది. ఇది స్వాగతించదగిన ధోరణి. ఎందుకంటే మార్కెట్లు బాధ్యతలో లంగరు వేయబడినప్పుడు పనిచేస్తాయి. లాభం లక్ష్యంతో అనుసంధానించబడాలి' అని సిజెఐ చెప్పారు.

## ఈశాన్యరాష్ట్రాల్లో విద్యారంగంపై 11 ఏళ్ళల్లో రూ.21వేలకోట్ల పెట్టుబడి

**గోహ్పూర్ (అసోం):** ఈశాన్యప్రాంత రాష్ట్రాలలో విద్యారంగానికి కేంద్ర ప్రభుత్వం గడచిన 11 సంవత్సరాలలో రూ.21,000కోట్లు పెట్టుబడిగా సమకూర్చిందని ఆర్థికశాఖామంత్రి నిర్మలాసీతారామన్ చెప్పారు. ఇదేకాలంలో కొత్త రైల్వే స్టేషన్లు, పలు గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాల నిర్మాణం జరగడంతో ఈ ప్రాంతంలో అనుసంధాన కార్యకలాపాలు కూడా బ్రహ్మాండంగా ఊపు అందుకున్నాయని చెప్పారు. శుక్ర–శనివారాలు అసోంలో నిర్మలాసీతారామన్ పర్యటించారు. అసోం బిశ్వంత్ జిల్లాలోని గోహ్పూర్‌లో భోలాగురి వద్ద మొట్టమొదటి సాంకేతిక–వృత్తి నైపుణ్య శిక్షణ విశ్వవిద్యాలయ నిర్మాణానికి పునాదిరాయి వేసిన సందర్భంగా శనివారం ఆమె మాట్లాడారు. ఈ స్టేట్ యూనివర్సిటీకి స్వాతంత్ర్య సమరయోధురాలు స్వాహిద్ కనక్‌లత బారువా పేరు పెట్టారు. రూ.415 కోట్ల ఖర్చుతో 241 ఎకరాల విస్తీర్ణంలో ఈ విశ్వవిద్యాలయాన్ని నిర్మిస్తారు. మొత్తం ఏడు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో భవన నిర్మాణాలు జరుగుతాయి. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుండి ఈశాన్యప్రాంత రాష్ట్రాలకు రూ.21వేలకోట్లు విద్యారంగంకోసం పెట్టుబడిగా సమకూర్చామనీ, 850 కొత్త పాఠశాలలను ప్రారంభించామని చెప్పారు. ఈ ప్రాంతంలో మొట్టమొదటి 'ఎయిమ్స్ (అఖిలభారత వైద్యవిజ్ఞాన సంస్థ) ప్రజల సేవల నిమిత్తం అందుబాటులోకి వచ్చిందని, మరో 200 నైపుణ్యాభివృద్ధి సంస్థలు కూడా కొత్తగా అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. దేశంలోనే మొదటి క్రీడా విశ్వవిద్యాలయం కూడా ఈ ప్రాంతంలోనే వస్తోందని చెప్పారు. ఒక్క అసోం రాష్ట్రంలోనే 15 కొత్త వైద్య కళాశాలు నిర్మించామని, దక్షిణాసియాలోనే అతిపెద్ద క్యాన్సర్ నియంత్రణ సంరక్షణ కేంద్రం అసోంలోనే పెడుతున్నామని, రాష్ట్రంలో రెండవ ఐఐఎం కూడా త్వరలో వస్తుందని అన్నారు. విద్యారంగానికిప్రోత్సాహం ఇవ్వడానికి కేంద్రం కూడా ఈ ప్రాంతంలో రైల్వే, గగనతల రవాణా మార్గాలనుఅభివృద్ధి చేసేందుకు కృషి చేస్తోందన్నారు. గడచిన 11 సం.లలో ఈ ప్రాంతంలో పది గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాలు నిర్మించామని నిర్మలాసీతారామన్ చెప్పారు.

## డిసెంబరు 1 నుంచి పార్లమెంట్

(మొదటి పేజీ తరువాయి)

విషయం తెలిసిందే. పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లోనూ బిహార్‌లో చేపట్టిన సర్‌పై అనేక ప్రతిపక్ష పార్టీలు తీవ్ర నిరసనలు వ్యక్తం చేశాయి. ఫలితంగా పార్లమెంటులో రోజువారీ అంతరాయాలు ఏర్పడ్డాయి. కాగా, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము డిసెంబర్ 1, 2025 నుండి డిసెంబర్ 19, 2025 వరకు (పార్లమెంటరీ వ్యవహారాల అత్యవసర పరిస్థితులకు లోబడి) పార్లమెంట్ శీతాకాల సమావేశాలు నిర్వహించాలనే ప్రభుత్వ ప్రతిపాదనను ఆమోదించిట్లు కిరణ్ రిజిజు ఎక్స్‌లో పోస్టు చేశారు. మన ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే, పజల ఆకాంక్షలకు సేవ చేసే నిర్మాణాత్మక, అర్థవంతమైన సమావేశాలు జరుగుతాయని ఆశిసున్నామన్నారు. ఈ నెల 14న వెలువడే బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను బట్టి పార్లమెంట్ సమావేశాల్లో ఆయా పార్టీలు తమ ఎజెండాలను ఖరారు చేయనున్నాయి. భారతదేశం 'ఆపరేషన్ సిందూర్' ప్రారంభించిన తర్వాత, వాణిజ్యంపై భారతదేశం, పాకిస్తాన్ మధ్య వైరుధ్యాలను అంతం చేయడంలో సహాయపడటంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదేపదే చేసిన వాదనలపై అనేక ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వం నుండి సమాధానాలు కోరే అవకాశం ఉంది. సెషన్ తేదీలను ప్రకటించిన వెంటనే, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. సెషన్ అసాధారణంగా ఆలస్యమని, సమావేశాలను కుదించారని పేర్కొన్నారు. కేవలం 15 పని దినాలు మాత్రమే సభలు సమావేశం కానున్నాయని, ప్రభుత్వానికి లావాదేవీలు నిర్వహించాల్సిన పని లేదు, బిల్లులు ఆమోదించాల్సిన అవసరం లేదు, చర్చలు అనుమతించాల్సిన అవసరం లేదు అని రమేష్ ఎక్స్‌లో పోస్ట్‌లో చేశారు. అదే విధంగా ప్రభుత్వానికి 'పార్లమెంట్–ఓఫోబియా' ఉందని తృణమూల్ కాంగ్రెస్ నాయకుడు డెరెక్ ఓ బ్రెయిన్ ఆరోపించారు. దీనిని పార్లమెంటులో ప్రతిపక్షాలను ఎదుర్కోవడానికి భయపడుతోందన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ఆయన బృందం పార్లమెంటు–ఓఫోబియా అనే తీవ్రమైన పరిస్థితితో బాధపడుతుందని ఎద్దేవా చేశారు. ఇదిలా ఉండగా, గత సంవత్సరం పార్లమెంటు శీతాకాల సమావేశాలు నవంబర్ 25 నుండి డిసెంబర్ 20 వరకు జరిగాయి. ఎన్నికలు జరగనున్న తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలతో సహా 12 రాష్ట్రాలు , కేంద్రపాలిత ప్రాంతాలలో ఎన్నికల కమిషన్ రెండవ దశ ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ఆఫ్ ఓటరు జాబితాలను ప్రారంభించింది. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియ రెండవ దశ ఈనెల 4న గణన స్థితితో ప్రారంభమైంది, డిసెంబర్ 4 వరకు కొనసాగుతుంది. డిసెంబర్ 9న ఇసి ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేస్తుంది. తుది ఓటర్ల జాబితాను ఫిబ్రవరి 7న ప్రచురించబడుతుంది.

## రోడ్ల నిర్మాణం

(మొదటి పేజీ తరువాయి)

వరకు ఉన్న హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారిని 8 లైన్లు రహదారిగా విస్తరించనున్నాం అని ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం నాలుగు లైన్లుగా ఉన్న జాతీయ రహదారిని ఎనిమిది లైన్లుగా విస్తరిస్తున్నాం అన్నారు, ఇందులో ఆరు లైన్లు ప్రధాన రహదారి కాగా రెండు సర్వీసు రోడ్ల నిర్మాణం జరుగుతుందని తెలిపారు. రహదారి వెంట ఉన్న గ్రామీణ ప్రాంత ప్రజల సౌకర్యార్థం, రోడ్డు ప్రమాదాలు నివారించడమే లక్ష్యంగా సర్వీస్ రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణానికి రూ.10,400 ఖర్చు చేయనున్నట్టు తెలిపారు.

తెలంగాణ రాష్ట్ర గతిని మార్చే రీజనల్ రింగ్ రోడ్డు ( ట్రిబుల్ ఆర్) నిర్మాణానికి రూ.36,000 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఆరు లైన్లుగా నిర్మించబోతున్న రీజినల్ రింగ్ రోడ్డు అన్ని జిల్లాలను కలుపుతుందని వివరించారు. ఈ రహదారి నిర్మాణానికి 50 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని వివరించారు. రహదారులు లేని గ్రామీణ ప్రాంతాల్లో కొత్త రోడ్ల నిర్మాణం.

సింగిల్ రోడ్డు ఉన్నచోట డబుల్ రోడ్ల నిర్మాణం.హెచ్ఎఎం ప్రాజెక్టుకు రూ.11,399 కోట్లు.. కొద్ది రోజుల్లో టెండర్లు పిలుస్తున్నాం అని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. ట్రాఫిక్ రద్దీని దృష్టిలో పెట్టుకొని రహదారుల నిర్మాణానికి అనుమతులు ఇస్తామన్నారు. వీటితో పాటుగా అదనంగా మరో 28 వేల కోట్లతో చేపట్టనున్న పనులు ప్రతిపాదనలో ఉన్నాయని మంత్రి వెంకటరెడ్డి తెలిపారు.

**రూ.8,000 కోట్లతో..**

మన్ననూరు నుంచి శ్రీశైలం వరకు 52 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి ప్రతిపాదనలు తుది దశకు చేరాయి అన్నారు. దేశానికే తలమానికంగా మారనున్న ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందరు పోర్ట్ వరకు గ్రీన్ ఫీల్డ్ హైవే. 20 వేల కోట్లతో నిర్మించనున్న ఈ రహదారి నిర్మాణంతో రాష్ట్ర ముఖచిత్రమే మారుతుందనీ తెలిపారు. భవిష్యత్తులో రహదారులపై ప్రమాదాలు జరగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. న భూతో న భవిష్యత్తు అన్న రీతిలో రహదారుల నిర్మాణానికి అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నల్గొండ నియోజకవర్గ ప్రజలకు ధన్యవాదాలు.

ఈ పనులకు సంబంధించి ప్రతి 15 రోజులకు ఒకసారి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క సమీక్ష నిర్వహించారు అని తెలిపారు. ముఖ్యమంత్రి, ఒక ముఖ్యమంత్రి ఢిల్లీ వెళ్లిన ప్రతి సందర్భంలోను రహదారులకు సంబంధించిన అంశాలపై సంబంధిత మంత్రులను కలిసి ఒత్తిడి తీసుకురావడం మూలంగా రహదారుల విషయంలో గొప్ప ప్రగతి కనిపించిందని మంత్రి వెంకటరెడ్డి తెలిపారు.

నా రాజకీయ జీవితంలో ఒక గొప్ప అవకాశాన్ని కల్పించిన అందరికీ ధన్యవాదాలు అని ప్రకటనలో పేర్కొన్నారు.

## కాంగ్రెస్‌ను గెలిపించండి

(మొదటి పేజీ తరువాయి)

ప్రజల సార్వత్రిక ఓటింగ్ హక్కుకు భంగం కలిగిస్తున్నదని, బిజెపికి అనుకూలంగా లేని వారికి ఓటు హక్కు ను తిరస్కరిస్తున్నారని, ఇలాంటి అనేక అంశాలతో కుట్రలపై ఆధారపడి అధికారం నిలబెట్టుకునేందుకు మోదీ ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కూడా బిజెపి దానికి అనుకూలంగా వివరిస్తున్న బిఆర్ఎస్ ను ఓడించాలని ప్రజలను కోరారు.

**మోదీ వైఖరి గర్హనీయం**

పాకిస్థాన్‌తో భారత్ యుద్ధాన్ని తామే ఆపామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పదేపదే చెబుతున్నప్పటికీ భారత ప్రధాని మోదీ దానిని ఖండించకపోవడమే కాకుండా కనీసం స్పందించకపోవడం గర్హనీయమని కూనంనేని సాంబశివరావు అన్నారు.

దేశ విధానాలను ప్రభావితం చేస్తున్న ట్రంప్ ప్రకటనలతో తమకు సంబంధం లేదని ఎందుకు చెప్పడం లేదని, అమెరికా విధిస్తున్న టారిఫ్‌లకు వ్యతిరేకంగా మోడీ ఒక్క మాట కూడా ఎందుకు మాట్లాడడం లేదని ఆయన ప్రశ్నించారు. అమెరికా ట్రంప్ కు వ్యతిరేకంగా మాట్లాడకపోవడం వ్యూహాత్మక ఎత్తుగడ అని బిజెపి ప్రచారం చేస్తుందని, అసలు ఆ ఎత్తుడగ ఏమిటో వెల్లడించాలని సాంబశివరావు డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ మౌనం గతంలో భారత్ ఏర్పాటు చేసుకున్న విదేశాంగ విధానాలను, సాంప్రదాయాలను, పద్ధతులను మంటగలుపుతున్నదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో వైపు అమెరికాలో భారత విద్యార్థుల భవిష్యత్తును ట్రంప్ ఆగమాగం చేస్తున్నా మోదీ మాట్లాడడం లేదని విమర్శించారు. న్యూయార్కులో సోషలిస్టు భావజాలం కలిగిన జోహరాన్ మమ్దానీని ఓడించాలని ట్రంప్‌తో పాటు బిల్ క్లింటన్ లాంటి వారు కూడా ప్రయత్నించినప్పటికీ, జాతి అహంకారానికి, దేశ, ప్రాంతీయ అహంకారానికి వ్యతిరేకంగా న్యూ యార్క్ మేయర్‌గా మమ్దానీ గెలవడం ద్వారా మంచిని గెలిపిస్తారని అక్కడి ప్రజలు రుజువు చేశారన్నారు.

**15 నుంచి సిపిఐ జాతాలు**

సిపిఐ వందేళ్ల ఉత్సవాల సందర్భంగా ఈనెల 15వ తేదీ నుంచి మూడు జాతాలను వారం రోజుల పాటు నిర్వహించనున్నట్లు సాంబశివరావు చెప్పారు. జోడేఘాట్ జాతాకు సిపిఐ సీనియర్ నాయకులు చాడ వెంకట రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాస్ రావు, కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్, బాసర జాతాకు సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్య పద్మ, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహా, గద్వాల్ జాతాకు సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాల నరసింహా నాయత్వం వహిస్తారని వివరించారు. అనంతరం 'ఇంటింటికి సిపిఐ' కార్యక్రమంలో భాగంగా జిల్లాల వారీగా జాతాలనుర్వహించనున్నట్లు ఆయన చెప్పారు.

**మావోయిస్టులకు విజ్ఞప్తి**

''కొంతమంది మావోయిస్టులు మంచి ఉద్దేశంతో లొంగిపోతున్నారు. ఇది మంచి సమయం. ఇప్పటికీ మావోయిస్టుల పట్ల ప్రజల కు అభిమానం ఉంది. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నిర్వహించిన కమ్యూనిస్టు పార్టీ, అనంతరం పునర్ విమర్శ చేసుకుని సాయుధ పోరాటాన్ని విరమించింది. అనంతరం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కమ్యూనిస్టులను అత్యంత భారీ మెజారిటీతో ప్రజలు గెలిపించారు. మావోయిస్టులు కూడా మంచి ఆలోచన చేసి సాయుధ పోరాటాన్ని విరమించాలని విజ్ఞప్తి చేస్తున్నాం. మావోయిస్టుల త్యాగాలు వృధా కావద్దు. కమ్యూనిస్లుందరూ కలిస్తేనే దేశానికి ప్రత్యామ్నాయం చూపగలుగుతాం'' అని కూనంనేని సాంబశివరావు అన్నారు.

**కమ్యూనిస్టుల ప్రాధాన్యత పెరుగుతున్నది**

దేశంలో,ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టుల ప్రాధాన్యత నిత్యం పెరుగుతున్నదని, నేపాల్ లో 11 కమ్యూనిస్టు పార్టీలు ఒకటయ్యాయని, ఇది భారత్‌కు మంచి సంకేతమని, భారతదేశంలో కూడా అలాంటి పరిస్థితి రావాలని కోరుకుంటున్నామని కూనంనేని సాంబశివరావు అన్నారు. శ్రీలంకలో, అమెరికా ఉప ఖండంలోని అనేక దేశాలలో కమ్యూనిస్టులు, వామపక్షాలు అధికారంలోకి వచ్చాయన్నారు. ప్రజలు వామపక్షాల వైపు ఉన్నారని, ప్రపంచంలోని మూడవ వంతు దేశాలలో వామపక్షాలు,కమ్యూనిస్టు జండాలు ఎగురుతున్నాయి.



# జనరల్
STATE & REGIONAL NEWS

## మూడో మహాసంగ్రామం ప్రసక్తేలేదు

'ముఖాముఖి'లో జయప్రకాశ్ నారాయణ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వేగంగా మారుతున్న ప్రపంచ పరిణామా లు మూడో మహా సంగ్రామానికి దారితీస్తాయన్న వాదనను లోక్ సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్ తిరస్కరించారు. సామాజిక విశ్లేషకులు, మోటివేషనల్ స్పీకర్ సుంకవల్లి సత్తిరాజు శనివారం హైదరాబాద్‌లో డా.జయ ప్రకాశ్ నారాయణ్‌తో ముఖాముఖి నిర్వహించారు. ఏడు రెట్లు అధిక జిడిపి కలిగి, ఆయుధ సంపత్తిలో అగ్రగామిగా ఉన్న అమెరికా , భారత్‌ను దెబ్బతీయడానికి ఎందుకు ప్రయత్నిస్తున్నదన్న సుంకవల్లి ప్రశ్నకు జయప్రకాశ్ నారాయణ్ సమాధాన మిస్తూ, డోనాల్డ్ ట్రంప్ నిలకడ లేని, చాదస్తపు వైఖరిని గురించి భారత్ పట్టించుకోనవసరం లేదన్నారు. భారత్ అనవసరమైన విషయాల జోలికి పోకుండా ఆర్థికంగా బలోపేతం కావడానికే ప్రయత్నించడం ఉత్తమమన్నారు. వ్యవసాయ రంగం,రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావిస్తూ, భారత దేశంలో ఆహారభద్రత సమస్య తలెత్తబోదని వివరించారు. ఈ సందర్భంగా సుంకవల్లి సత్తిరాజు రాసిన 'అవనికి ఊపిరి అరణ్యమే' అనే ఒక దినపత్రికలోని ముఖచిత్ర కథనాన్ని పరిశీలించారు.

# అన్ని వర్గాలకు అభివృద్ధిలో భాగస్వామ్యం

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపించాలి

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



**ప్రజాపక్షం/హైదరాబాద్:** లౌకికవాద పునాదులపైన కాంగ్రెస్ పార్టీ ఏర్పడిందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపించాలని కోరారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలను అభివృద్ధిలో భాగస్వామ్యం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ పని చేస్తుందన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా శనివారం క్రైస్తవ ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ సమాజం కోసం పని చేస్తున్న 'ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వాన్ని' ఆశీర్వదించేందుకు క్రైస్తవ ప్రతినిధులు ముందుకురావడం శుభ పరిణామామని అన్నారు. పేదరికంలో ఉన్న ప్రతి వ్యక్తి ఉన్నత స్థాయికి ఎదిగేందుకు,వారిని ముందుకు నడిపించేందుకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కృషి చేస్తుందన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను పెద్ద మెజారిటీతో గెలిపించాల్సిన బాధ్యత అందరి పైనా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ముఖ్యమంత్రి నాయకత్వంలోని క్యాబినెట్ మొత్తం కట్టుబడి ఉందన్నారు. తెలంగాణ సమాజ హితం కోసం ప్రజా ప్రభుత్వం శక్తి వంచన లేకుండా కృషి చేస్తుందన్నారు. సమాజానికి సంబంధించి ఎటువంటి సమస్య వచ్చినా పరిష్కరించేందుకు ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని భట్టి భరోసానిచ్చారు.

## చలో ఖమ్మం

సిపిఐ శతవార్షికోత్సవ మహోత్సవం

26 డిసెంబర్ - ముగింపు సభ

CENTENARY OF STRUGGLES & SACRIFICES

### ఆర్థిక సహాయం అందించిన దాతలు

భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మంలో ప్రజా ప్రదర్శన, బహిరంగ సభ జరగనున్న విషయం విదితమే. ఇది ఖర్చుతో కూడుకున్న కార్యక్రమం. దీని కోసం కమ్యూనిస్టు పార్టీ నాయకులు, సభ్యులు, సానుభూతిపరులు పెద్ద ఎత్తున విరాళాలను అందజేశారు. ఇప్పటి వరకూ ఖమ్మం జిల్లా కార్యాలయానికి అందిన వివరాలను తెలియజేస్తున్నాం.

| | |
|---|---|
| 1. మహ్మద్ మౌలానా | రూ.1,00000 |
| 2. బాగం హేమంతరావు | రూ.1,00000 |
| 3. దండి సురేష్ | రూ.1,00000 |
| 4. పుచ్చకాయల కమలాకర్ | రూ.1,00000 |
| 5. కొండపర్తి గోవిందరావు | రూ.1,00000 |
| 6. పోటు సక్కుబాయమ్మ | రూ.10,000 |
| 7. ఏపూరి లతాదేవి | రూ.1,00000 |
| 8. కూనంనేని భరత్ | రూ.1,00000 |
| 9. హనుమంతు రాము | రూ.1,00000 |
| 10. ఎస్‌కె జానిమియా | రూ.1,00000 |
| 11. ఎస్‌కె సాబీర్‌పాషా | రూ.1,00000 |
| 12. ముత్యాల విశ్వనాథం | రూ.1,00000 |
| 13. వాసిరెడ్డి మురళి | రూ.1,00000 |
| 14. బాగం మాధవరావు | రూ.1,00000 |
| 15. నహింఖురేషి | రూ.1,00000 |
| 16. ఉదయ్ భాస్కర్ | రూ.1,00000 |
| 17.ఎండి అబీద్ హసల్ | రూ.1,00000 |
| 18. వట్టికొండ మల్లికార్జునరావు | రూ.1,00000 |
| 19. అడుసుమల్లి సాయిబాబు | రూ.1,00000 |
| 20. ఏపూరి రవీంద్రబాబు | రూ.1,00000 |
| 21.మిడికంటి వెంకటరెడి | రూ.1,00000 |
| 22.కర్నాటి భానుప్రసాద్ | రూ.1,00000 |
| 23.రావెళ్ల వాసు | రూ.1,00000 |
| 24. లింగా వెంకటనారాయణ | రూ.1,00000 |
| 25. వాసిరెడ్డి సీతారామయ్య | రూ.1,00000 |
| 26. డాక్టర్ పారుపల్లి గోర్కి | రూ. 2,00000 |
| 27. వెంపటి సురేందర్ | రూ.1,00000 |
| 28. ఆళ్ల రవీందర్ | రూ.50,000 |
| 29. కొల్లి సీతయ్య | రూ.50,000 |
| 30. కొల్లి శ్రీనివాస్ | రూ.50,000 |
| 31. తోట రామాంజనేయులు | రూ.25,000 |
| 32. గడల భాస్కర్ | రూ. 25,000 |

#### విరాళాలను సేకరించి కార్యాలయంలో జమ చేసిన వారు

| | |
|---|---|
| 1. బిజి క్లెమెంట్ (కార్పొరేటర్) | రూ. 2,00000 |

#### సిపిఐ నగర సమితి ఖమ్మం

| | |
|---|---|
| (ఎస్‌కె జానిమియా, మహ్మద్ సలాం, మేకల శ్రీనివాసరావు, యానాలి సాంబశివరెడ్డి, నూనె శశిధర్ ద్వారా ) | రూ. 2,00000 |
| 3. ఖానాపురం హవేలీ శాఖ (ఏనుగు గాంధీ, నానబాల రామకృష్ణ, జాకీర్, ఉపేందర్‌ల ద్వారా) | రూ.1,00000 |

#### చింతకాని మండలం

| | |
|---|---|
| 1. దూసరి గోపాలరావు | రూ.30,000 |
| 2. జమ్ముల జితేందర్‌రెడ్డి | రూ. 37,000 |
| 3. పావులూరి మల్లికార్జున్ | రూ. 25,000 |

#### కొణిజర్ల మండలం ...

| | |
|---|---|
| 1. దొండపాటి రమేష్, స్వర్ణ రమేష్ | రూ.50,000 |
| 2. తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు | రూ. 20,000 |
| 3. యామాల గోపాలరావు (వైరా) | రూ.10,000 |
| 4. మిడికంటి వెంకటరెడ్డి (ఖమ్మం రూరల్) | రూ.2,50,000 |
| 5. బట్టు బాబు (ఖమ్మం రూరల్) | రూ. 35,000 |
| 6. కూచిపూడి రవి (చింతకాని) | రూ.50,000 |
| 7. బెజవాడ రవిబాబు (మధిర) | రూ.30,000 |
| 8. యర్రాబాబు (వైరా) | రూ.25,000 |
| 9. తోట రామాంజనేయులు (ఏఐటియుసి) | రూ.23,500 |
| 10. శింగు నర్సింహారావు (ఏఐటియుసి) | రూ. 16,000 |
| 11. సిహెచ్ సీతామహాలక్ష్మి (ఏఐటియుసి) | రూ.10,000 |
| 12. రామాంజనేయులు, ఆనందరావు (బోనకల్) | రూ.7,500 |
| 13. ఇటికాల రామకృష్ణ (ఏఐఎస్ఎఫ్) | రూ.6,000 |

– కోశాధికారి, ఆహ్వాన సంఘం

## తెలంగాణాలో బిజెపి సత్తా ఏమిటో చూపిస్తాం



కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :**'ఆట ఇంకా మొదలు కాలేదు .. రానున్న రోజుల్లో ఆట మొదలు పెట్టినప్పుడు తానేంటో చూపిస్తానని, బిఆర్ఎస్, కాంగ్రెస్ కాళ్ల కింద భూమి కదలాలి' అని కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. తెలంగాణలో బిజెపి సత్తా ఏమిటో చూపిస్తాం అన్నారు. హైదరాబాద్ నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కేంద్రం తెలంగాణ అభివృద్ధికి పనిచేస్తోందని, రేవంత్ రెడ్డి, కెసిఆర్‌లకు ధైర్యం ఉంటే కేంద్రం ఇచ్చిన ప్రాజెక్టులు, నిధులపై బహిరంగ చర్చకు రండి అని సవాల్ విసిరారు. కెటిఆర్, కిషన్‌రెడ్డిని ఉద్దేశిస్తూ బ్యాడ్ బ్రదర్స్ అంటూ సిఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలపై కూడా కేంద్రమంత్రి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఎవరు ఎవరికి బ్రదర్స్ అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పెద్ద బ్రదర్ కెసిఆర్, తర్వాత చిన్న బ్రదర్ హరీశ్‌రావు అంటూ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి, కెసిఆరే బ్యాడ్ బ్రదర్స్ అని, వారిద్దరు రాష్ట్రానికి పట్టిన శాపం అని మండిపడ్డారు. తెలంగాణను మద్యం, అవినీతి, అబద్ధాలతో నడిపించే ఈ బ్యాడ్ బ్రదర్స్‌కు ప్రజలు త్వరలోనే గుణపాఠం చెబుతారు అని హెచ్చరించారు. తెలంగాణ ప్రజలకే తాము బ్రదర్స్ అని చెప్పుకొచ్చారు. కెసిఆర్, రేవంత్ రెడ్డి, ఓవైసీ ఈ ముగ్గురు కలిసి తెలంగాణను మోసం చేశారని ఆరోపించారు. మజ్లీస్ ఆదేశాలు పాటించే ప్రభుత్వం ఇప్పుడు కూడా కాంగ్రెస్సే అన్నారు. పేదల ఇళ్లు కూల్చి, నేతల భవనాలను వదిలేస్తున్నారని ఆరోపించారు. మూసీ పేరుతో పేదల గూడు కూల్చితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ పాలన ఏవిధంగా ఉందో రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారన్నారు. వాళ్ల కన్నెర్ర చేస్తే ఆ రెండు పార్టీల పునాదులు కదులుతాయన్నారు. రాష్ట్ర అభివృద్ధిపై ఎవరి సర్టిఫికెట్ అవసరం లేదని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. తనపై వ్యక్తిగత ఆరోపణలు చేస్తే భయపడను అన్నారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ ఫేక్ ఫొటోలతో తప్పుడు ప్రచారం చేస్తున్నాయన్నారు. కాంగ్రెస్ ఓటమి భయంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బిజెపి, ప్రధాని మోదీపై అబద్ధపు ప్రచారానికి దిగుతున్నారని విమర్శించారు. తెలంగాణ బిడ్డలు బలిదానం చేసింది కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా కాదా అని ప్రశ్నించారు. బలిదానం చేసుకున్నది కెసిఆర్ కుటుంబానికి బానిసలుగా ఉండటం కోసం కాదన్నారు. తెలంగాణ ప్రజలు అసలైన మార్పు కోరుకున్నారన్నారు.

## బిసివాదం బలోపేతానికి నవీన్‌కు మద్దతు

కాంగ్రెస్ ప్రతినిధుల బృందంతో చిరంజీవులు, బాల్‌రాజ్ గౌడ్

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** బిసి వాదాన్ని బలపరచడంలో భాగంగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ కు మద్దతు ఇస్తున్నట్టు బిసి ఇంటలెక్చువల్ ఫోరం చైర్మన్ రిటైర్డ్ ఐఎఎస్ టి.చిరంజీవులు, బిసి పొలిటికల్ ఫ్రంట్ అధ్యక్షులు బాలగోని బాల్‌రాజ్‌గౌడ్ స్పష్టంచేశారు. నవీన్ యాదవ్‌కు మద్దతు ఇవ్వాలని కాంగ్రెస్ నేతలు, ఖనిజ అభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్, మేయర్ గద్వాల విజయలక్ష్మి , ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్, సీనియర్ కాంగ్రెస్ నేత డాక్టర్ వినయ్‌కుమార్‌లు కలిసి నవీన్ యాదవ్‌కు మద్దతు ఇవ్వాలని శనివారం హైదరాబాద్‌లోని బిసి ఇంటెలెక్చువల్ ఫోరం కార్యాలయంలో చిరంజీవులు, బాల్‌రాజ్‌గౌడ్‌లను కోరారు. ఈ సందర్భంగా చిరంజీవులు, బాల్‌రాజ్‌గౌడ్ మాట్లాడుతూ అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి ప్రధానితో చర్చించి, పార్లమెంటులో బిసి బిల్లు పెట్టేందుకు కృషిచేయాలని కోరారు. కామారెడ్డి డిక్లరేషన్ హామీల అమలుకు చొరవ చూపాలని కాంగ్రెస్ ప్రతినిధుల బృందానికి విజ్ఞప్తి చేశారు. తమ డిమాండ్లను కాంగ్రెస్ అధిష్టానానికి దృష్టికి తీసుకెళ్తామని పార్టీ నేతలు తెలిపారు. నవీన్ యాదవ్ గెలుపునకు బిసిలంతా కృషిచేయాలని కోరారు. ఈ భేటీలో బిసి పొలిటికల్ ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్, ఎస్ దుర్గయ్య గౌడ్, అంబాల నారాయణ గౌడ్, యెలికట్టె విజయ్ కుమార్ గౌడ్, బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం నేతలు చామకూర రాజు ,కెవి గౌడ్,ఎర్రమాద వెంకన్న ,రాపోలు జ్ఞానేశ్వర్ ,ఒంటెద్దు నరేందర్ ,అవ్వారు వేణు తదితరులు పాల్గొన్నారు.



## సిఎం రేవంత్ రెడ్డికి శుభాకాంక్షల వెల్లువ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి జన్మదిన సందర్భంగా పలువురు రాజకీయ, సినీ ప్రముఖు లు శుభాకాంక్షలు తెలిపారు. ఆయురారోగ్యాలతో ఉండాలని, మరిన్ని సంవత్సరాలు ప్రజా సేవ చేయాలని పలువురు ఆకాంక్షించారు. పుట్టిన రోజు సందర్భంగా ముఖ్యమం త్రి రేవంత్ రెడ్డికి ఆయన నివాసంలో యాదగిరిగుట్ట అర్చకులు వేద ఆశీర్వచనం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సిఎం రేవంత్ రెడ్డి పుట్టిన రోజు వేడుకలను నిర్వహించారు.

### ప్రముఖుల శుభాకాంక్షలు

సిఎం రేవంత్ రెడ్డి ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ, ఆయనకు ప్రధాని నరేంద్ర మోదీ 'ఎక్స్' వేదిక ద్వారా జన్మదినశుభాకాంక్షలు తెలిపారు. ఎఐసిసి అగ్రనేత, లోక్‌సభ లో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ సిఎంకు ఫోన్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎపి ముఖ్యమంత్రి చంద్రబా బు, కర్నాటక సిఎం సిద్ధారామయ్య, పశ్చిమ బెంగాల్ సిఎం మమతా బెనర్జీ, తమిళనాడు సిఎం స్టాలిన్, లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, తె లంగాణ గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మ, కేంద్ర మం త్రులు కింజారపు రాంమోహన్ నాయుడు, బండి సంజయ్, డిప్యూటీ సిఎం డి.కె.శివకుమార్, ఆంధ్రప్రదేశ్ ఐటి డిప్యూటీ సిఎం పవ న్ కల్యాన్, ఎపి మంత్రి నారా లోకేశ్, ఎంపి ఈటల రాజేందర్ తదితరులు సిఎం రేవంత్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే సినీ ప్రముఖులు చిరంజీవి, నందమూరి బా లకృష్ణ, మహేష్‌బాబు, జూనియర్ ఎన్‌టిఆర్, రాంచరణ్, డైరెక్టర్ అనిల్ రావిపూడి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయనకు ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు.

### సిఎంను కలిసి శుభాకాంక్షలు తెలిపిన మంత్రులు, కాంగ్రెస్ ముఖ్యనేతలు

ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, టిపిసిసి అధ్యక్షుడు బి.మహేష్ కుమార్ గౌడ్, స్పీకర్‌గడ్డం ప్రసాద్ కు మార్, రాష్ట్ర మంత్రులు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, గడ్డం వివేక్, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, దనసరి అనసూయ సీతక్క, కొండాసురేఖ, జూపల్లి కృష్ణారావుతో పాటు ఎంపిలు, ఎంఎల్‌ఎలు , కాంగ్రెస్ ముఖ్యనాయకులు శుభాకాంక్షలు తెలిపారు.













సిఎం సోదరుడు తిరుపతి రెడ్డి కుమార్తె వివాహ వేడుకకు హాజరైన సందర్భంగా ముఖ్యమంత్రిరేవంత్ రెడ్డికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలుపుతున్న సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి , సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

## మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కళారూపాలుండాలి

సిపిఐ నేతలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సిపిఐ వందేళ్ల చరిత్రను చాటిచెప్పడంతో పాటు ప్రజాసమస్యలపై సామాజిక స్పృహ, చైతన్యం కలిగించే కళారూపాలను రూ పొందించాలని పలువురు సిపిఐ నేతలు అన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కళారూపాలు ఉండాలని, సిపిఐ వందేళ్ల చరిత్రను కళాకారుల ఆటలు, పాటలలో ప్రతిబింబించాలన్నారు. అరసం, తెలంగాణ ప్రజానాట్యమండలి సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల రాష్ట్ర స్థాయి కవులు, కళాకారుల వర్క్‌షాప్ శనివారం హైదరాబాద్ మఖ్దూంభవన్‌లోని రాజ్‌బహుదూర్ గౌర్ విజ్ఞాన కేంద్రంలో ప్రారంభమైంది. వర్క్‌షాప్ ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథులుగా ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు, సిపిఐ సీనియర్ నా యకులు చాడ వెంకట రెడ్డి పాల్గొన్నారు. కూనంనేని సాంబశివరావు ప్రారంభిస్తూ అసాధారణమైన సిపిఐ వందేళ్ల చరిత్రలోని ఆటుపోట్లు, ఒడుదుడుకులను, విజయాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. మరోవైపు ప్రజల సమస్యలు, బాధలు, ఆవేదనలను కళాకారులు రచయితలు కళారూపాలుగా మలచడం ద్వారా వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సినీ తదితర రంగాలలో ప్రముఖులు ప్రజానాట్యమండలి, అరసంలో అక్షరాలు దిదినవారేనని గుర్తు చేశారు. సుద్దాల అశోక్ తేజ మాట్లాడుతూ ప్రజా చైతన్యానికి కళలే ఊ పిరి అని, కళారూపాలలో అనునిత్యం నూతనత్వం ఉండాలని సూచించారు. చాడ వెంకట రెడ్డి మాట్లాడుతూ దేశంలో, సమాజంలో మారుతున్న రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిస్థితులను ఆక లింపు చేసుకుని కళారూపాలను రూపొందించాలన్నారు. డ్రగ్స్, గంజా య్, మద్యం అంశాలతో పాటు సా మాజిక రుగ్మతల నిర్మూళనకు కళాకారులు, రచయితలు తమ వంతు కృషి చేయాలన్నారు. ఒగ్గు కథలు, గేయాలు, నాటికల కు ఇంకా ప్రజలలో ఆదరణ ఉందని, వాటి ద్వారా ప్రచార కార్యక్రమాలను చేపట్టాలన్నారు. కార్యక్రమంలో అరసం అధ్యక్షులు పల్లేరు వీరాస్వామి, ప్రధాన కార్యదర్శి రాపోలు సుదర్శన్, ప్రజానాట్యమండలి అధ్యక్షులు కె.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహా తదిలరుతు ప్రసంగించారు.

## బిసి కోటాపై ఢిల్లీకి అఖిల పక్షం

బిసి హక్కుల సాధన సమితి డిమాండ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభు త్వం అసెంబ్లీలో చేసిన బిసి రిజర్వేషన్ల చట్టాన్ని రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్లో చేరుస్తూ బిల్లు ఆమోదించే విధంగా తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని, బిసి రిజర్వేషన్ల బిల్లును ఆమోదింపచేసే బాధ్యత రాష్ట్ర బిజెపియే తీసుకోవాలని బిసి హక్కుల సాధన సమితి డిమాండ్ చేసిం ది. సాధన సమితి రాష్ట్ర కార్యవర్గ సమావేశం శనివా రం హైదరాబాద్ హిమాయత్ నగర్‌లోని రాజ్ బహదూర్ గౌర్ హాల్‌లో జరిగింది. సమావేశంలో సమితి రాష్ట్ర అధ్యక్షులు టి.వెంకటరాములు, ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు, రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి రాయబండి పాండు రంగాచారి, రాష్ట్ర సహాయ కార్యదర్శి చింతకింది కుమారస్వామి, కార్యవర్గ సభ్యులు ఎల్.శ్రావణ్, వనం సత్యనారాయ ణ, పలనాటి యాదయ్య బొడ్డుపెల్లి కృష్ణ, దీటి నరసయ్య పాసికంటి లక్ష్మీ నరసయ్య తదితరులు ప్రసంగించారు. వెంకటరాములు మాట్లాడుతూ అసెంబ్లీలో చేసిన బిసి చట్టానికి బిజెపి పార్టీ ఎంఎల్‌ఎలు మద్దతు ఇచ్చినందున మోదీ ప్రభుత్వంతో మాట్లాడి ఆ చ ట్టాన్ని 9వ షెడ్యూల్లో చేర్పించడానికి చొరవ చూపి రాష్ట్రంలో బిసిల సంక్షేమం పట్ల తమ చిత్తశుద్ధిని రు జువు చేసుకోవాలన్నారు. రానున్న రోజుల్లో దేశవ్యా ప్తంగా జనగణనతో పాటు కులగణన చేపట్టి సకల రంగాలలో బిసిల వాటా బిసిలకు ఇవ్వడానికి పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ చేసే విధంగా బిసిహక్కుల సాధన సమితి ఉద్యమిస్తుందన్నారు. ధూళిపాళ ధనుంజయ నాయుడు మాట్లాడుతూ అసెంబ్లీలో చట్టం చేసిన సిఎం రేవంత్ రెడ్డి చెప్పిన విధంగా అన్ని రాజకీయ పార్టీలను బిసి సంఘాలను కలుపుకుని అఖిలపక్షాన్ని ప్రధానమంత్రి దగ్గరికి వెళ్లాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు, విద్యా, ఉద్యోగ రంగాలలో 42 శాతం రిజర్వేషన్లను తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చడం ఒక్కటే మార్గమన్నారు. కోర్టుల చుట్టూ తిరుగుతూ కాలయాపన చేయడం సిఎం, కాంగ్రెస్ పార్టీకి తగదని, బిసిలను మభ్యపెట్టడమే అవుతుందన్నారు.

## ప్రతీ కార్యకర్తా కష్టపడాలి

ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పిలుపు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సిపిఐ వందేళ్ల ఉత్సవాల సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సం ఘం (బికెఎంయు) రాష్ట్ర విస్తృత కార్యవర్గ సమావేశం కలకొండ కాంతయ్య అధ్యక్షతన శనివారం హైదరాబాద్ హిమాయత్ నగర్‌లోని రాజ్‌బహదూర్‌గౌర్ విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఈ స మావేశానికి ముఖ్య అతిథిగా వచ్చిన కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ డిసెంబర్ 26న ఖమ్మంలో 5 లక్షల మందితో జరిగే సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు బహిరంగ సభను వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సంఘం సమావేశాలు అన్ని జిల్లాల్లో నిర్వహించుకొని గ్రామస్థాయి వరకు ప్రచారం తీసుకువెళ్లాలన్నారు. 40 రోజులపాటు ప్రతి ఒక్క నాయకులు , కా ర్యకర్తలు అందరూ కూడా కష్టపడి బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో బికెఎంయు జాతీయ కార్యవర్గ సభ్యులు తాటిపాముల వెంకట రాములు, సృజన్ కుమార్ చింతకుంట్ల వెంకన్న, బొడ్డుల జంగయ్య , యేసయ్య, అక్కే పెల్లి బాబు, లక్ష్మ ణ్, శ్రావణ్ ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలి

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** మానవ మనుగడకు అవరోధాలు సృష్టించే చెడు వ్యసనాలను వదిలేసి, ప్రతి ఒక్కరు సన్మార్గంలో నడవాలని గాయత్రి తీర్థ్ శాంతి కుంజ్ హరిద్వార్ నుండి వచ్చిన గాయత్రి పుత్రులు సందేశంను ప్రజలకు ఇచ్చారు. శనివారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో గాయత్రి పరివార్ కొండమల్లేపల్లి వారి ఆధ్వర్యంలో 108 కుండీల గాయత్రి యజ్ఞంను ఎంతో ఆధ్యాత్మికంగా నిర్వహించారు. సుమారు 2000 మంది హాజరై ఒకే సారి గాయత్రి మంత్రాన్ని పఠించడంతో కొండమల్లేపల్లి పట్టణం గాయత్రి దేవి నామస్మరణతో మారుమోగింది. యజ్ఞం అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈకార్యక్రమంలో శివాజీ, రాందాస్, విక్రమ్, శ్రీశైలం, రాఘవ, వింజమూరి చంద్రమౌళీ, జగన్, దాచేపల్లి వెంకటేశ్వర్లు, ఏరుకొండ రాము, వింజమూరి సత్యనారాయణ, రాఘవులు, నాగార్జునరెడ్డి, మారం వెంకన్న, కుశాల్, వరలక్ష్మి పాల్గొన్నారు.



## విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించినట్లయితే మంచి భవిష్యత్తు ఉంటుందని డీఎస్పీ రాజశేఖర్‌రాజు అన్నారు. తైక్వాండోలో రాష్ట్ర స్థాయిల పోటీలకు అర్హత సాధించిన విద్యార్థులను శనివారం ఆయన సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల నల్లగొండలో జరిగిన ఉమ్మడి నల్లగొండ జిల్లా, ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీలకు విన్నర్స్ వరల్డ్ తైక్వాండో మిర్యాలగూడ బ్రాంచ్‌కు చెందిన విద్యార్థులు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. విన్నర్స్ తైక్వాండో అకాడమి వారు ఇంకా ఎంతో మంది క్రీడాకారులను జాతీయ స్థాయికి పంపించి మిర్యాలగూడ పేరును నలుదిశలా వ్యాపింపచేయాలని కోరారు. కార్యక్రమంలో కోచ్ పవన్, నల్లపరాజు జాని, విశ్వభారవి, స్కూల్ ప్రిన్సిపాల్ రామకృష్ణ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.







## జిల్లా స్థాయి కరాటే పోటీలలో స్కూల్ ఆఫ్ ఆక్స్‌ఫర్డ్ విద్యార్థుల ప్రతిభ

**ప్రజాపక్షం/నందికొండ:** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ నలగొండ సంస్థ నిర్వహించిన జిల్లా స్థాయి కరాటే టోర్నమెంట్ కం సెలక్షన్స్ లో నాగార్జున సాగర్ స్కూల్ ఆఫ్ ఆక్స్ ఫర్డ్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరిచారని ప్రిన్సిపాల్ ఏ శివకుమార్, కరస్పాండెంట్ నకుల్ రావు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 7న నల్లగొండ మేకల అభినవ్ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి కరాటే టోర్నమెంట్ కంసెలక్షన్‌లో అండర్ 1780కిలోల విభాగంలో సయ్యద్ అబ్దుల్ ముసాఫిర్ అండర్ 1768 కిలోల విభాగంలో ఎస్‌వీఎన్‌ఎం కృష్ణ సాయిలు బంగారు పతకాలను సాధించగా,అండర్14 35కిలోల విభాగంలో బణావత్ వెంకటేష్,రజత పతకం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు.తమ పాఠశాలలో చదివే విద్యార్థులకు విశాలమైన తరగతి గదులలో ఉత్తమ విద్యతో పాటు ఆత్మ రక్షణకు కరాటే, విద్యార్థులలో నైపుణ్యాన్ని పెంచడానికి డ్రాయింగ్ విభాగంలో ఉత్తమ ఉపాధ్యాయులతో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు.ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రిన్సిపాల్ ఏ శివకుమార్, కరస్పాండెంట్ కె నకుల రావు,కరాటే మాస్టర్ వెంకట్,స్కూల్ ఆఫ్ ఆక్స్‌ఫర్డ్ ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## డివైడర్‌ను ఢీకొని కారు దగ్ధం

### 8 మందిని కాపాడిన లారీ డ్రైవర్లు



**ప్రజాపక్షం/చిట్యాల :** నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామ శివారులో 65వ నెంబర్ జాతీయ రహదారిపై శనివారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇన్నోవా కారు పూర్తిగా దగ్ధమైంది. కారులో ప్రయాణిస్తున్న 8 మంది సురక్షితంగా బయటపడ్డారు. స్థానిక పోలీసుల వివరాల ప్రకారం... హైదరాబాద్ నుండి విజయవాడ వైపు వెలుతున్న ఇన్నోవా కారు గుండ్రాంపల్లి గ్రామ సమీపంలోకి రాగానే ప్రమాదవశాత్తు డివైడర్‌కు ఢీ కొని పల్టీ కొట్టి రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. వెంటనే కారులో మంటలు చెలరేగి నిమిషాలల్లో కారు పూర్తిగా దగ్ధమైంది. అందులో ప్రయాణిస్తున్న 8 మంది సురక్షితంగా బయటపడ్డారు.

**రక్షణ చర్యల్లో :** రోడ్డుపై కారు ప్రమాదానికి గురై మంటలకు ఆహుతి అవుతున్న సంఘటనను చూసిన రామకృష్ణ, అశోక్, షరీఫ్ అనే ముగ్గురు లారీ డ్రైవర్లు తమ వాహనాలను పక్కకు ఆపుకుని సంఘటన స్థలానికి చేరుకున్నారు. మండుతున్న కారు డోర్‌లను తెరిచి అందులో ఉన్న 8 మందిని బయటికి సురక్షితంగా బయటికి చేర్చారు. ఈ క్రమంలో వీరి కాళ్ళు, చేతులకు మంటలు అంటుకున్న తీవ్రంగా గాయపడ్డారు. గాయాలను లెక్కచేయకుండా 8 మంది ప్రాణాలను కాపాడిన వారిని అందరూ ప్రశంసిస్తున్నారు. గాయాలకు గురైన వారిని హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## పోలీసులను చితక బాదిన మందు బాబులు

### చండూరులో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

**ప్రజాపక్షం/చండూరు:** బహిరంగ ప్రదేశంలో అర్ధ రాత్రి సమయంలో మద్యం సేవిస్తున్న ముగ్గురు యువకులను పోలీసులు మందలించారు. మద్యం మత్తులో ఉన్న ముగ్గురు యువకులు పోలీసులను చితక బాదడంతో పోలీసులకు తీవ్ర గాయాలు అయిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చిం ది. దీంతో బాధిత పోలీసుల ఫిర్యాదుతో మందుబాబులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎన్ వెంకన్న గౌడ్ తెలిపారు. చండూరు మున్సిపాలిటీ పరిధిలో ఈనెల 4వ తేదీన పోలీసులు గస్తీ నిర్వహిస్తుండగా అర్ధ రాత్రి సమయంలో భవానీ ఫంక్షన్ హాల్ ప్రక్కన మద్యం బాటిల్‌లతో ఉన్న ముగ్గురు వ్యక్తులు ముగ్గురు వ్యక్తులు కారింగు క్రాంతి కుమార్,మహమ్మద్ సాజిద్,మహమ్మద్ నాసర్ పాషా అను ముగ్గురు వ్యక్తులను చూసి విధి నిర్వహణలో ఉన్న పోలీసులు వారిని అక్కడి నుండి వెళ్లిపోవాలి అని సూచించగా సదరు వ్యక్తులు పోలీస్ వారిపై దురుసుగా ప్రవర్తించి,దుర్భాశలాడుతూ దాడి చేశారు.ఇట్టి విషయం మీద కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు చండూర్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి ఆ ముగ్గురు మందు బాబులను అరెస్ట్ చేసి రిమండ్‌కు పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

## వికలాంగుల సంక్షేమశాఖను ప్రత్యేక శాఖగా కొనసాగించాలి



**ప్రజాపక్షం/ రామన్నపేట:** వికలాంగుల సంక్షేమశాఖన ప్రత్యేక శాఖగా కొనసాగించాలనే జీవో నెం.34ను అమలు చేయాలని ఈనెల 10న జిల్లా వ్యాప్తంగతా జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రామన్నపేట మండల కేంద్రంలోని సుభాష్ సెంటర్ వద్ద వాల్ పోస్టర్‌ను విడుదల చేయగా జిల్లా ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం జీవో నెం.34 ద్వారా మహిళ శిశు సంక్షేమశాఖ, వికలాంగుల సంక్షేమశాఖ మధ్య జిల్లాలో అందుబాటులో ఉన్న ఉద్యోగులను సర్దుబాటు చేసి వికలాంగుల సంక్షేమశాఖను ప్రత్యేక శాఖగా కొనసాగించాలని 2022 డిసెంబర్ 2న తేదీన ఉత్తర్వులు ఇచ్చిందని, ప్రభుత్వం జీవో ఇచ్చిన 3 సంవత్సరాలు అవుతున్న అమలు కావడం లేదన్నారు. వికలాంగుల సంక్షేమం కోసం నిర్వహణ కోసం అసిస్టెంట్ డైరెక్టర్‌ను జిల్లా స్థాయిలో తిరిగి నియమించాలని ప్రభుత్వం జీవో విడుదల చేసింది. నవంబర్ 10న భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునివ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డి మండల అధ్యక్షుడు బలుగూరి అంజయ్య, మండల కార్యదర్శి గిరికల లింగస్వామి, మండల ఉపాధ్యక్షుడు నాగు నరసింహా, మండల సహాయ కార్యదర్శి పున్న శ్రీధర్, సుంకి వెంకటేశం, యాదయ్య, నరసింహా, శ్రీరామ్, సంతోష్ పాల్గొన్నారు.

# షరతుల్లేకుండా పత్తిని కొనుగోలు చేయాలి

### జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి

### సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి డిమాండ్



**ప్రజాపక్షం/ రామన్నపేట:** పత్తి కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించి అకాల వర్షంతో దెబ్బతిన్న పత్తిని ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో జరిగిన సిపిఐ మండల కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడుతూ 1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో ఆవిర్భవించిన భారత కమ్యూనిస్టు పార్టీ అనేక పోరాటాలు నిర్వహించి పేదల పక్షాలన నిలబడుతుందని నేటికి దేశంలో చెక్కుచెదరని పార్టీ ఉందంటే అది కేవలం సిపిఐ మాత్రమేనని ఆయన అన్నారు. సిపిఐ వంద సంవత్సరాల శతజయంతి ఉత్సవాల ముగింపు సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని, ఖమ్మం బహిరంగ సభ జయప్రదం కోసం హైద్రాబాద్ నుంచి బస్సు జాత ప్రారంభమై ఈనె 20, 21న జిల్లాకు విచ్చేయుచున్న సందర్భంగా పార్టీ శ్రేణులు, ప్రజానాట్యమండలి కళాకారులు, స్వాగతం పలికి బహిరంగ సభ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎర్ర రమేష్ అధ్యక్షత వహించిన సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండి.ఇమ్రాన్, మండల కార్యదర్శి ఉట్కూరు నరసింహా, ఏఐటీయూసీ మండల కార్యదర్శి శివరాత్రి సమ్మయ్య, పట్టణ కార్యదర్శి రచ్చ యాదగిరి, సీనియర్ కామ్రేడ్ బాలగోని మల్లయ్య, ఉట్కూరు భగవంతు, గంగాపురం వెంకటయ్య, ఉట్కూరి కృష్ణ, జగన్నాధం, పెండెం రవీందర్, మీసం గాలయ్య, పట్ల నరసింహా, రచ్చ యాదగిరి పాల్గొన్నారు.


### 100 సంవత్సరాలు సిపిఐ కరపత్రం ఆవిష్కరణ



**ప్రజాపక్షం/వలిగొండ :** వలిగొండ మండలంలోని వేములకొండ గ్రామంలో సిపిఐ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ 1925 డిసెంబర్ 26న ఆవిర్భవించిన భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) భారత గడ్డపై వందేళ్లు పూర్తి చేసుకున్నది. డిసెంబర్ 26న ఖమ్మం లో జరిగే లక్షలాదిమంది బహిరంగ సభకు 40 దేశాల ప్రతినిధులు హాజరవుతున్నారు ఈ బహిరంగ సభను విజవంతం చేయాలని పిలుపునిచ్చారు అనంతరం కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు బోడ సుదర్శన్, ఎండి ఇమ్రాన్, సిపిఐ మండల కార్యదర్శి సలిగంజి వీరస్వామి, మండల సహాయ కార్యదర్శి ఎల్లంకి మహేష్, నాయకులు బాలగోని సత్యనారాయణ, పులిపలుకుల మల్లేశం, సుద్దాల సాయికుమార్, మారోజు నరసింహాచారి, కోయిగూర రాముల్లు, అంబటి అంజయ్య, పోషణ బోయిన బొందయ్య, బత్తుల బిక్షపతి, భీమ గాని శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## దీక్షతో నూతన జీవన విధానానికి నాంది

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** హరిహరపుత్ర శ్రీఅయ్యప్ప స్వామి దీక్షతో నూతన జీవన విధానానికి నాంధి పలుకుతుందని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తం రెడ్డి, మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డిలు ఉన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్ శిరీష దంపతుల నివాసంలో అయ్యప్పస్వామి పడిపూజను సంగయ్య గురుస్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాలాదారులు ఎంతో భక్తిశ్రద్ధలతో, నిష్టతో స్వామివారిని పూజిస్తారని ఎటువంటి వాతావరణం ఉన్నా అకుంఠిత దీక్షతో స్వాములు 41 రోజులు పూజలు చేయడం హర్షనీయమన్నారు. నాయకులు ఎలిమినేటి రమేష్, ధరావత్ వీరన్న నాయక్, షేక్ జహీర్, రావుల రాంబాబు, వల్దాసు శ్రీను, చెంచల నిఖిల్ నాయుడు, ఎర్రంశెట్టి సతీష్, లక్ష్మణ్, ఎలిమినేటి అభినాష్, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.



# మహిళా వేధింపులపై మౌనం తగదు

### సూర్యాపేట జిల్లా ఎస్‌పి కె నరసింహ



**ప్రజాపక్షం/సూర్యాపేట :** మహిళా వేధింపులపై మౌనంగా ఉండొద్దని సూర్యాపేట జిల్లా ఎస్పి కె నరసింహ కోరారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ మహిళలు, యువతులు ఎలాంటి సమస్యలు ఉన్నా నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని సూచించారు. వేధింపులు ఉపేక్షించకుండా ధైర్యంగా ఫిర్యాదు చేయాలని పిలుపునిచ్చారు. ఫిర్యాదులు చేసినప్పుడే పటిష్టంగా వాటిని నిర్మూలించగలమన్నారు. మహిళల రక్షణ కోసమే షీ టీమ్స్ కృషి చేస్తున్నాయన్నారు. జిల్లాలో సూర్యాపేట, కోదాడ డివిజన్ పరిధిలో షీ టీం బృందాలు పని చేస్తున్నాయని షీ టీం ఆధ్వర్యంలో వివిధ ప్రదేశాలలో, స్కూల్స్, కాలేజీలలో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, పోక్సో, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, ఆత్మహత్యలు, డ్రగ్స్, బాల్యవివాహాలు, వరకట్నం చట్టాలపై, నూతన మహిళా చట్టాలపై, డయల్ 100, టిసేఫ్ యాప్ మహిళ భద్రత, రక్షణ చర్యలు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. టీమ్ సభ్యులు ప్రత్యక్షంగా ఫిర్యాదులు తీసుకుంటారని, ఆన్‌లైన్, క్యూఆర్ కోడ్, వాట్సప్ ద్వారా కూడా స్వీకరిస్తానిస్పష్టం చేశారు. మహిళలు, బాలికలపై ఆన్‌లైన్‌లో అసభ్యకర పోస్టులు పెట్టేవారు, సైబర్ నేరగాళ్లపై కూడా సైబర్, షీ టీమ్ సమన్వయంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. మహిళలు, బాలికలు, విద్యార్థులు షీ టీం సేవలు ఉపయోగించుకోవాలని సూచించారు. ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా వేధించినా, రోడ్డుపై వెళ్ళేటప్పుడు అవహేళనగా మాట్లాడినా, ఉద్దేశపూర్వకంగా వెంబడించినా, అసభ్యకరంగా ప్రవర్తించినా, మాట్లాడిన విద్యార్థినీలు, మహిళలు అత్యవసర పరిస్థితులలో జిల్లా పోలీస్ షీ టీం నంబర్ 8712686056 కి కాల్ చేసి, వాట్సప్ ద్వారా సందేశం పంపించి లేదా డయల్ 100కు కాల్ చేసి తక్షణ పోలీస్ సహాయం పొందాలని కోరారు. అక్టోబర్ నెలలో షీ టీమ్‌కు అందిన మొత్తం 21 ఫిర్యాదులు వచ్చాయన్నారు. రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిన కేసులు 31, ఎఫ్ఐఆర్ నమోదు చేసినవి 2, పెట్టి కేసులు 5, కౌన్సిలింగ్ ఇచ్చినవి 44, సంబంధిత పోలీస్ స్టేషన్‌కి పంపినవి 6 ఉన్నాయని వివరించారు. అక్టోబర్ నెలలో అవగాహన కార్యక్రమాలు కోదాడ డివిజన్‌లో 21, సూర్యాపేట డివిజన్‌లో 25 నిర్వహించామని తెలిపారు.

## గంజాయి సేవించిన యువకుడు అరెస్టు

**ప్రజాపక్షం/నందికొండ:** నాగార్జునసాగర్‌లోని స్థానిక ఆఫీసర్స్ క్లబ్ వెనుక భాగాన నిర్మానుష్యమైన ప్రదేశంలో ఒక యువకుడు గంజాయి సేవిస్తూన్నాడన్న సమాచారంతో స్థానిక పోలీసులు సంబంధిత ప్రదేశానికి వెళ్లి చూడగా సదరు వ్యక్తి ఖమ్మం జిల్లా మేడిపల్లి గ్రామానికి చెందిన బొడ్డు విక్రమ్ గా గుర్తించినట్లు స్థానిక ఎస్ఐ ముత్తయ్య తెలిపారు. అతనికి గంజాయి తాగటం అలవాటుగా మారడంతో స్థానిక ప్రదేశానికి వచ్చి గంజాయి సేవిస్తున్నట్లు ఆయన అన్నారు. అతని వద్ద 145 గ్రాముల గంజాయి అదేవిధంగా గంజాయి తాగటానికి ఉపయోగించే బంగు బాటిల్, ఒక మొబైల్ ఫోను స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి నిడమానూరు ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా అతనికి రిమాండ్ గురించినట్లు ఎస్ఐ తెలిపారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** ద్విచక్ర వాహనంపై వెళుతూ కోతి అడ్డు రావడంతో ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన భూదాన్ పోచంపల్లి మండలం జలాల్పూర్ గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. స్థానిక పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎస్సై భాస్కర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మృతుడు జలాల్‌పురం గ్రామ నివాసి గడ్డం ప్రభాకర్ అను వ్యక్తి, గత నెల 30న తన ఆక్టివా ద్విచక్ర వాహనంపై పోచంపల్లిలోని జేవీ ఫంక్షన్ హాల్‌లోని పెళ్లికి వెళ్ళి తిరిగి మధ్యాహ్నం ఇంటికి వస్తున్న క్రమంలో తన గ్రామ బస్ స్టాప్ వద్దకు వెళ్లే సరికి, అకస్మాత్తుగా కోతి అడ్డుగా రావడంతో, మృతుడు రోడ్డు మీద పడగ, తలకు ముందు భాగంలో కుడి కన్ను బొమ్మ పై బాగంలో, కుడి చేతికి రక్త గాయాలు అయి, తీవ్ర అంతర్గత గాయాలు తలకు తగిలి, ఓజోన్ హాస్పిటల్ నందు చికిత్స పొందుతూ మరణించినట్లు తెలిపారు. మృతుడి పెద్ద కుమారుడు గడ్డందేవి ప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహానీ పోస్ట్ మర్టామ్ నిమిత్తం భువనగిరి హాస్పిటల్‌కి తరలించి, శవరిక్ష అనంతరం మృత దేహాన్ని మృతుని రక్త సంబందికులకు అప్పగించినట్లు తెలిపారు.

## ఈ రోడ్డు గుంతలమయం..



**ప్రజాపక్షం/మోతె :** ఈ రోడ్డు గుంతల మయం పొంచి ఉన్న ప్రమాదం మండల కేంద్రంలోని నుంచి నడిగూడెం మండలం చెన్నకేశవాపురం వెళ్ళే దారిలో తిరుపతమ్మ గుడి సమీపంలో రహదారిపై లోతైన గుంతలు ఏర్పడడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు గుంతలో నీరుచేరి గుంత కనపడకపోవడంతో వాహనదారులు అందులోపడి గాయాలపాలైన సంఘటనలు నిత్యం జరుగుతున్నాయి. అయినా నేషనల్ హైవే అథారిటి అధికారులు స్పందించకుండా ఉన్న తీరుతో ఈ రహదారిపై ఎక్కువ సంఖ్యలో వాహనాలు తిరుగుతుంటాయి. సర్వీస్ రోడ్డు నుంచి మండల కేంద్రానికి ఈ రహదారిపై బస్సులు, వాహనాలు వస్తూ ఉంటాయి. పగటి సమయంలో సైతం దగ్గరకు వచ్చే వరకు గుంత కనిపించట్లేదని వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గుంతను పూడ్చివేయాలని రహదారిని మరమ్మత్తు చేయాలని ప్రయాణికులు కోరుకుంటున్నారు. లేకుంటే ప్రాణాలకే ముప్పు అని తెలియజేస్తున్నారు.

**గుంత ప్రమాదకరంగా ఉంది : ఆంజనేయులు**

నడిరోడ్డుపై మోకాలు లోతులో గుంత ఏర్పడి వర్షపు నీరు నిల్వ ఉండడంతో గుంట ఉన్నట్లు కనిపించకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. వెంటనే అధికారులు స్పందించి నడిరోడ్డుపై ఉన్న గుంతను పూడ్చివేయాలని నిత్యం వచ్చిపోయే వాహనదారులకు రోడ్డు ప్రమాదాల బారి నుంచి తప్పించాలని వేడుకుంటున్నాడు.

## ప్రభుత్వ పథకాలు ప్రజలకు వరాలు

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ (చివ్వెంల) :** ప్రభుత్వ పథకాలు ప్రజలకు వరాలని తెలంగాణ సాంస్కృతిక సారధి సూర్యాపేట జిల్లా అధ్యక్షులు పాలకుర్తి శ్రీకాంత్ అన్నారు. శనివారం చివ్వెంల మండలం బండమీది చందుపట్ల గ్రామంలో ప్రభుత్వ పథకాలు, పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలు, అభయహస్తం, రైతు బరోసా, స్వయం సహాయక సంఘాలకు నిధులు, స్కిల్ యూనివర్సిటీలు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ, రూ. 500లకు వంట గ్యాస్ వంటి ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక సారథి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లెల రాము, టీం లీడర్ పల్లెల లక్ష్మణ్, కళా బృందం సభ్యులు గంట బిక్షపతి, గడ్డం ఉదయ్, మాగి శంకర్, పాక ఉపేందర్, మద్దిరాల మంజుల, సిరిపంగి రాధ, ములకలపల్లి మల్లమ్మ, నాగలక్ష్మి పాల్గొన్నారు.



## ముగిసిన కాంగ్రెస్ రాష్ట్ర మహిళ నాయకురాలు రూప అంతక్రియలు

### మృతి పట్ల పలువురి సంతాపం..

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** బ్రెయిన్ స్ట్రోక్‌తో మరణించిన మాజీ కౌన్సిలర్ దుబ్బ అశోక్ సుందర్ సతీమణి, కాంగ్రెస్ రాష్ట్ర మహిళ ఉపాధ్యక్షురాలు దుబ్బ రూప పార్థివదేహాన్ని శనివారం నల్లగొండలోని వారు నివాసంలో తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి,నకిరేకల్ మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్,మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు గోపగాని మాధవి, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ అభిమన్యు శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్‌లు రావుల శ్రీనివాస రెడ్డి,మారగోని గణేష్,మైనం శ్రీనివాస్,జెపి మాజీ కోఆప్షన్ సభ్యులు జాన్ శాస్త్ర,పెరిక కరుణ్ జయరాజ్ లు సందర్శించివారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేసి వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రూప మరణం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ ఆమె కుటుంబానికి అందరం ఎల్లవేళలా అండగా ఉంటామని పేర్కొన్నారు. అదేవిధంగా క్లాక్ టవర్ సెంటర్లో ఉన్న సెంటినరీ తెలుగు బాప్టిస్ట్ చర్చిలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేసి అనంతరం దేవరకొండ రోడ్డులోని స్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.



## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం




**ప్రజాపక్షం/చండూరు :** చండూరు మున్సిపాలిటీ కేంద్రంలో డాన్‌బోస్కో జూనియర్ కళాశాలలో పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం శనివారం జరిగింది.కళాశాల స్థాపించి 40 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా పూర్వ విద్యార్థులు అందరు ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసుకొని పూర్వ విద్యార్థులు,యాజమాన్యాన్ని,అధ్యాపకులను ఘనంగా సత్కరించారు.కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ రాజేష్ పూర్వ విద్యార్థులకు స్వాగతమ్ పలికారు.ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ డాక్టర్ విల్సన్ మాట్లాడుతూ తాను కూడా ఈ కళాశాల పూర్వ విద్యార్థి కావడం తన పూర్వ జన్మ సుకృతం అని అన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు డాక్టర్ ప్రవీణ్,డాక్టర్ కోడి శ్రీనివాసులు,గచ్చిబౌలి సిఐ క్రాంతి, రావిరాళ శ్రీను,నంగనూరు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శివకోటి,అనంత చంద్రశేఖర్ గౌడ్,దోటి వెంకన్న,కోడి వెంకన్న,నల్లగంటి మల్లేష్,సిలివేరు రాజు, ఎస్ఐ శాంతం రెడ్డి,నగేష్,తమ జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

## రామాలయానికి పల్లకీ బహుకరణ



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** మండల పరిధిలోని లింగగిరి గ్రామంలోని రామాలయానికి స్థానిక భక్తులైన బబ్బెళ్ళపాటి వెంకట రామారావు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు శనివారం పల్లకి బహుకరించారు. మొదట ఆలయ సాంప్రదాయం ప్రకారం విశ్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, కంకణ ధారణ చేశారు. నూతనంగా తయారు చేయించిన పల్లకికి సంప్రోక్షణ చేసి పూలమాలలతో, మామిడి తోరణాలతో అలంకరించారు. సీతా, లక్ష్మణ సమేత రామచంద్రస్వామి పల్లకిలో వేంచేసి దేవాలయం చుట్టూ ముమ్మారు ప్రదక్షణ గావించారు. భక్తులే బోయిలుగా దేవాలయంలో జరిగే వివిధ ఉత్సవాలలో, పండుగలలో ఈ పల్లకి వినియోగిస్తారని ఆలయ అర్చకులు తెలిపారు. దాదాపుగా రూ.50వేలతో తయారు చేయించిన కలప పల్లకి దేవాలయానికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు దామోదరాచార్యులు, అరుణకుమారి, వెంకట విశ్వనాథరావు, నాగమల్లేశ్వరి, వెంకటసాయి మహేశ్వర్, వెంకట విహిత, భక్తులు పాల్గొన్నారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## ఓట్ చోరీకి వ్యతిరేకంగా 1.12 కోట్ల సంతకాలు

### కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రకటన

బెంగళూరు : దేశంలోని అన్ని రాజ్యాంగ, స్వతంత్ర్య వ్యవస్థలను ప్రధాని నరేంద్ర మోదీ ధ్వంసం చేశారని కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆరోపించారు. ఎన్నికల సంఘం సహా అన్ని వ్యవస్థలను కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో పని చేసేలా మార్చేశారని మండిపడ్డారు. ఓటు చోరీ నిపుణులుగా బిజెపి తనను తాను నిరూపించుకుందని, కేంద్రంలో, అనేక రాష్ట్రాలలో ఇదే విధంగా అధికారంలోకి వచ్చిందని అన్నారు. 'ఓట్ చోరీ'కి వ్యతిరేకంగా సంతకాల సేకరణలో భాగంగా కర్నాటక రాష్ట్రంలో 1.12 కోట్ల మంది సంతకాలు చేశారని బెంగళూరులో శనివారం ఆయన ప్రకటించారు. నవంబర్ 10వతేదీ నాటికి మొదటి విడత సంతకాలను ఎఐసిసికి పంపుతామని, అక్కడి నుంచి వారు రాష్ట్రపతి, ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు అందజేస్తారని అన్నారు.

## మహాత్మాగాంధీపై తరహాలో మోదీ సామ్రాజ్యంపై పోరాటం

### మోదీ 'కట్టా' వంటి పదాలను ఉపయోగిస్తూ ప్రధాని గౌరవాన్ని మంటగలుపుతున్నారు : ప్రియాంకగాంధీ



తిహార్/భగల్‌పూర్ : మహాత్మా గాంధీ ఒకప్పుడు బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా పోరాడిన తరహాలోనే ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ మోదీ సామ్రాజ్యంపై అదే పోరాటం చేస్తోందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా పేర్కొన్నారు. శనివారం బిహార్‌లోని కతిహార్, భగల్‌పూర్ జిల్లాల్లో ప్రియాకాగాంధీ వరుస ర్యాలీల్లో పాల్గొని ప్రసంగించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'కట్టా' (దేశంలో తయారు చేసిన పిస్టల్) వంటి పదాలను ఉపయోగించడం ద్వారా తన పదవి గౌరవాన్ని కాపాడుకోవడం లేదని ఆరోపించారు. ప్రధాని ఒకవైపు అహింసకు నిలయమైన 'వందేమాతరం'ను కీర్తిస్తుండగా, మరోవైపు 'కట్టా' వంటి పదాలను ఉపయోగిస్తున్నారని మండిపడ్డారు. శుక్రవారం జాతీయ గేయం 150వ వార్షికోత్సవాన్ని జరుపుకున్నప్పటికీ, చరిత్రలో ఒక సమయంలో బిజెపి, ఆర్ఎస్ఎస్‌లు స్వాతంత్ర్య ఉద్యమ గీతం, దేశ ఐక్యతను సూచించే వందేమాతరం పాడటానికి ఇష్టపడలేదని పేర్కొన్నారు. ఎన్‌డిఎ ప్రభుత్వం యువతకు ఉపాధి కల్పించడంలో విఫలమైందని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రధాని మోదీ ఇద్దరు కార్పొరేట్ స్నేహితులకు అప్పగిస్తోందని వాద్రా విమర్శించారు. ఎన్‌డిఎ అనేక ప్రభుత్వ పదవులను ఖాళీగా ఉంచిందని, ఉపాధి అవకాశాలన్నింటినీ మూసివేస్తోందని ఆమె ఆరోపించారు. భారతదేశంలో ఏడు దశాబ్దాల కాంగ్రెస్ పాలన గురించి ఎన్‌డిఎ నాయకులు మాట్లాడుతున్నారని, గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఐఐటిలు, ఐఐఎంలు, ఎయిమ్స్ వంటి సంస్థలను నిర్మించాయని వారు తెలుసుకోవాలని చురకలంటించారు. బిహార్‌లో మహిళలకు రూ. 10,000 లంచం ఇచ్చి ఓట్లు పొందాలని ఎన్‌డిఎ భావిస్తోందన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి ఎదుర్కొన్న ఎదురుదెబ్బ తర్వాత, ఓటు చోరీకి పాల్పడుతోందని వాద్రా ఆరోపించారు. జ్ఞానేష్ కుమార్, వివేక్ జోషి, ఎస్ఎస్ సంధు అనే ముగ్గురు వ్యక్తులు అందులో భాగస్వాములుగా ఉన్నారని, ఎన్‌డిఎ ప్రభుత్వం, ఎన్నికల కమిషనర్లతో కలిసి బిహార్ ప్రజకు ద్రోహం చేసిందని ధ్వజమెత్తారు. మోదీ తన నియోజకవర్గమైన వారణాసి ప్రజలను కలవరని, విదేశాలను మాత్రమే సందర్శిస్తారని ఎద్దేవా చేశారు. పెట్రోల్, డీజిల్, ట్రాక్టర్లు అధిక పన్నులు ఎదుర్కొంటున్నందున వ్యవసాయంలో రైతులకు ఇకపై ఉత్పాదకత ఉండదని ఆమె పేర్కొన్నారు. కార్పొరేట్ సంస్థల రుణాలు మాఫీ చేస్తూ పేద ప్రజలు తమ పిల్లలను చదివించడానికి లేదా వారి పిల్లల వివాహాలు చేయడానికి తీసుకున్న రుణాలపై వడ్డీని చెల్లించడానికి తమ జీవితాలను గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్‌డిఎ ప్రభుత్వం హయాంలో రాష్ట్రంలో నేరాలు మూడు రెట్లు పెరిగాయని, వాటిలో ఎక్కువ భాగం వెనుకబడిన వర్గాలపై జరుగుతున్నాయని ప్రియాంకాగాంధీ ఆరోపించారు.

## రాష్ట్ర చరిత్రలోనే అత్యధికం

### బిహార్‌లో తొలి దశ ఎన్నికల్లో 65 శాతం పోలింగ్ : ఇసి



పాట్నా:బిహార్ అసెంబ్లీ ఎన్నికల తొలి దశలో భాగంగా ఈ నెల 6వ తేదీన పోలింగ్ జరగగా, రాష్ట్ర చరిత్రలోనే అత్యధికంగా ఓటింగ్ శాతం నమోదైంది. గతంలో ఎప్పుడూ లేనంతగా 65.08 శాతంగా నమోదైందని ఎన్నికల సంఘం తెలిపింది. 1,314 మంది అభ్యర్థుల ఎన్నికల భవితవ్యాన్ని నిర్ణయించడానికి జరిగిన పోలింగ్‌లో గ్రామీణ ప్రాంతాల్లో 36,733 మందితో సహా 45,341 పోలింగ్ కేంద్రాలలో మొత్తం 3.75 కోట్ల మంది ఓటు వేయడానికి అర్హులుగా ఉన్నారు. భరిలో ఉన్న అభ్యర్థుల్లో 1,192 మంది పురుషులు, 122 మంది మహిళలు ఉన్నారు. బిహార్ ప్రధాన ఎన్నికల అధికారి (సిఇఒ) కార్యాలయం అందించిన తాజా లెక్కల ప్రకారం, 65.08 శాతం నమోదైంది. 2020 అసెంబ్లీ ఎన్నికలలో జరిగిన ఏకీకృత పోలింగ్ శాతం కంటే 7.79 శాతం అత్యధికం. ఆ సమయంలో 57.29 శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాగా, 3.75 కోట్ల ఓటర్లలో, 1.98 కోట్ల మంది పురుషులు, 1.76 కోట్ల మంది మహిళలు ఉన్నారు. గురువారం జరిగిన ఎన్నికల్లో మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ముజఫర్‌పూర్, సమస్తిపూర్ జిల్లాలలో 70 శాతానికి పైగా పోలింగ్ నమోదైంది. ముజఫర్‌పూర్‌లో 71.81 శాతం పోలింగ్ నమోదు కాగా, సమస్తిపూర్‌లో 71.74 శాతం పోలింగ్ నమోదైంది. ఇతర జిల్లాల్లో పరిశీలిస్తే మాధేపురలో 69.59 శాతం, సహర్సాలో 69.38, వైశాలిలో 68.50, ఖగారియాలో 67.90 శాతం అధిక పోలింగ్ శాతం నమోదైంది. పాట్నా జిల్లాలో 59.02 శాతం పోలింగ్ నమోదైంది, లఖిసరాయ్ జిల్లాలో 64.98 శాతం, ముంగేర్‌లో 62.74, సివాన్‌లో 60.61 పోలింగ్ నమోదైంది. 243 మంది సభ్యులున్న అసెంబ్లీలో మిగిలిన 122 స్థానాలకు ఈనెల11న పోలింగ్ జరుగుతుంది, కౌంటింగ్ నవంబర్ 14న జరుగుతుంది.

## ఆర్‌జెడి అధికారంలోకి వస్తే ప్రజల తలలపై కత్తులే!

### చేతులు పైకెత్తమని ఆదేశించే పార్టీలు బిహార్‌కు వద్దు : మోదీ



తామ్రి/బెట్టియ : బిహార్‌లో ఆర్‌జెడి నేతృత్వంలోని ప్రతిపక్షం అధికారంలోకి వస్తే ప్రజల తలలపై 'కట్ట' పెట్టి, చేతులు పైకెత్తాలని ఆదేశిస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. శనివారం సీతామ్రి, బెట్టియాలో నిర్వహించిన వరుస ర్యాలీలో మోదీ పాల్గొని ప్రసంగించారు. మెరుగైన విద్య, క్రీడల వంటి రంగాలలో వృద్ధితో పాటు, స్టార్టప్ సంస్థలను ఎన్‌డిఎ సులభతరం చేస్తుందని ఆయన ఉద్ఘాటించారు. భారతరత్న కర్పూరి ఠాకూర్ జన్మస్థలంలో జరిగిన ర్యాలీతో తాను ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించాని, మోదీ గత నెలలో సమస్తిపూర్‌లో జరిగిన తన ఎన్నికల సమావేశాన్ని గుర్తుచేసుకుంటూ, బాపు గాంధీ మహాత్ముడిగా మారిన ప్రదేశం అయిన బెట్టియాలో తన ప్రచారాన్ని ముగించుకుంటున్నానని పేర్కొన్నారు.

బిహార్‌లో కొత్త ఎన్‌డిఎ ప్రభుత్వ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరు కావడానికి మళ్ళీ తిరిగి వస్తానన్నారు. 2005 వరకు 15 సంవత్సరాలు రాష్ట్రాన్ని పాలించిన ఆర్‌జెడి, బిహార్‌ను లాఠెట్లు, దోపిడీదారుల భూమిగా మార్చిందన్నారు. ఆర్‌జెడి తన ప్రచారంలో పిల్లలు పెద్దయ్యాక 'రంగ్‌దార్' (వీధి రౌడీ) కావాలని కోరుకుంటున్నట్లు చెప్పడానికి ప్రేరేపిస్తోందని విని తనకు వణుకు పుడుతుందన్నారు. 'కట్టా', 'కుశాసన్' (దుష్పరిపాలన), 'క్రూర్తా' (క్రూరత్వం), అవినీతి అందించే ప్రభుత్వాన్ని బిహార్ కచ్చితంగా కోరుకోదన్నారు. 'తమ తలలపై 'కట్టా' (దేశంలో తయారు చేసిన తుపాకీ) పెట్టి చేతులు పైకెత్తమని చెప్పే పాలన ప్రజలకు వద్దు. ప్రజలు స్టార్టప్‌లను కోరుకుంటున్నారు, దీనికి ఎన్‌డిఎ దోహదపడుతుంది. ఎన్‌డిఎ 'కట్టా'ను తిరస్కరించి స్కూల్ బ్యాగులు, కంప్యూటర్లు, క్రికెట్ బ్యాట్లు, హాకీ స్టిక్‌లను ప్రోత్సహిస్తుంది' అని మోదీ అన్నారు. 'మెహెంగాయి దాయన్ ఖాయే జాత్ హై' వంటి సాహిత్యంతో కూడిన పాట ప్రజాదరణ పొందిన యుపిఎ యుగంలా కాకుండా, సవరించిన జిఎస్‌టి రేట్లతో, 'మోటార్ సైకిళ్ల నుండి మొబైల్ ఫోన్‌ల వరకు సరసమైనవిగా మారాయి' అని ఆయన పేర్కొన్నారు. రెండు రోజుల క్రితం జరిగిన మొదటి దశ ఎన్నికల్లో అధిక ఓటర్లు ఓటు వేయడం పట్ల ప్రధాని ఆనందం వ్యక్తం చేశారు. 'మీరు ప్రతిపక్షాలకు 65 వోల్ట్ షాక్ ఇచ్చారు. వారు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు..... రెండవ దశ పోలింగ్‌లో మీరు మొదటి రౌండ్ రికార్డును బద్దలు కొట్టాలి' అని ఆయన అన్నారు. నెల రోజుల క్రితం తాను ప్రారంభించిన ముఖ్యమంత్రి మహిళా ఉద్యోగమి యోజన పథకాన్ని కూడా మోదీ ప్రస్తావించారు. ఈ పథకం కింద ఒక్కొక్కరికి రూ. 10,000 చొప్పున కోట్లాది మంది మహిళల ఖాతాల్లోకి బదిలీ చేశారు. జంగల్ రాజ్ వల్ల ఇది ఎప్పటికీ సాధ్యం కకాదన్నారు. బిహార్‌లోని పంచాయతీలు, మునిసిపాలిటీలలో మహిళలకు రిజర్వేషన్లను ఉటంకిస్తూ ఎన్‌డిఎ తీసుకున్న మహిళా కేంద్రీకృత చర్యల గురించి కూడా ఆయన మాట్లాడారు. సీతామర్రిలో జరిగిన ర్యాలీలో మత్స్య రంగంలో జరుగుతున్న అభివృద్ధి గురించి మాట్లాడారు. ఇటీవల మత్స్యకారులకు సంఘీభావం తెలిపేందుకు బురద చెరువులోకి దూకిన గాంధీని ఆయన ఎద్దేవా చేశారు. కొంతమంది ఎలా మునిగిపోవాలో ప్రాక్టీస్ చేస్తున్నారన్నారు. సీతాదేవి జన్మస్థలం సీతామర్రిలోని పునౌర ధామ్ ప్రాజెక్టును వారసత్వం (విరాసత్) పట్ల ఎన్‌డిఎకు ఉన్న గౌరవానికి ఉదాహరణగా ప్రధాని ప్రస్తావించారు.

## పిఎం, సిఎం సిగ్గుపడాలి


### మధ్యప్రదేశ్‌లో చిన్నారులకు న్యూస్‌పేపర్‌లో మధ్యాహ్నం భోజనం వడ్డింపుపై రాహుల్‌గాంధీ మండిపాటు



న్యూఢిల్లీ : మధ్యప్రదేశ్‌లో కొంతమంది చిన్నారులకు న్యూస్‌పేపర్‌లో మధ్యాహ్న భోజనం వడ్డించినట్లు కనిపిస్తున్న దృశ్యాలను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. ఇది చూసి తన హృదయం తల్లడిల్లిందన్నారు. ఇంత దయనీయ స్థితిలో దేశ భవిష్యత్తును తీర్చిదిద్దుతున్నందుకు అధికార నేతలు సిగ్గుపడాలని వ్యాఖ్యానించారు. మధ్యప్రదేశ్‌లో కొంతమంది చిన్నారులకు మధ్యాహ్న భోజనాన్ని న్యూస్‌పేపర్‌లో వడ్డిస్తున్నట్లు తెలుసుకుని నా హృదయం ముక్కలైంది. ఈ పిల్లలపైనే మన దేశ భవిష్యత్తు ఆధారపడి ఉంది. కానీ, వారికి కనీస గౌరవం దక్కడం లేదు. అక్కడ అభివృద్ధి అంతా భ్రమే. వ్యవస్థలను గుప్పిట్లో పెట్టుకొని అధికారంలోకి వస్తున్నారు. ఇటువంటి దుర్భర స్థితిలో పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్నందుకు అధికార నేతలు సిగ్గుపడాలి అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. 'వీరు దేశ భవిష్యత్తును కలలు కంటున్న అమాయక పిల్లలే, వారికి గౌరవ ప్లేట్ కూడా దొరకడం లేదు' అని గాంధీ హిందీలో తన పోస్ట్‌లో పేర్కొన్నారు. 20 సంవత్సరాలకు పైగా ప్రభుత్వంలో ఉన్న బిజెపి పిల్లల ప్లేట్లను కూడా దొంగిలించిందని, వారి అభివృద్ధి కేవలం భ్రమ, అధికారంలోకి రావడానికి అసలు రహస్యం 'వ్యవస్థ'' అని ఆయన ఆరోపించారు. శ్యోపుర్ జిల్లాలోని ఓ పాఠశాలలో ఈ వీడియో తీసినట్లు సమాచారం. ఈ వ్యవహారం కాస్త నెట్టింట వైరల్‌గా మారడంతో.. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌పై ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేసినట్లు తెలుస్తోంది. స్వయం సహాయక సిబ్బంది సేవలను నిలిపివేశారు. నెటిజన్లు దీన్ని ఖండించారు. మధ్యాహ్న భోజనం అనేది పిల్లల హక్కు అని పేర్కొన్నారు. పోషకాహారం పేరిట అనారోగ్యాన్ని వడ్డిస్తున్నారంటూ విమర్శించారు.

## మరోసారి నితీశ్‌కుమారే సిఎం అని చెప్పగలరా?

### మోదీ, అమిత్ షాలకు ఖర్గే సూటి ప్రశ్న



గయా/ పట్నా : బిహార్ శాసనసభ ఎన్నికల్లో ఎన్‌డిఎ విజయం సాధిస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్‌షా జోస్యాలు లోక్‌సభ ఎన్నికల్లో చార్ సౌ పార్ లాంటివేనని ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ఎద్దేవా చేశారు. బిహార్ లో బిజెపి నేతృత్వంలో కూటమి సవ్యంగా లేదని, సుదీర్ఘకాలం ముఖ్యమంత్రిగా పనిచేస్తున్న జెడి(యు) అధ్యక్షుడు నితీశ్ కుమార్ మరోసారిఆపదవిచేపడతారనే అంశంలోసందేహాలు నెలకొన్నాయన్నారు. **లోక్‌సభ ఎన్నికల సందర్భంగా** 400 స్థానాలకు పైగా గెలుస్తామని ప్రచారం చేసుకున్న బిజెపికి కనీస మెజారిటీ కంటే తక్కువ స్థానాలు వచ్చాయని, జెడియు, టిడిపి వంటి మిత్రపక్షాలపై ఆధారపడి అధికారాన్ని కొనసాగిస్తున్నారని పిటిఐతో మాట్లాడుతూ చెప్పారు.

**బిహార్‌లో** 243 అసెంబ్లీ స్థానాలలో 160కిపైగా గెలుస్తామని అమిత్‌షా చేస్తున్న ప్రకటనలు ప్రస్తావించగా చార్ సౌ పార్ ఏమైందనేని దృష్టిలో పెట్టుకోవాలన్నారు. బిహార్‌లో మహాఘట్‌బంధన్ అధికారంలోకి వస్తుందని దీమా వ్యక్తం చేశారు. ఆర్‌జెడి నేత తేజస్వీ యాదవ్ కాంగ్రెస్ తలపై తుపాకీ పెట్టడంతో ఆయనను ఇండియా కూటమి సిఎం అభ్యర్థించిందన్న ప్రధాని ఆరోపణలపై స్పందిస్తూ మోదీకి ట్రంప్ తుపాకి ఎక్కు పెట్టాడా లేదా చెప్పాలని ఖర్గే అన్నారు. తమను ఎవరూ భయపెట్టలేరని చెప్పారు. నితీశ్ షాను ముఖ్యమంత్రి అభ్యర్థిగా మోదీ, షాలు ఎందుకు ప్రకటించడం లేదని ప్రశ్నించారు. నాయకత్వంపై అంగీకారం లేకుండా వారు ఎన్‌డిఎ అధికారంలోకి వస్తుందని చెప్పలేరని అన్నారు.

## అభివృద్ధిలో దూసుకెళ్తోన్న భారత్

### బనారస్‌లో నాలుగు కొత్త వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను జెండా ఊపి ప్రారంభించిన ప్రధాని

### కవిసమ్మేళన్‌లో పాల్గొన్న కాశీ నగరం పిల్లల ప్రతిభను ప్రశంసల్లో ముంచెత్తిన మోదీ



వారణాసి/ లక్నో / బరైలీ (యుపి) : బనారస్ రైల్వే స్టేషన్ల నుండి నాలుగు కొత్త వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను శనివారం ప్రధాన మంత్రి నరేంద్రమోదీ జెండా ఊపి ప్రారంభించారు. బనారస్‌ఖజురహో, లక్నో సహరన్‌పూర్, ఫిరోజ్‌పూర్‌ఢిల్లీ, ఎర్నాకుళం బెంగళూరు మార్గాలలో ఈ కొత్త వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుస్తాయి. సెమీ హైస్పీడ్ రైళ్లు ప్రధాన స్టేషన్ల మధ్య ప్రయాణాన్ని గణనీయంగా తగ్గిస్తాయని, ప్రాంతీయ చలనశీలతను పెంచుతాయని, దేశవ్యాప్తంగా పర్యాటకరంగాన్ని ప్రోత్సహిస్తాయని, అంతేకాకుండా దేశవ్యాప్తంగా ఆర్థిక కార్యకలాపాలకు కూడా మద్దతు ఇస్తాయని ఒక అధికారిక ప్రకటన వెల్లడించింది. బనారస్‌ఖజురహో వందే భారత్ వారణాసి, ప్రయాగ్‌రాజ్, చిత్రకూట్‌తో సహా ప్రసిద్ధ సాంస్కృతిక, మతపరమైన ప్రదేశాలను కలుపుతుందని అధికారులు తెలిపారు. నాలుగు రైళ్లను ప్రారంభించిన అనంతరం నిర్వహించిన ఒక బహిరంగ సభకు భారీ సంఖ్యలో హాజరైన ప్రజలను ఉద్దేశించి నరేంద్రమోదీ ప్రసంగించారు. 'ప్రపంచ వ్యాప్తంగా ఉన్న దేశాల నుండి వందే భారత్ రైళ్లు చాలా నడుస్తున్నందున ఈ అన్ని పరిణామాలు వృద్ధితో ముడిపడి ఉన్నాయి. నేడు భారతదేశం కూడా ఈ మార్గంలో శరవేగంగా ముందుకు పయనిస్తోంది'. వందే భారత్, నమో భారత్, అమృత్ భారత్ వంటి ఈ రైళ్లు ఒక కొత్త తరం భారతీయ రైల్వేలకు పునాది వేస్తున్నాయి' అని ప్రధాని చెప్పారు. 'వందే భారత్ అనేది భారతీయుల రైలు. దీనిని భారతీయులు నిర్మించారు. వందే భారత్ రైలు గురించి ప్రతీ భారతీయుడు గర్వపడుతున్నాడు. భారతీయుల కోసం భారతీయులే నిర్మించుకున్న రైలు ఇది. ఇప్పుడు విదేశీ ప్రయాణికులు కూడా వందే భారత్ రైలును చూసి ఆశ్చర్యపోతున్నారు.ఒక అభివృద్ధిచెందిన దేశం కోసం భారతదేశం తన వనరులను మెరుగుపరుచుకోవడానికి ఒక ప్రచారాన్ని ప్రారంభించిందని, ఈ వందే భారత్ రైళ్లు అందులో ఒక మైలురాయిగా నిలుస్తాయి' అని ప్రధాని మోదీ అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పర్యటన సందర్భంగా ప్రభుత్వం వారణాసిలో భారీ భద్రతా బలగాలను మోహరింపజేసింది. రైల్వే స్టేషన్ బయట ఏర్పాటు చేసిన నరేంద్ర మోదీ భారీ కటౌట్ ప్రజలను ఆకర్షించేందుకు కేంద్ర బిందువు అయ్యింది. రైల్వే స్టేషన్ వద్ద, లోపల వారణాసిఖజురహో వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లో గుమిగూడిన పిల్లలను ఉద్దేశించి ప్రధానమంత్రి మోదీ సంభాషించారు. పిల్లలు తాము రాసిన కవితలను ప్రధానికి చదివి వినిపించారు. అనంతరం మోదీ తన ప్రసంగంలో ఈ కార్యక్రమానికి హాజరైన పిల్లలను ప్రశంసల్లో ముంచెత్తారు. 'నా కాశీ నగరానికి సంబంధించిన పిల్లలు ఇంత ప్రతిభావంతులుగా ఉన్నారని తెలిసి నేను వారణాసి ఎంపిగా చాలా గర్వపడుతున్నాను' అని మోదీ సంతోషం వ్యక్తంచేశారు. శనివారం నాడు వందేభారత్ రైళ్ల ప్రారంభం సందర్భంగా పిల్లల కవి సమ్మేళన్ ఆలోచనను మోదీ ముందుకు తెచ్చారు (ఫ్లాగింగ్ ఆఫ్ సందర్భంగా ఇక్కడ పిల్లల బృందంతో సంభాషిస్తున్నప్పుడు కవులు నన్ను ఉద్దేశించి కవి సమ్మేళనం విషయాన్ని ప్రస్తావించారు). 'ఇందులో ఉత్తమ ప్రతిభను కనబర్చిన 8 నుండి 10మంది పిల్లలను కవిత్వ పఠనాల కోసం దేశం అంతటికీ తీసుకెళ్తాం. కాశీ నుంచి పార్లమెంట్‌సభ్యుడిగా ఉన్న నాకు ఈరోజు ఒక ప్రత్యేక, సంతోషకర అనుభవం మిగిలింది. నేను ఈ పిల్లలను హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను' అని మోదీ చెప్పారు. చివరగా ప్రధానమంత్రి మోదీ తన ప్రసంగాన్ని ముగిస్తూ నినాదాలు ఇచ్చారు. ఈ సందర్భంగా 'హమ్ భారత్ కీ వాసీ, దేఖ్ రహే హై వికసిత్ కాశీ' అంటూ గట్టిగా నినాదాలు ప్రతిధ్వనించాయి. లక్నో సహరాన్‌పూర్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రారంభోత్సవంలో ఉత్తర్‌ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి బ్రజేష్ పాఠక్ వర్చువల్‌గా పాల్గొన్నారు. బరేలీ చేరుకున్న లక్నోసహరాన్‌పూర్ వందే భారత్ రైలుకు ఘన స్వాగతం లభించింది. ఉత్తర్ ప్రదేశ్ అటవీ, పర్యావరణ శాఖ మంత్రి అరుణ్‌కుమార్ సక్సేనా, ఎంపి ఛాత్రపాల్ సింగ్ గాంగ్వర్, మేయర్ ఉమేష్ గౌతం స్టేషన్‌లో ఉన్నారు. ఈ రైలు దాదాపు 7గంటల 45 నిమిషాల ప్రయాణాన్ని పూర్తి చేస్తుందని, దాదాపు ఒక గంట ప్రయాణ సమయం ఆదా అవుతుందని, లక్నో సహరాన్‌పూర్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ లక్నో, సీతాపూర్, షాజహాన్‌పూర్, బరేలీ, మొరాదాబాద్ , బిజ్‌నోర్, సహరాన్‌పూర్ నుండి ప్రయాణికులను తీసుకెళుతుందని, అలాగే పవిత్రమైన హరిద్వార్‌కు అనుసంధానాన్ని మెరుగుపరుస్తుందని కూడా అధికారులు తెలిపారు. కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కేరళ గవర్నర్ రాజేంద్ర అర్లేకర్, కేంద్ర మంత్రులు సురేశ్ గోపి, జార్జి కురియన్, రవ్‌నీత్ సింగ్ బిట్టు, ఇతర ప్రముఖులు వర్చుల్‌గా హాజరయ్యారు.

## ఢిల్లీలో భారీ అగ్నిప్రమాదం

### వందలాది గుడిసెలు దగ్ధం, ఒకరు మృతి



న్యూఢిల్లీ : ఢిల్లీలోని రోహిణిలోని రిథాల మెట్రో స్టేషన్ సమీపంలో సుమారు 500 గుడిసెలకు వ్యాపించిన భారీ మంటల్లో ఒక వ్యక్తి మరణించగా, మరొకరికి గాయాలు అయ్యాయని ఢిల్లీ అగ్నిమాపక సేవలు (డిఎఫ్ఎస్) తెలిపింది. శుక్రవారం సాయంత్రం చెలరేగిన మంటలను తగిన బృందాలను మోహరించడం ద్వారా పూర్తిగా అదుపులోకి తెచ్చామని, బాధితులకు సహాయం అందిస్తున్నామని ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖ గుప్తా తెలిపారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించామని, సహాయ, పునరావాస పనులు వేగంగా జరుగుతున్నాయని 'ఎక్స్'లో ఒక పోస్ట్‌లో ఆమె చెప్పారు. బాధితులకు ఆహారం, నీరు అందించామని, వారిని తరలించడానికి తాత్కాలిక ఆశ్రయాలను ఏర్పాటు చేశామని చెప్పారు. శుక్రవారం సాయంత్రం అనేక ఎల్‌పిజి సిలిండర్లు పేలిపోయాయని, మంటలు తీవ్రమయ్యాయని, నివాసితులలో భయాందోళనలు రేకెత్తాయని పోలీసులు తెలిపారు. ప్రాథమిక సమాచారం ప్రకారం 400 నుండి 500 గుడిసెలు కాలిపోయాయని అగ్నిమాపక అధికారులు తెలిపారు. రాత్రి 10.56 గంటలకు మంటలకు సంబంధించి కాల్ వచ్చిందని, ఆ తర్వాత బహుళ అగ్నిమాపక దళాలు, అగ్నిమాపక రోబోలను ఘటనా స్థలానికి తరలించామని డిఎఫ్ఎస్ తెలిపింది. తెల్లవారుజామున మంటలు అదుపులోకి వచ్చాయని డిఎఫ్ఎస్ అధికారి ఒకరు తెలిపారు. ఈ ఘటనలో రాజేష్ గాయపడ్డాడు. ఢిల్లీ ప్రభుత్వం బాధిత కుటుంబాలకు అన్ని విధాలుగా సహాయం అందిస్తోందని సిఎం గుప్తా అన్నారు.

## చొరబాటు యత్నం భగ్నం ఇద్దరు ఉగ్రవాదులు హతం



శ్రీనగర్ : జమ్ముకశ్మీర్‌లోని కుప్వాడాలో నియంత్రణ రేఖ వెంబడి ఉగ్రవాదుల చొరబాటు ప్రయత్నాన్ని సైన్యం భగ్నం చేసింది. ఈ క్రమంలో జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులు హతమైనట్టు అధికారులు తెలిపారు. ఆప్రాంతంలో ఆపరేషన్ ఇంకా కొనసాగుతోందని పేర్కొన్నారు. కుప్వాడాలోని కెరాన్ సెక్టార్‌లో నియంత్రణ రేఖ వెంబడి ఉగ్రవాదులు చొరబాటుకు యత్నిస్తున్నట్టు శుక్రవారం నిఘా వర్గాల నుంచి సమాచారం అందింది. ముష్కరులను అడ్డుకునేందుకు 'ఆపరేషన్ పింపుల్' కింద శుక్రవారం (నవంబర్ 7న భారత్ ఆర్మీకి చెందిన చినార్ కార్ప్స్ తనిఖీలు నిర్వహించింది. ఈ క్రమంలో శనివారం ఉదయం ఉగ్రవాదులు ఎదురుపడి కాల్పులు జరిపారు. అప్రమత్తమైన సైనికులు ఎదురుకాల్పులు జరపడంతో ఇద్దరు ముష్కరులు హతమయ్యారు. కెరాన్ సెక్టార్‌లో సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతున్నట్టు చినార్ కార్ప్స్ పేర్కొంది. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేసింది. అంతకుముందు నవంబర్ 5న కిష్టివాడ్ జిల్లా ఛత్రులోని కల్బన్ అటవీ ప్రాంతంలో ఎన్‌కౌంటర్ జరిగింది. కిష్టివాడ్‌లోని ఛత్రు ప్రాంతంలో ముగ్గురు ఉగ్రవాదులు కొన్ని నెలలుగా నక్కి ఉన్నట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. ఉగ్రవాదులు నక్కి ఉన్నారనే సమాచారం అందుకున్న భారత సైన్యంలోని వైట్ నైట్ కార్ప్స్, కశ్మీర్ పోలీసుల సంయుక్త బృందాలు ఆరేషన్ ఛత్రును ప్రారంభించాయి. ఉగ్రవాదులను గుర్తించిన దళాలు వారిని చుట్టుముట్టాయి. ఈక్రమంలో ఇరువర్గాల మధ్య కాల్పులు జరిగాయి.

## అజిత్‌పవార్ కుమారుడి భూ అక్రమాలపై విచారణ జరపాలి

### శరద్ పవార్ డిమాండ్



అకోలా : మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ కుమారుడు పార్థ్ పవార్‌కు చెందిన కంపెనీ తక్కువ ధరకే ప్రభుత్వ భూమిని కొనుగోలు చేసిన వివాదంపై విచారణ జరపాలని ఎన్‌సిపి(ఎస్‌పి) అధ్యక్షుడు శరద్ పవార్ డిమాండ్ చేశారు. ఈ వ్యవహారం గంభీరమైనదని స్వయంగా ముఖ్యమంత్రే బహిరంగంగా ప్రకటించారని, కాబట్టి సమాజానికి వాస్తవాలు తెలిసేందుకు విచారణ జరిపించాలని అకోలాలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన విజ్ఞప్తి చేశారు. పుణెలోని ముంద్వా ప్రాంతంలో రూ.1800 కోట్ల విలువైన 40 ఎకరాల ప్రభుత్వ భూములను స్టాంప్‌డ్యూటీ మాఫీ పొందడంతో పాటు కేవలం రూ.300 కోట్లకే పార్థ్‌కు చెందిన కంపెనీ అక్రమంగా కొనుగోలు చేసిందనే వివాదం మహారాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ వ్యవహారంతో తనకు సంబంధం లేదని అజిత్ పవార్ ప్రకటన చేశారు. అజిత్ పవార్‌ను ఇబ్బంది పెట్టేందుకే మహాయుతిలోని పక్షాలు రాజీయంగా లక్ష్యం చేసుకున్నాయా ? అనే ప్రశ్నకు తనకు తెలియదని శరద్ పవార్ సమాధానమిచ్చారు. పరిపాలన, రాజకీయాలు, కుటుంబం వేర్వేరు అంశాలని, కుటుంబంగా తామంతా ఒక్కటేనని, సైద్ధాంతికంగా విడిపోయి ఉన్నామని, తమ మనవళ్ళలో ఒకరు అజిత్ పవార్‌పై పోటీ చేయగా, తన కుమార్తెపై అజిత్ పవార్ సతీమణి పోటీ చేసిందని ఒక ప్రశ్నకు సమాధానంగా శరద్ పవార్ చెప్పారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో వ్యూహాన్ని మహా వికాస్ ఆఘాడీలోని భాగస్వామ్య పక్షాలన్నీ ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకుంటామన్నారు. ఆదివారం తమ కూటమి సమావేశంలో ఈ మేరకు వ్యూహంపై చర్చిస్తామని, అలాగే పాత భాగస్వాములను కూటమిలోకి తీసుకునే అంశంపై కూడా మాట్లాడుకుంటామన్నారు. మహావికాస్ ఆఘాడీ ఏకాభిప్రాయం ద్వారా మంచి ప్రత్యామ్నాయంగా ఆవిర్భంచే అవకాశం ఉంటే, మహారాష్ట్ర నవనిర్మాణ్ సేనాపై కాంగ్రెస్ తీవ్ర వైఖరిని తీసుకోవాల్సిన అవసరం లేదని, దానిపై ఆలోచన చేయాలని అన్నారు.

## బైకర్‌కు రూ. 20 లక్షలు ఫైన్

లక్నో : ఓ బైకర్‌కు ట్రాఫిక్ పోలీసులు ఊహించని షాక్ ఇచ్చారు. లక్ష రూపాయల బైక్‌కు ఏకంగా 20 లక్షల రూపాయల ఫైన్ వేశారు. ఈ సంఘటన ఉత్తర ప్రదేశ్‌లో ఆలస్యంగా వెలుగు చూసింది. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళితే.. గత మంగళవారం ముజఫర్‌నగర్‌కు చెందిన అన్మోల్‌సింఘాల్ అనే యువకుడు రోజూలాగే తన బైక్‌పై బయటకు వెళ్లాడు. అయితే, న్యూ మండీ ఏరియాలోని రోడ్డులో ట్రాఫిక్ పోలీసులు అతడి బైక్‌ను ఆపారు. ట్రాఫిక్ పోలీసులు ఆపిన సమయంలో అతడి తలపై హెల్మెట్ లేదు. దానికి తోడు బండికి సంబంధించిన డాక్యుమెంట్లు కూడా లేవు. దీంతో అధికారులు ఆ బైక్‌ను సీజ్ చేశారు. 20,74,000 రూపాయల ఫైన్ వేశారు. లక్ష రూపాయల బైక్‌కు 20 లక్షల ఫైన్ రావటంతో అన్మోల్ షాక్‌తో పాటు షేక్ అయ్యాడు. చలాన్‌ను ఫొటో తీసి తన సోషల్ మీడియా ఖాతాల్లో పోస్టు చేశాడు. ఆ ఫొటో కాస్తా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో ట్రాఫిక్ అధికారులపై విమర్శలు మొదలయ్యాయి. 20 లక్షల రూపాయల ఫైన్‌ను నాలుగు వేలకు తగ్గించారు. దీనిపై ట్రాఫిక్ ఎస్పీ అతుల్ చౌబే మాట్లాడుతూ.. 'ఈ కేసులో మోటార్ వెహికల్స్ యాక్ట్‌లోని సెక్షన్ 207 అప్లై అయ్యింది.




## కాలం.. తిరోగమనం!



మళ్లీ గతంలోకి వెళ్లగలిగితే బాగుంటుందని జీవితంలో ఏదో ఒక సందర్భంలో దాదాపు ప్రతి ఒక్కరూ అనుకొని ఉంటారు. అయితే, ఇది అసాధ్యమన్నది అందరికీ తెలుసు. కానీ, శాస్త్రవేత్తలు మాత్రం సిద్ధాంతపరంగా ఇది సాధ్యమని అంటున్నారు. తాజాగా గూగుల్ క్వాంటం ఎఐ సంస్థ చేసిన ప్రయోగం కాల చక్రాన్ని వెనక్కు తిప్పలేకపోయినా, ఆ దిశగా ఓ అడుగు వేసింది. 'క్వాంటం ఎకోస్' అనే కొత్త అల్గారిథం సాయంతో ఈ ప్రయోగం జరిగింది. విల్లో క్వాంటం చిప్‌పై ఒక సిములేటెడ్ క్వాంటం సిస్టమ్‌లో సమాచారాన్ని తిరిగి ఆవిర్భవించడాన్ని లేదా టైమ్ రివర్సల్‌ను ప్రదర్శించారు. అంటే క్యూబిట్స్‌ను నిర్దిష్టంగా మార్చివేసి, ఒక వ్యవస్థ అభివృద్ధిని వ్యతిరేక దిశలో నడిపారు. దీనినే 'టైమ్ రివర్సల్ ప్రొటోకాల్'గా పేర్కొంటున్నారు. దీని ద్వారా క్వాంటం సమాచారం ఎలా వ్యాప్తి చెందుతుంది? దానిని ఎలా తిరిగి పొందవచ్చు? అనే ప్రశ్నలకు సమాధానం కనుక్కొనే ప్రయత్నం చేశారు. ఈ ప్రయోగంతో క్వాంటం ఎంటాల్జిమెంట్, ఇన్ఫర్మేషన్ ప్రిజర్వేషన్, ఎర్రర్ కరెక్షన్ వంటి విషయాల్లో కొత్త ఆవిష్కరణకు దారులు ఏర్పడ్డాయి. అయితే, దీని ఆధారంగా మనిషి 'టైమ్ ట్రావెల్' చేయగలడని నిరూపించే అవకాశం లేదు. ఇది కేవలం క్వాంటం సిస్టమ్‌లో సమయాన్ని తిరోగమనంలో నడిపించడం సాధ్యమని చెప్పడానికి మాత్రమే పనికి వస్తుంది. మరింత మెరుగైన క్వాంటం సిములేషన్, దృఢమైన కమ్యూనికేషన్, కొత్త కంప్యూటింగ్ విధానాలను సాధించడం సాధ్యమని శాస్త్రవేత్తలు నిరూపించగలిగారు. ప్రపంచంలోని అత్యుత్తమ సూపర్‌కంప్యూటర్ కంటే 13,000 రెట్లు వేగంగా ఈ ప్రయోగాన్ని క్వాంటం కంప్యూటర్ సాధించింది. ఈ ప్రయోగం పూర్తిగా ఫిజిక్స్‌లోని ప్రాథమిక నియమాల్లో కొత్త ఆవిష్కరణలకు, ప్రత్యేకించి క్వాంటం కమ్యూటింగ్ దోషాలను సరిచేయడానికి ఉపయోగపడుతుంది. ఇలాంటి ప్రయోగాలు మరింత విస్తృతంగా జరిగి, పూర్తి స్థాయిలో విజయవంతమైతే, గతంలోకి వెళ్లడం సాధ్యమవుతుందేమో? సైన్స్‌లో ఏదైనా సాధ్యమే.

## అంతరాలు లేని సౌరకుటుంబం



మనుషుల్లో స్వార్థం పెరిగిపోయి, కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయి. కానీ, మన సౌర మండలంలో ప్రధాన కేంద్రకంగా ఉన్న నక్షత్రమైన సూర్యుడు, దాని చుట్టూ తిరిగే గ్రహాలలో మాత్రం ఎంతో అన్యోన్యత కనిపిస్తుంది. సూర్యుడు ప్రపంచానికి వెలుగునిస్తే, వాతావరణాన్ని స్థిరంగా ఉంచే బాధ్యత చంద్రుడిది. ఇక బృహస్పతి (జూపిటర్), శని (శాటర్న్) వంటి పెద్ద గ్రహాలు రక్షణ వలయంలా పని చేస్తున్నాయి. మన గెలాక్సీ నుంచి మాత్రమేగాక, విశ్వంలో వేలాదిగా ఉన్న ఇతర గెలాక్సీలు, నక్షత్రాలు, గ్రహాల నుంచి భూమివైపు దూసుకొచ్చే అత్యంత ప్రమాదకరమైన శకలాలను ఆకర్షిస్తాయి. వాటిని తమలోకి లాక్కుంటాయి లేదా దారి మళ్లిస్తాయి. ఈ విధంగా భూమికి రక్షణభటుల పాత్ర పోషిస్తున్నాయి. కాబట్టి మన సౌర కుటుంబం కేవలం గ్రహాల సమాహారం మాత్రమే కాదు, ఒక కుటుంబంలా ఒకదానికొకటి సహాయంగా ఉండే వ్యవస్థగా అర్థం చేసుకోవాలి. ఈ విధంగా, మన బతుకును నిర్భీతిగా, సురక్షితంగా నిలిపేలా సౌర వ్యవస్థ పరస్పర సహకారం అందిస్తోంది. దురదృష్టవశాత్తు ఆ కనీస జ్ఞానం మనిషిలో మటుమాయమవుతున్నది. భూగోళం యుద్ధాలు.. దాడులతో దద్దరిల్లుతున్నది.


## అత్యంత లోతైన ప్రాంతం 'మారియానా'



సముద్రాల్లో అత్యంత లోతైన ప్రాంతం మారియానా ట్రెంచ్. మన ఊహకు కూడా అందనంత లోతు ఎంత అంటే, ఎవరెస్ట్ పర్వతాన్ని అక్కడ ఉంచినా దాని శిఖరం ఇంకా ఒక మైలు లోతు నీటిలో మునిగిపోయి ఉంటుంది. ఈ అద్భుతమైన ప్రాంతం పూర్తిగా చీకటితో నిండిపోయి ఉంటుంది. దీనితో అపారమైన ఒత్తిడిని కలిగిస్తుంది. అయినప్పటికీ అక్కడ అరుదైన, జీవరాశులు నివసిస్తాయి. ఎలాంటి పరిస్థితులనైనా తట్టుకొని, జీవించగల సామర్థ్యం వీటి ఎలా వచ్చిందనే విషయంపై శాస్త్రవేత్తలు ఇప్పటికీ అధ్యయనాలు చేస్తున్నారు. మారియానా ట్రెంచ్‌ను సంపూర్ణంగా అన్వేషించడం ద్వారా జీవం అతి క్లిష్టమైన వాతావరణాల్లో ఎలా మనుగడ సాగిస్తుందో తెలుసుకోవచ్చు. ఇది మన సముద్రాలు, మన భూమిపైన కూడా మనకు తెలియని ఎన్నో రహస్యాలు ఉన్నాయని గుర్తుచేస్తుంది. అలల క్రింద దాగి ఉన్న ఈ విచిత్ర లోయ, భూమిపై ఉన్న గొప్ప సహజ అద్భుతాల్లో అత్యంత రహస్యభరితమైనదిగా నిలుస్తుంది. ప్రకృతి సృష్టించిన మహా అద్భుతం.

## చేతి రాత.. మెదడుకు మేత!

మొదట కంప్యూటర్లు... తర్వాత సెల్ ఫోన్లు... చేతి రాతను పూర్తిగా మింగేస్తున్నాయి. కీబోర్డు పెత్తనం చెలాయిస్తున్న యుగంలో చేతి రాత గగనమైంది. కానీ, చేత్తో రాయడం అనేది మెదడు పనితీరును పెంచే అత్యంత శక్తివంతమైన సాధనమని న్యూరోసైంటిస్టులు స్పష్టం చేస్తున్నారు. తాజా నివేదికలను అనుసరించి, టైపింగ్ కంటే చేతితో రాయడమే ఎక్కువగా మెదడు సర్క్యూట్లను క్రియాశీలం చేస్తుంది. చేతిరాత జ్ఞాపక శక్తికి సాధనం. పఠన శక్తికి అభ్యాసం. సమాచార ప్రాసెసింగ్ వంటి ప్రక్రియలకు అవసరమైన నాడీ సంబంధాలను బలపరిచే ఇంధనం. మనం రాసేటప్పుడు, చలన భాగాలు, దృశ్య గ్రహణం, భాష కేంద్రాలను మెదడు ఏక సమయంలో క్రియాశీలం చేస్తుంది. ఈ బహుఇంద్రియ చర్య సమాచారాన్ని మేధస్సులో గాఢంగా ముద్రిస్తుంది, దాన్ని మరింత సులభంగా గుర్తుచేసుకునేలా చేస్తుంది. దీని విరుద్ధంగా, టైపింగ్ కేవలం వేళ్ల పునరావృత కదలికలపై ఆధారపడుతుంది. మెదడుకు తక్కువ ఉత్తేజాన్ని ఇస్తుంది, ఫలితంగా జ్ఞాపకశక్తి బలహీనమవుతుంది. చేతితో నోట్సులు తీసుకునే విద్యార్థులు, టైప్ చేసే విద్యార్థుల కంటే భావనాత్మక అవగాహన, గుర్తుంచుకునే సామర్థ్యంలో మెరుగైన ఫలితాలు సాధిస్తారని తాజా ఫలితాలు వెల్లడిస్తున్నాయి. చేతిరాత, సమాచారాన్ని సారాంశం చెయ్యడం, పునఃవ్యాఖ్యానం చెయ్యడం, విశ్లేషించడం వంటి కార్యాలను ప్రోత్సహిస్తుంది. ఇవన్నీ అవగాహనను, దీర్ఘకాలిక జ్ఞాపకాన్ని బలపరుస్తాయి. కేవలం చదువుకు మాత్రమే పరిమితం కాకుండా, చేతిరాతకు విస్తృతమైన మేధో ప్రయోజనాలు ఉన్నాయి.



దినచర్యను రాయడం లేదా స్కెచ్‌లు వేయడం ద్వారా ప్రారంభిస్తే మంచిది. ఆ అలవాటు సృజనాత్మకతను ఉత్తేజపరుస్తుంది. ఏకాగ్రతను పెంచుతుంది, స్పర్శాత్మక, ధ్యానాత్మక అనుభూతితో ఒత్తిడిని తగ్గిస్తుంది. ఇది చేతి వ్యాయామం మాత్రమే కాదు.. మెదడుకు మేత కూడా. ముఖ్య విషయాలను చేత్తో రాయడం, రోజువారీ డైరీని లిఖించడం లేదా జాబితాలు తయారు చేయడం వంటి చిన్న మార్పులకే గణనీయమైన మేధో ప్రయోజనాలు ఉంటాయి. అక్షరాలను శారీరకంగా రూపొందించడం వల్ల మెదడు అంతటా సంకేతాలు ప్రవహించి, అభ్యాసం, జ్ఞాపకశక్తికి కీలకమైన మార్గాలను బలపరుస్తాయి. డిజిటల్ యుగంలో చేతిరాత కేవలం గతపు జ్ఞాపకం కాదు.. అది న్యూరోలాజికల్ ప్రక్రియ. చేత్తో రాసే ప్రతి పదం మేధస్సును బలపరుస్తుంది. కొత్త అనుబంధాలను సృష్టిస్తుంది. టైపింగ్ చేయలేని రీతిలో సమాచారాన్ని స్థిరపరుస్తుంది. అత్యంత శక్తివంతమైన మానసిక వ్యాయామాలు అత్యంత సాధారణమైన, మానవీయమైన చర్యల నుంచే ఉద్భవిస్తాయనడానికి చేతి రాతే నిదర్శనం.

— బిఎస్ఎస్ మైత్రేయి

## జూబ్లీహిల్స్ గెలుపు ఎవరిది?

ఈ వారంలో పరిణామాలు రాష్ట్ర రాజకీయాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ముఖ్యంగా రెండు రోజుల్లో పోలింగ్ జరగనున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ఫలితాలు ఎలా ఉండబోతున్నాయని అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. బరిలో నిలిచిన మూడు ప్రధాన పార్టీలైన అధికార కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపిలు హోరా హోరీగా ప్రచారం సాగిస్తున్నాయి.

ఆయా పార్టీల ముఖ్య నేతలుగా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మాజీ మంత్రి కె.టి.రామారావు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిలు అన్నీ తామై వ్యవహరిస్తున్నారు. అభ్యర్థులు నవీన్ యాదవ్ (కాంగ్రెస్), మాగంటి సునీత(బిఆర్ఎస్), ఎల్.దీపక్‌రెడ్డి (బిజెపి)ల కంటే 'ఆ ముగ్గురు' కీలక నేతలే ఎన్నికల బరిలో ఉన్నారా? అన్నట్లుగా వాతావరణం నెలకొంది. ప్రచారం సైతం ఇప్పటికే పతాక స్థాయికి వెళ్ళి, పరస్పర వ్యక్తిగత దూషణల పర్వం జోరుగా సాగుతోంది.

సాధారణంగా ఉప ఎన్నికలో ముఖ్యమంత్రి తమ పార్టీ తరుపున చివర్లో ప్రచారానికి దిగుతుంటారు. కానీ, మొదట్లో కిందిస్థాయిలో కాంగ్రెస్‌లో స్తబ్దత నెలకొన్నట్లు నివేదిక అందడంలో సిఎం రేవంత్‌రెడ్డి స్వయంగా రంగంలో దిగారు. ఎక్కడెక్కడ లోటుపాట్లు ఉన్నాయో కసరత్తు చేసి, ఒక్కొక్కటిగా సరిదిద్దుకుంటూ వచ్చారు. ఇక కెటిఆర్ అన్ని పార్టీల కంటే ముందు ప్రచార బరిలోకి దూకారు. ప్రతిరోజు సమీక్షలు నిర్వహించుకుంటూ, ఏదో ఒక అంశంతో కాంగ్రెస్ అభ్యర్థిని, ముఖ్యమంత్రిని ఇరుకునపెట్టే ప్రయత్నం సాగిస్తున్నారు. ఒక దశలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బిఆర్ఎస్ పైచేయి సాధించిందనే వాతావరణాన్ని సృష్టించగలిగారు.

ప్రజాపక్షం 09-11-2025, ఆదివారం

సిట్టింగ్ ఎంఎల్‌ఎ మాగంటి గోపీనాథ్ స్థానంలో ఆయన సతీమణి సునీతను పోటీ పెట్టడం ద్వారా సానుభూతి కార్డును బలంగా ప్రయోగించింది బిఆర్ఎస్. అలాగే అమలు కాని ప్రభుత్వ హామీలను జనంలోకి తీసుకెళ్ళేందుకు గులాబీ పార్టీ నేతలు శతవిధాల ప్రయత్నించారు.

ఈ అంశాలతో బిఆర్ఎస్ బలం పుంజుకుందని, పెద్ద సంఖ్యలో ఉండే మైనారిటీ ఓటర్లలో కూడా కారు పార్టీ దూసుకుపోతుందని సోషల్ మీడియా ప్రచారంతో పాటు, మౌఖిక ప్రచారం జోరుగా సాగింది. అందుకు తగ్గట్లుగా పలు సర్వేలు బిఆర్ఎస్‌కు మొగ్గ ఉన్నట్లుగా ఫలితాలను విడుదల చేశాయి. అయితే, గతంలో జరిగిన ఎన్నికల సందర్భంలోనే ప్రీ పోల్, పోస్ట్ పోల్ సర్వేల విశ్వసనీయత అడుగంటింది. వెంటనే అప్రమత్తమైన కాంగ్రెస్ తమ వైపు ప్రతికూలాంశాలను సరిదిద్దుకుంటోంది.

ఇక బిజెపి స్టార్ క్యాంపెయినర్, స్థానిక ఎంపి జి.కిషన్ రెడ్డి ఆలస్యంగా ప్రచారం మొదలుపెట్టారు. అభ్యర్థి ఎంపిక, ప్రచారపర్వం ప్రారంభం ఆలస్యమైన ప్రభావం ఆ పార్టీపై పడింది. అయినప్పటికీ, కిషన్ రెడ్డి తన వంతు పాత్రను పోషించారు. బిజెపి ఓట్లు బిఆర్ఎస్‌కు బదలాయింపు జరుగుతాయనే అభిప్రాయం పెద్ద ఎత్తున ప్రబలింది. అందుకు తగ్గట్టుగానే గత లోక్‌సభ, శాసనసభ ఎన్నికల్లో బిజెపి, బిఆర్ఎస్ అభ్యర్థుల ఓట్ల వివరాలను మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు వెల్లడించారు. ఇదొక రకంగా బిజెపికి నష్టం చేకూర్చింది. రెండు మూడు రోజులుగా ప్రచారానికి వచ్చిన కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ప్రచార సరళిని మార్చి, మతపరమైన అంశాలను తెరపైకి తీసుకురావడం, మాగంటి గోపీనాథ్ మృతి పట్ల ఆయన తల్లి మాటలను ప్రస్తావించడం ద్వారా జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కొత్త మలుపు తిరిగింది.

బిఆర్ఎస్ ఆశలు పెట్టుకున్న సానుభూతిపై కొంత ప్రభావం చూపే అవకాశం లేకపోలేదని విశ్లేషకులు భావిస్తున్నారు.

ఏదేమైనప్పటికీ కాంగ్రెస్, బిఆర్ఎస్‌లు సర్వశక్తులు ఒడ్డుతున్నాయి. తమ మెజారిటీ కనీసం 20వేలతో మొదలవుతుందని కాంగ్రెస్ వర్గాలలో విశ్వాసం కనపడుతుండ గా, తమకు అధికార పార్టీకి మధ్య 5 శాతం తేడా ఉంటుందని బిఆర్ఎస్ ధీమాగా చెబుతోంది. అయితే, తాజా పరిణామాల నేపథ్యంలో బిఆర్ఎస్‌లో కొంత ఆందోళన నెలకొంది. మొత్తంగా నవంబర్ 14న ఫలితాలు వెలువడనున్న ఈ ఉప ఎన్నిక ప్రభావం రాష్ట్ర రాజకీయాలపై ముఖ్యంగా బిఆర్ఎస్, బిజెపిలపై ఉండే అవకాశం ఉంది.

# 'ఓటు చోరీ'పై దర్యాప్తు చేయాల్సిందెవరు?

డాక్టర్ జ్ఞాన్ పాఠక్

2024 హర్యానా శాసనసభ ఎన్నికల్లో 'ఓటు చోరీ' జరిగిందని ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తాజాగా ఆరోపించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఓట్ల దొంగతనానికి దోహద పడేలా ఓటర్ల జాబితా నుండి ఓటర్ల తొలగింపు, చేర్పింపుల కోసం చేతులు కలిపారని ఆరోపించారు.

సాధారణంగా నిందితులు చేసే మొదటి పని ఆరోపణను తిరస్కరించడం. ఆరోపణలు తప్పు అని వారు చెబుతారు. అయినప్పటికీ, ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయబడతాయి, చట్టం ప్రకారం కేసుల దర్యాప్తు సాగుతుంటుంది. ప్రస్తుత కేసులో నిందితులందరూ చట్టబద్ధంగా ప్రత్యేక హక్కులు కలిగిన వ్యక్తులు. ఇది వారిపై ఎఫ్ఐఆర్ దాఖలును, ఆరోపణలపై దర్యాప్తును నిరోధిస్తుంది.

అంతేకాకుండా, ఆరోపించిన నేరం సంవత్సరాల తరబడి కొనసాగింది. ఎన్నికల కమిషన్‌లో అనేక మంది అధికారులు, అధికార బిజెపి నాయకుల ప్రమేయం ఉన్నందున, 'ఓటు చోరీ' దర్యాప్తు సంక్లిష్టమైన విషయం. దీనికి చాలా సమయం, కృషి అవసరం. న్యాయ శాస్త్రం ప్రకారం నిందితుడు తనపై ఉన్న కేసును ఎంతమాత్రం దర్యాప్తు చేయకూడదు. అందువల్ల 'ఓటు చోరీ' నేరాన్ని ఎవరు దర్యాప్తు చేస్తారనేది ప్రశ్న?

కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఆగస్టు 7, 2025న కర్ణాటకలోని మహాదేవ్ పుర నియోజకవర్గంలో 'ఓట్ల చోరీ' ని బయటపెట్టడం ద్వారా, ఈ వ్యవహారాన్ని ఒక క్రమపద్ధతిలో ఎలా నిర్వహిస్తారనేది ఉదాహరణగా చూపించారు. తరువాత, సెప్టెంబర్ 1న ఆయన దానిని 'అణు బాంబు'గా అభివర్ణించారు. త్వరలో 'హైడ్రోజన్ బాంబు'ను వదులుతానని కూడా చెప్పారు. నవంబర్ 5న ఆయన 'హైడ్రోజన్ బాంబు'ను వేశారు. అది 2025లో జరిగిన హర్యానా శాసనసభ ఎన్నికలుకు సంబంధించినది.

'ఓట్ల చోరీ' జరిగిందని ఆరోపించబడిన కాలంలో ప్రస్తుత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ ఆ పదవిలో లేరు. అయినప్పటికీ, 'ఓట్ల చోరీ'లో పాల్గొన్న అధికారులు, రాజకీయ వ్యక్తులను ఆయన వెనుకేసుకు వస్తున్నారు. రాహుల్ గాంధీ బయటపెట్టిన అంశాలను నిరూపించాలని, ప్రమాణపూర్వకంగా విషయాలను ధృవీకరించాలని కోరుతూ ఆయనకు ఇసిఐ నోటీసులు జారీ చేసింది. నేరానికి సంబంధించిన కొన్ని ఆధారాలను అత్యంత జాగ్రత్తగా సేకరించిన 'ఓట్ల చోరీ' బాధితుడిని బెదిరించేందుకే ఈ చర్య అనేందుకు ఇది ఏమీ తీసిపోదు. ఆరోపిత 'ఓట్ల చోరీ'పై ఇసిఐ ఇంకా దర్యాప్తు ప్రారంభించలేదు.

ప్రధాని నరేంద్ర మోదీతో కుమ్మక్కై ఎన్నికల ఫలితాలను బిజెపికి అనుకూలంగా మార్చినందుకు ఇసిఐకి వ్యతిరేకంగా అనేక నిరసనలు వ్యక్తమయ్యాయి. బిజెపి. 'ఓట్ల చోరీ' ప్రధానంగా నిజమైన ఓటర్లను తొలగించడం, బయటి ఓటర్లను చేర్చడం ద్వారా జరుగుతుంది. ఓటర్ల జాబితాలు తారుమారు చేయడాన్ని రాహుల్ గాంధీ బయటపెట్టా రు.

అయినప్పటికీ, బిహార్‌లో ఎన్నికల సంఘం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఆఫ్ ఎలక్టోరల్ రోల్(ఎస్ఐఆర్)ను మొదలుపెట్టింది. దీనిపై




ప్రతిపక్ష ఇండియా కూటమి నిరసన వ్యక్తం చేసింది. బిజెపికి అనుకూలంగా 'ఓట్ల చోరీ' చేయడం కోసమే ఈ ఓటర్ల జాబితాను తారుమారు చేసే ప్రయత్నం అని ఆరోపించింది. లక్షలాది మంది ఓటర్లు బయటి నుండి ఎలా చేర్పించబడ్డారో దేశ ప్రజలు చూశారు, అయితే లక్షలాది మంది నిజమైన ఓట్లు తొలగించబడ్డాయి. తొలగింపు లేదా చేర్పింపులకు వ్యతిరేకంగా ఓటర్‌ల నుంచి నిర్దేశిత ఫారమ్‌లు ద్వారా ఎలాంటి విజ్ఞప్తి లేదని ఇసిఐ వాదన. ఇది బలహీనమైన రక్షణ. ఎందుకంటే పోలీసులు, యంత్రాంగం బాధితులను అవమానిస్తున్నందున చాలామంది నేరాన్ని నివేదించడానికి బయటకు రావడానికి ఇష్టపడరని అందరికీ తెలుసు. తొలగింపులు, చేర్పులపై రాజకీయ పార్టీలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. కానీ అవి సరైన ఫారమ్‌లలో దాఖలు చేయబడలేదని ఇసిఐ చెబుతోంది. ఇది నేరాన్ని నివేదించే వ్యక్తులకు అవమానం. ప్రతిపక్ష నాయకుడిని సైతం ప్రధాన మంత్రి, ఇసిఐ, హోం మంత్రి వదిలిపెట్టరు. 'ఓట్ల చోరీ', దాని వెనుక ఉన్న కుట్ర గురించి లేవనెత్తినందుకు ఆయనను పదేపదే అవమానిస్తున్నారు. తాజాగా దేశంలోని 12 రాష్ట్రాలు, యుటిలలో రెండవదశ ఎస్ఐఆర్ జరుగుతోంది. మూడవ దశలో మిగతా దేశం మొత్తం తటా అమలు చేయబడుతుంది.

ఈ నేపథ్యంలో, హర్యానాలో రాహుల్ గాంధీ చేసిన 'ఓట్ల చోరీ' అనే తాజా ఆరోపణకు ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది. హర్యానా విధాన సభ ఎన్నికల్లో 'ఓట్ల చోరీ' జరిగిందని ఆయన నొక్కిచెప్పారు. భారత ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేయడానికి భారత ఎన్నికల సంఘం, ప్రధానమంత్రి, కేంద్ర హోంమంత్రితో చేతులు కలిపారని ఆరోపించా రు.

కర్ణాటకలోని మహాదేవ్‌పూర్ శాసనసభ స్థానం ఓటర్ల జాబితా నుండి ఓటర్ల పేర్లను తొలగించిన ప్రయత్నం వెనుక ఉన్న వ్యక్తుల సాంకేతిక వివరాలను పంచుకోవడానికి నిరాకరించడం ద్వారా భారత ప్రజాస్వామ్యాన్ని 'ధ్వంసం' చేస్తున్న వారిని సిఇసి జ్ఞానేశ్ కుమార్ రక్షిస్తున్నారని రాహుల్ ఆరోపించారు.

హర్యానాలో, హర్యానా ఓటర్ల జాబితాలో 5,21,619 మందికి పైగా నకిలీ ఓటర్లు ఉన్నారని ఆయన ఆరోపించారు. ఈ ఓటు చోరీ వ్యవస్థ పారిశ్రామికీకరించబడిందని, వారు బిహార్‌లో కూడా ఇదే పని చేస్తారని మాకు కచ్చితంగా తెలుసునని అన్నారు. రెండు బూత్‌లలో వేర్వేరు పేర్లతో ఒకే ఓటరు ఫోటో 223 సార్లు కనిపిస్తుందని రాహుల్ గాంధీ నిర్దిష్ట ఆరోపణలు చేశారు. 'హర్యానాలో వేలాది ఉదాహరణలు ఉన్నాయి' అని ఆయన అంటున్నారు. హర్యానాలో ఒకే ఫోటోతో 1,24, 177మంది ఓటర్లు ఉన్నారని ఆయన అన్నారు. 'ఇసిఐ సిసిటివి ఫుటేజ్‌ను నాశనం చేస్తున్నారు' అని ఆయన ఆరోపించారు.

హర్యానాలో దాదాపు 25 లక్షల మంది ఓటర్లు నకిలీ ఓటర్లు అని ప్రతిపక్ష నాయకుడు ఆరోపించారు. బ్రెజిలియన్ మోడల్ ఫోటోను ఉపయోగించుకొని 10 బూత్‌లలో 22 సార్లు ఓటు ఉపయోగించిన ఓటరు ఫోటో గుర్తింపు కార్డు (ఎపిక్)ని కూడా అతను చూపించాడు.

రాహుల్ గాంధీ ఈ ఆపరేషన్ మొత్తానికి 'ఆపరేషన్ సర్కార్ చోరీ' అని పేరుపెట్టారు. ఓట్ల దొంగతనం నియోజకవర్గ స్థాయిలోనే కాకుండా రాష్ట్ర, జాతీయ స్థాయిలో కూడా జరుగుతోందని ఆయన ఆరోపించారు. ప్రతిపక్ష నాయకుడి ఆరోపణలు తీవ్రమైనవి. వాటిపై సమగ్ర దర్యాప్తు అవసరం. అయితే, మిలియన్ డాలర్ల ప్రశ్న ఏమిటంటే దీన్ని ఎవరు చేస్తారు? పాలక ప్రభుత్వం, ఇసిఐ నిందితులుగా ఉన్నాయి. రాహుల్ గాంధీ మహాదేవ్‌పురాలో ఓట్ల దొంగతనంను బహిర్గతం చేసిన కేసులో చర్య కోసం ఇసిఐ వద్దకు వెళ్లాలని భారత సుప్రీంకోర్టు ఇటీవల ఒక పిటిషనర్‌ను కోరింది. ఒక పౌరుడు ఏమి చేయగలడు?

# జోహ్రాన్ మమ్దానీ గెలుపు - నవచరిత్రకు మలుపు

అమెరికాలో ఇటీవల జరిగిన మేయర్ మరియు గవర్నర్ ఎన్నికల్లో డెమొక్రాట్స్ విజయ దుందుంభి మోగించారు. ఈ విజయాలను ట్రంప్ పాలనా విధానాలకు పెద్ద ఎదురుదెబ్బగా భావించవచ్చు. ముఖ్యంగా డోనాల్ ట్రంప్ అమెరికాకు రెండవసారి అధ్యక్షుడుగా ఎన్నికైన తర్వాత జరిగిన ఈ మొదటి ప్రధాన ఎన్నికల ప్రక్రియ ద్వారా ప్రజానీకం ఆయన విధానాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని చాలా సృష్టంగా విదితమవుతూనే ఉంది అని చెప్పవచ్చు.

అమెరికాలో అతిపెద్ద నగరం, ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ రాజధాని అయిన న్యూయార్క్ నగర మేయర్ ఎన్నికలలో డెమోక్రట్ పార్టీ తరపున డెమొక్రటిక్ సోషలిస్టుగా పరిగణించబడే మొదటి దక్షిణాసియా, మొదటి భారతీయ సంతతి, మొదటి ముస్లిం అభ్యర్థి మరియు క్వీన్స్ అసెంబ్లీ సభ్యుడు అయిన 34 ఏళ్ల జోహ్రాన్ మమ్దానీ తొలి సోషలిస్టు మేయర్‌గా విజయం సాధించి నవ చరిత్రకు మలుపుగా అయినారు. ఆయన అమెరికాలో సరికొత్త రాజకీయాలకు నాంది పలికాడు.



జోహ్రాన్ మమ్దానీ 1991 అక్టోబర్ 18 నాడు మహమూద్ మమ్దానీ, మీరా నాయర్ దంపతులకు ఉగాండాలోని కంపాలాలో జన్మించారు. ఆయన తల్లి మీరా నాయర్ ప్రముఖ భారతీయ అమెరికన్ దర్శకురాలుగా ప్రసిద్ధి పొందారు. జోహ్రాన్ మమ్దానీ ఏడేళ్ల వయసులో తల్లిదండ్రులతో కలిసి న్యూయార్కుకు వెళ్లి 2018లో అమెరికా పౌరసత్వం పొందాడు. ఆయన బౌడోయిన్ కళాశాల నుండి ఆఫ్రికన్ స్టడీస్‌లో డిగ్రీతో పట్టభద్రులయ్యారు.2020లో తొలిసారిగా న్యూయార్క్ రాష్ట్ర అసెంబ్లీ సభ్యుడిగా ఎన్నికయ్యాడు.

జోహ్రాన్ మమ్దానీ సామ్రాజ్యవాద దేశంలో తనకు తాను 'డెమొక్రటిక్ సోషలిస్ట్' అని సగర్వంగా చెప్పుకున్నారు. అయితే డెమోక్రాటిక్ పార్టీ తరపున న్యూయార్క్ మేయర్ అభ్యర్థిత్వానికి పోటీపడిన పదకొండు మందిని వెనక్కునెట్టి జూన్ 24 నాడు మమ్దానీ నామినేట్ కావడం నుండి మేయర్ ఎన్నికల చివరి వరకు అధ్యక్షుడు ట్రంప్ ఆయనను లక్ష్యంగా చేసుకుని 'జ్యూస్ హేటర్' గాను, 'కమ్యూనిస్ట్' గాను, రాడికల్ డెమొక్రటిక్ గాను, యూదుమత వ్యతిరేకిగాను రకరకాలుగా గాఢమైన విమర్శలతో అభివర్ణించాడు. 'జోహ్రాన్ మమ్దానీ గెలిస్తే అమెరికన్ సమాజంలో ఆర్థిక, సామాజిక విపత్తు సంభవిస్తుంది అని, భయోత్పాతాలు సృష్టించబడతాయి' అని అధ్యక్షుడు ట్రంప్ ప్రజలను ఆందోళనలకు గురి చేసిన తీరు అహేతుకతకు అద్దం పట్టింది . అంతిమంగా న్యూయార్క్‌కు చట్టబద్ధంగా రావాల్సినవి తప్ప ఫెడరల్ ఫండింగ్ ఇవ్వకుండా ఆపివేస్తాను అని ట్రంప్ బెదిరించినను ఆ బెదిరింపులను ఖాతరు చేయని న్యూయార్క్ ప్రజలు జోహ్రాన్ మమ్దానీకే పట్టం కట్టడం పట్ల ప్రజలకు ఆయన పట్ల ఉన్న విశ్వాసానికి నిదర్శనంగా నిలుస్తుంది.

న్యూయార్క్ నగరంలో 'ప్రజా సంక్షేమమే ధ్యేయం' అని జోహ్రాన్ మమ్దానీ ప్రకటించారు. విద్య, వైద్యం, గృహ వసతి వంటి మౌలిక రంగాలు ప్రైవేటీకరించబడడం మూలంగా ముఖ్యంగా శ్రామిక ప్రజానీకం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై దృష్టి సారించి ఆరోగ్యం, పబ్లిక్ స్కూళ్ల బలోపేతం, ఇంటి అద్దెల నియంత్రణ, కనీసవేతన అమలు, ఉచిత ప్రజా రవాణా, కార్మిక హక్కుల అమలు మరియు వలస కుటుంబాల వారికి రక్షణ కల్పించడం మొదలైన హామీలు ఆయన ప్రకటించారు. ధనికులపై పన్నులు పెంచి, ఆ నిధులతో ప్రభుత్వ కార్యక్రమాలకు నిధులు సమకూరుస్తానని ఆయన వాగ్దానం చేయడాన్ని ప్రత్యేకంగా గమనించవచ్చు. ఆ రకంగా ఆయన ప్రకటించిన ప్రజా సంక్షేమ హామీలు ప్రజలను విశేషంగా ఆకట్టుకోవడం మూలంగా ఆయనను విజయం సులువుగానే వరించింది అని చెప్పవచ్చు.

ఉదారవాద పురోగామి ఎజెండాతో ప్రచారం నిర్వహించిన జోహ్రాన్ మమ్దానీకి ప్రజలు పట్టం కట్టడం 'డెమొక్రటిక్ పార్టీకి నూతన ఉత్సాహాన్ని ఇచ్చింది' అని నిస్సందేహాంగా చెప్పవచ్చు.

జోహ్రాన్ మమ్దానీ మేయర్‌గా ఎన్నిక కాగానే భారత తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ మాటలను గుర్తు చేసుకున్నారు. ముఖ్యంగా 'ఎన్నికల్లో విజయం ఓ చారిత్రాత్మక క్షణం. అణచివేతకు గురైన దేశ ఆత్మ జాగృతమై తన గొంతుక వినిపించిన అద్భుత క్షణం ఇది. ఈ కొత్త శకంలో న్యూయార్క్ ప్రజలు స్పష్టత, దార్శనికత, ధీరత్వంతో కూడిన నాయకత్వాన్ని చూస్తారు. పాత శకా న్ని వదిలి కొత్త శకాన్ని అనుసరించినప్పుడు సుదీర్ఘంగా అణచివేతకు గురైన జాతి గళం విప్పినప్పుడు ఇలాంటి క్షణా లు చాలా అరుదుగా మాత్రమే సంభవిస్తాయి. ఇప్పుడు మనం ఒక నవశకంలోకి అడుగుపెడుతున్నాం. ఈ కొత్త శకంలో న్యూయార్క్ ప్రజలు స్పష్టత, దార్శనికత, ధీరత్వంతో కూడిన నాయకత్వాన్ని చూస్తారు' అనే నెహ్రూ వ్యాఖ్యలను ఆయన ఉటంకించడం తద్వారా నవచరిత్రకు మలుపుగా నిలిచారు. ఆ క్రమంలోనే 'న్యూయార్క్ నగర మేయర్ ఎన్నిక రాజకీయ రాజవంశాన్ని కూల్చివేసింది. ఇకపై మా పోరు మరింతగా పెరుగుతుంది. ఈ తీర్పు మార్పుకు సంకేతంగా నిలిచింది. మా భవిష్యత్తు మా చేతుల్లోనే ఉంది' అని జోహ్రాన్ మమ్దానీ వ్యాఖ్యానించడాన్ని ప్రత్యేకం గా గమనించవచ్చు.

అమెరికాలో సంప్రదాయ వాద భావజాలం వేళ్లూనుకుంటున్న తరుణంలో వామపక్ష సమర్థకులు డెమొక్రటిక్ పార్టీ వైపుగా పయనించడాన్ని చాలా స్పష్టంగా గమనించవచ్చు. 'డెమొక్రటిక్ పార్టీలో ఉన్న పురోగామి శక్తులు నీరుగారిపోకుండా మరింతగా తమ స్థానాన్ని పటిష్టపరుచుకొనేందుకు జోహ్రాన్ మమ్దానీ సాధించిన విజయం ఎంతగానో స్ఫూర్తినిస్తుంది' అని చెప్పవచ్చు.

జెజెసిపి. బాబూరావు
రీసెర్చ్ స్కాలర్,
94933 19690.

# యువతలో న్యాయ స్ఫూర్తి

సమాజంలో సానుకూల మార్పు తీసుకురావాలంటే యువతకు తమ హక్కులు, బాధ్యతలపై అవగాహన ఉండడం అత్యంత ముఖ్యమైంది. న్యాయ జ్ఞానం లేకపోవడం వారిని తప్పుదారిలోకి నడిపించవచ్చు; చట్టంపై అవగాహన కలిగి ఉండడం యువతను హింస, మోసం, దుర్వినియోగం వంటి ప్రమాదాల నుండి రక్షిస్తుంది. వ్యక్తిగత జీవితంలోనూ, సామాజిక పరిసరాలలోనూ చట్టపరమైన పద్ధతిలో ఎలా వ్యవహరించాలో తెలుసుకోవడం ప్రతి యువకుడికి అవసరం. న్యాయ అవగాహన యువతలో ధైర్యం, నైతిక విలువలు, సామాజిక బాధ్యతలను పెంపొందించి సమాజంలో సక్రమమైన వాతావరణాన్ని నిర్మించడంలో దోహదం చేస్తుంది.

యునిసెఫ్(UNICEF) పిల్లల న్యాయ వెబ్‌సైట్ వంటి కార్యక్రమాలు పిల్లలకు సులభమైన, ఆకర్షణీయమైన న్యాయ సమాచారాన్ని అందిస్తాయి. భారతదేశంలో పాఠశాలల్లో న్యాయ విద్యకు చారిత్రకంగా తక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. ఫలితంగా అనేక తరాలు రాజ్యాంగం, పౌర హక్కులు, న్యాయ వ్యవస్థపై పరిమిత అవగాహనతో పరిమితమయ్యాయి. ప్రజాస్వామ్య వ్యవస్థ బలంగా ఉండాలంటే పౌరులు చట్టం, న్యాయం, బాధ్యతను సమగ్రమైన రీతిలో అర్థం చేసుకోవాలి.

CBSE పాఠ్యాంశాల్లో న్యాయ విద్య రాజ్యాంగ సూత్రాలు, ప్రాథమిక హక్కులు, సైబర్ చట్టాలు, వినియోగదారుల హక్కులు కవర్ చేయడం విద్యార్థులకు చట్టపరమైన పరిస్థితుల్లో సరైన నిర్ణయాలు తీసుకోవడంలో, న్యాయం, సమానత్వం, బాధ్యత వంటి విలువలను నేర్చుకోవడంలో సహాయపడుతుంది. న్యాయ అవగాహనలో ముఖ్య అంశాలు: రాజ్యాంగ హక్కులు, న్యాయ వ్యవస్థ అవగాహన, వినియోగదారుల రక్షణ, సైబర్ భద్రత, బాలహక్కులు, మానవ హక్కులు. చిన్న వయసులోనే వీటిని అర్థం చేసుకోవడం యువతకు శక్తివంతమైన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం, చట్టపరమైన మేధస్సు, బాధ్యతాయుతంగా వ్యవహరించగల సామర్థ్యాన్ని పెంపొందిస్తుంది.

(ప్రతి సంవత్సరం నవంబర్ 9న జరుపుకునే జాతీయ న్యాయ సేవల దినోత్సవం సందర్భంలో)

డా౹౹ కృష్ణ కుమార్ వేపకొమ్మ
ప్రొఫెసర్ & ప్రిన్సిపాల్ (రిటైర్డ్)
హైదరాబాద్–500045

## అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్ బోల్తా

**ప్రజాపక్షం /మల్హర్:** ఎలాంటి అనుమతులు లేకుండా వాల్గొండ గోదావరి నుండి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కాగా ఇసుకలోడుతో వెళ్తున్న ట్రాక్టర్ ఒక్కసారిగా ట్రాలీ బోల్తా కొట్టడంతో పక్కనే ఉన్న పంట పొలం కొద్ది పాటిగా ధ్వంసం అయింది. బోల్తా పడి రెండు మూడు రోజులు గడిచిన అధి కారులకు విషయం తెలిసిన అటువైపు కన్నెత్తి చూసిన దాఖలాలే లేవు. ఇలా ప్రతి ఏటా ట్రాక్టర్లు బోల్తా కొట్టి ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతున్న అధి కారుల్లో మాత్రం ఇసుక అక్రమ రవాణా అడ్డుకట్ట వేసే విషయంలో చలనం లేకుండానే పోయింది. ఏదైనా ప్రమాదం జరిగితేనే తప్ప అధికారులు ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై స్పందించరా అంటూ ప్రజల్లో అధికారుల పని తీరుపై అసహనం వ్యక్తం అవుతుంది. ఇసుక అక్రమ దందా మూడు పువ్వులు ఆరు కాయలు అన్న చందంగా సాగుతూ వీరికి వరాలను కురిపిస్తుంది.

## పోలీసు శాఖలో పదోన్నతులు బాధ్యతను పెంచుతాయి

సిద్దిపేట పోలీస్ కమిషనర్ విజయ్‌కుమార్

**ప్రజాపక్షం/ సిద్దిపేట:** పోలీసు శాఖలో పదోన్నతులు మరింత బాధ్యతను పెంచుతాయని సిద్దిపేట పోలీస్ కమిషనర్ విజయ్‌కుమార్ అన్నారు. శని వారం సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ హెడ్‌కానిస్టేబుల్ నుండి ఎఎస్‌ఐ వెంకటేశ్, వై, అశోక్‌లను ఎఎస్‌ఐలుగా పదోన్నతి పొందిన వారిని సిపి విజయ్ కుమార్ అభినందించారు. ఈసందర్భంగా సిపి విజయ్‌కుమార్ మాట్లా డుతూ పదోన్నతులు పొందిన పోలీసు సిబ్బంది రెట్టింపు ఉత్సాహంతో ప్రజ లకు సేవలు అందించాలని కోరారు. పోలీసు శాఖలో క్రమశిక్షణతో బాధ్య తతో విధుల పట్ల నిబద్ధతతో వ్యవహరించే ప్రతి ఒక్కరికి తగిన గుర్తింపు, గౌరవ మర్యాదాలు లభిస్తాయన్నారు. పోలీసులు అంకిత భావంతో, నిస్వా ర్థంగా విధులు నిర్వహించాలన్నారు. బాధ్యతతో విధులు నిర్వహించిన పోలీసు అధికారులు ప్రజల్లో మంచి గుర్తింపు లభిస్తుందన్నారు.

## కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్



**ప్రజాపక్షం/వేములవాడ:** రైతులు తాము కష్ట పడి పండించిన పంట ఉత్పత్తులను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రా ల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. వేములవాడ మున్సిపాలిటీ పరిధిలోని బాలాన గర్ లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఇంచార్జి కలెక్టర్ శనివారం ఆకస్మికంగా పరిశీలించారు. ముందుగా రైతులు కొనుగోలు కేంద్రంలో పోసుకున్న ధ్యానం కుప్ప లను పరిశీలించి, ధాన్యం ఎప్పుడు తీసుకువ చ్చారు? స్థానికంగా కల్పించిన వసతులపై రైతు లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా లో ఐకేపీ, పీఏ సీఎస్, మెప్మా, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో మొత్తం 238 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఇప్పటి వరకు 48,325 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని వెల్లడించారు. ప్రభుత్వం ఏ గ్రేడ్ ధాన్యా నికి క్వింటాలుకు 2389 రూపాయలు సాధారణ రకానికి 2369 రూపాయలు గా నిర్ణయించిం దని తెలిపారు. రైతులు తమ సమీపంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి, మద్దతు ధర పొందాలని సూచించారు. కొను గోలు కేంద్రాల్లో రైతులకు అన్ని వసతులు కల్పిం చాలని నిర్వాహకులను ఆదేశించారు. సరైన తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేసి, కేటా యించిన రైస్ మిల్లులకు తరలించాలని సూచిం చారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే ఉన్నతాధికా రుల దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి రామ క్రిష్ణ, అధికారులు, కొనుగోలు కేంద్రం నిర్వాహ కులు పాల్గొన్నారు.

## తాగునీటి కోసం మూడు కిలోమీటర్లు వెళ్లాల్సిందే!



**ప్రజాపక్షం/ముత్తారం:** తలాపునే మా నేరు ఉన్న ఆ గ్రామ ప్రజలకు త్రాగునీరు కష్టాలు తప్పడం లేదు. పెద్దపల్లి జిల్లా ము త్తారం మండలంలోని ఖమ్మంపల్లి గ్రామం మానేరు పరివాహక ప్రాంతంను అనుకోని ఉంటుంది. ఈ గ్రామంలో త్రాగునీటి కోసం మానేరు వాగు నుండి వాటర్ పైప్ లైన్ వేసి గ్రామంలో ఉన్న ట్యాంక్ లోకి నీటిని ఎక్కిస్తూ ఆ ట్యాంక్ ద్వారా గ్రామంలోకి నీటిని సరఫరా చేస్తున్నారు. దింతో వాటర్ అన్ని వార్డులకు రాకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దింతో మూడు కిలోమీటర్ల దూరంలో మానేరు అవతల ఉన్న జయశంకర్ భూపాలపల్లి జిల్లా తాడిచర్ల ఎఎంఆర్ ప్రైవేట్ కంపెనీ వారు వేసిన బోర్ల వద్దకు వెళ్లి త్రాగునీరు తెచ్చుకుంటున్నారు. కమ్మంపల్లి గ్రామంలో త్రాగు నీటి కోసం అడ, మగ రాశి సీడ్ కంపెనీ ఆధ్వర్యంలో గ్రామస్తుల కోసం ఉచితంగా వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. కానీ ఈ ప్లాంట్ గత ఏడాది క్రితం రిపేర్ అయ్యింది. దింతో ఆ ప్లాంట్‌ను రిపేర్ చేయిస్తే గ్రామస్తులు త్రాగునీటికి ఎలాంటి ఇబ్బందులు ఉండవని ఇప్పటికైనా అధికారులు స్పందించి వాటర్ ప్లాంట్ ను రిపేర్ చేయించి ప్రజలకు ఉచిత త్రాగునీటిని అందిచాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## 47 మందికి కోత విధించిన అలవెన్స్‌ను తిరిగి చెల్లించాలి

ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్ డిమాండ్

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** ఎన్ టి పి సి. లో సీఎస్సీ ప్యాకేజ్ 6లో నార్త్ ఇండియన్స్ ఆకాష్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ కంపెనీ కాంట్రాక్టర్ టెండర్ దక్కించు కొని లెస్కు వేసుకున్నామ్ అనే సాకుతో 30 సంవత్సరాల నుంచి తీసుకుం టున్న అలవెన్స్ ఒక్కో కార్మికునికి 2000 చొప్పున 47 మందికి కటింగ్ చేసిన అలవెన్స్ వెంటనే తిరిగి చెల్లించాలని ఏఐటీయూసీ పెద్దపల్లి జిల్లా జన రల్ సెక్రెటరీ కడారి సునీల్ ఎన్టిపిసి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణలో ఉన్న ఎన్టిపిసి లో నార్త్ ఇండియన్స్ అథర్ స్టేట్ కాంట్రాక్టర్లకు టెండర్లు ఇవ్వొద్దని డిమాండ్ చేశారు. టెండర్లు వేయడానికి తెలంగాణలో కాంట్రాక్టర్లు లేరా వారి అర్హులు కారా అని, కటింగ్ చేసిన అలవెన్స్ తిరిగి ఇప్పించేలా యాజమాన్యం హెచ్‌ఆర్ డిపార్ట్మెంట్ ఏజీఎం తదితర ఎన్టిపిసి అధి కారులు కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తెచ్చి అలవెన్స్ తిరిగి చెల్లించే విధంగా చూడాలని కడారి సునీల్ డిమాండ్ చేశారు. ఒకవేళ అలవెన్స్ లు చెల్లించకపోతే కార్మికు లతో కలిసి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

## గుప్త నిధుల కోసం... ఆలయంలో గుట్టుగా తవ్వకాలు



**ప్రజాపక్షం/ముత్తారం :** గుప్తనిధుల కోసం పురా తన ఆలయాలే లక్ష్యంగా చేసుకుని గుర్తు తెలి యని వ్యక్తులు శివాలయంలో నిధులు ఉన్నాయని అర్ధరాత్రి వేళలో గుట్టుగా తవ్వకాలు చేపట్టిన ఘటన పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని ఖమ్మంపల్లి పంచాయతీ పరిధిలో జరిగింది. ఖమ్మంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని సంద రెల్లి పురాతన శివాలయంలో గుర్తు తెలియని దుండగులు గుప్త నిధుల కోసం తవ్వకాలు జరి పారు. సందరెల్లి గ్రామానికి దూరంగా మానేరు పరివాహాకంగా నిర్మానుష్య ప్రాంతంలో ఈ గుడి ఉండటం అదునుగా చేసుకొని గతంలో కూడా చాలా మంది ఇక్కడ గుప్త నిధులు ఉన్నాయని భావించి తవ్వకాలు చేపట్టారు. శుక్రవారం రాత్రి వేళలో గుర్తు తెలియని దుండగులు తవ్వకాలు చేపట్టడంతో ఇక్కడ కలకలం రేపు తుంది. ప్రభుత్వాలు ఎన్ని మారిన ఈ పురాతన శివాలయంను పట్టించుకో కపోవడంతో ఇక్కడ ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయి. ఇప్ప టికైనా ఈ ప్రాంతంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసి పురాతన ఆలయాన్ని కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఎంతైనా ఉంది.

## ఘనంగా సీఎం పుట్టినరోజు వేడుకలు




**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పుట్టినరోజు సంధర్బంగా శనివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంతో పాటు నగరంలోని పలు చోట్ల ,జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు వేడుక లను ఘనంగా నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి హాజరై డిసిసి బిసి సెల్ అధ్యక్షుడు పులి ఆంజనేయులు గౌడ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొరివి అరుణ్ కుమార్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు బానోతు శ్రావణ్ నాయక్‌తో పాటు పార్టీ శ్రేణుల సమక్షంలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. అనంతరం నగర కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇందిరాచౌక్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి గుండాటి శ్రీనివాస్‌రెడ్డి హాజరై డిసిసి ఎస్సీసెల్ అధ్యక్షుడు కొరివి అరుణ్ కుమార్‌తో పాటు పలువురు నేతలతో కలిసి కేక్ కట్ చేశారు. కాంగ్రెస్ నాయకులు, ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షు రాలు చర్ల పద్మ, నగర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వెన్నెం రజిత రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ విభాగాలకు చెందిన నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇందిరా చౌక్ వద్ద ఏర్పాటు చేసిన బారీ కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచి ఆనందాన్ని పంచుకున్నారు. నగర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వెన్నెం రజితారెడ్డి ఆధ్వర్యంలో వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగర కాంగ్రెస్ నాయకుడు దీకొండ శేఖర్ ఆధ్వ ర్యంలో మైత్రి కన్వెన్షన్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎస్సీ సెల్ అధ్య క్షుడు కొరివి అరుణ్, నగర కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు లింగంపల్లి బాబులు హాజరై స్థానికులతో కలిసి వేడుకలు జరుపుకున్నారు. కరీంనగర్ అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖలీం ఆధ్వర్యంలో హైమద్‌పుర చౌరస్తా వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమానికి నగర యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు శరణ్య గౌడ్ హాజరై మాజీ అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్దుల్ రెహమాన్‌తో కలిసి కేక్ కట్ చేశారు. తీగలగుట్ట పల్లికి చెందిన కాంగ్రెస్ నేత కొలగాని అనిల్ ఆధ్వర్యంలో వారి నివాసం వద్ద చిన్నారులతో కలిసి కేక్ కట్ చేశారు. నియంత పాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడి ప్రజలకు అండగా నిలుస్తున్నారన్నారు. పలువురు కాంగ్రెస్ నాయ కులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైల్వే కాంట్రాక్టు కార్మికులకు బోనస్ చెల్లించాలి



**ప్రజాపక్షం/గోదావరిఖని :** రైల్వే కాంట్రాక్టు కార్మికులకు బోనస్, అల వెన్స్, ఎన్.హెచ్.లు చెల్లించాలని కోరుతూ రామగుండం రైల్వే సిఅండ్ డబ్ల్యు డిపో ఎడిఎంఈ జి.ప్రభాకర్‌కు శనివారం వినతిపత్రం అందజేసినట్లు ద.మ.రై. మల్టిపుల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు, తాజా మాజీ కార్పొరేటర్ కన్నూరి సతీష్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎ సంస్థలోనైన బోనస్ చెల్లింపు చట్టం ప్రకారం కాంటారక్టు కార్మికులకు బోనస్ చెల్లించాలన్నారు. రైల్వే డిపోలోని అన్ని విభాగాల కాంట్రాక్టు కార్మికులకు బోనస్ ఇవ్వాలని గతంలో పలుమార్లు యూనియన్ పక్షాన రైల్వే అధికారులను, కాంట్రాక్టర్లను కోరగా, ఈ విష యమై చర్చించి ఒప్పుకోవడం జరిగిందన్నారు. అయితే కొన్ని విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులకు మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. అన్ని విభాగాల కార్మికులకు బోనస్ ఇవ్వడంతోపాటు రామగుండం పరిధిలోని కార్మికులకు తప్పనిసరిగా ఎన్.హెచ్. ఇవ్వాలన్నారు. ఈ విషయమై ఎడిఎంఈ సానుకూ లంగా స్పందించినట్లు తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో యూనియన్ ప్రధాన కార్యదర్శి సిహెచ్.కుమారస్వామి, నాయకులు ఎం.ప్రసాద్, రజని కాంత్, ఎస్.కోటి, సభ్యులు పాల్గొన్నారు.

## పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభలు వాయిదా

ఎఐటియుసి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అజ్జ వేణు,కడారి రాములు




**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ఈనెల 16,17 తేదీలలో జర గబోయే ఏఐటియుసి అనుబంధ పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభలు కొన్ని అనివార్య కారణాల వల్ల తాత్కాలికంగా వాయిదా వేస్తున్నామని ఏఐటియుసి జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు అజ్జ వేణు, కడారి రాములు అన్నారు. శనివారం ఏఐటియుసి జిల్లా కార్యాలయంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ జిల్లా మహాసభ లను అందరి సమక్షంలో చర్చించి తేదీని నిర్ణయించి తెలుపుతామని అన్నారు. ఇది కార్మిక సంఘాల నాయకులు గమనించాలని కోరారు.

## గాంధీ సెంటర్ బ్రిడ్జి నిర్మాణ పనులు తక్షణమే పూర్తి చేయాలి




**ప్రజాపక్షం/చేర్యాల:** చేర్యాల మండల కేంద్రంలోని గాంధీ సెంటర్ వద్ద బ్రిడ్జి నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయని కాంట్రాక్టర్ వైఖరిని నిరసిస్తూ శనివారం స్థానిక వ్యాపారస్తులు, పట్టణ ప్రజలు బ్రిడ్జిపై ఆందో ళన నిర్వహించారు.అరగంట పాటు వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపో యాలు. సంఘటన స్థలానికి చేర్యాల ఏఎస్ఐ నవీన్ కుమార్ పోలీస్ సిబ్బందితో చేరుకొని కాంట్రాక్టర్ దృష్టికి తీసుకెళ్లి త్వరగా పరిష్కార మయ్యే విధంగా కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమిం చారు. గత రెండు సంవత్సరాలుగా గాంధీ సెంటర్ వద్ద సాగుతున్న బ్రిడ్జి నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండడంతో కనీసం నీరు కొట్టకుండా నిర్లక్ష్యంగా వదిలేయడంతో కంకర రాళ్లు దుమ్ము దూళితో వ్యాపారస్తులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చరిత్ర కలిగిన గాంధీ సెంటర్‌ను నిర్వీర్యం చేస్తూ బ్రిడ్జి పొడుగును పెంచడంతో పోచమ్మ వీధి కడవెరుగు రోడ్డు వెళ్లే దారులు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. గాంధీ చౌరస్తాను సుందరీకరణ చేయాలని, నాణ్యత ప్రమాణాలు పాటించకుండా నిర్లక్ష్యంగా సాగుతున్న పనుల పట్ల ఉన్నతాధికారులు స్పందించి కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనకు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్ మద్దతు తెలిపారు.

## కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

జిఎం కార్యాలయం ఎదుట ఎఐటియుసి ధర్నా




**ప్రజాపక్షం/పెద్దపల్లి:** సింగరేణి లో కార్మికుల పెండింగ్ సమస్యల ను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గుర్తింపు సంఘం ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి ఆధ్వర్యంలో జి.ఎం.కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఆర్జీ వన్ జనరల్ మేనేజర్ లలిత్ కుమార్ కు పది డిమాండ్ లతో కూడిన వినతి పత్రాన్ని ఇవ్వడం జరిగిందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, ఆర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం లు పేర్కొన్నారు. శనివారం సింగరేణి ఆర్జీ వన్ జనరల్ మేనేజర్ కార్యాలయం వద్ద జరిగిన ధర్నా అనంతరం మాట్లాడుతూ సింగరేణిలో పెండింగ్ లో ఉన్న కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, కమిటీల పేరు మీద కాలయాపన చేయవద్దని, ఏఐ టియుసి గెలిచిన తరువాత కార్మికుల సంక్షేమం కోసం వారి హక్కుల కోసం కృషి చేస్తున్నప్పటికీని, కొన్ని కార్మిక సంఘాలు గనులపై ఏఐటియుసి పై చేస్తున్న అసత్య ప్రచారాన్ని వారు తిప్పికొట్టారు. మార్చి నెలలో నిర్వహించిన స్ట్రక్చరల్ మీటింగ్ లో సంవత్సరంలో 150 మస్టర్లు తప్పనిసరి చేస్తూ నిబంధన తీసుకొస్తున్న క్రమంలో యాజమాన్యా నికి ఏఐటియుసి యూనియన్ మద్దతుగా ఉండి కార్మికుల ను మోసం చేస్తున్నదని అసత్య ప్రచారం చేస్తున్న సంఘాలను కార్మికులు నమ్మవ ద్దని వారు పేర్కొన్నారు.గతంలో కార్మికులకు సొంత ఇంటి పథకంపై సిఐటియు చేసిన సంత కాల సేకరణ వారి అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి తప్ప దానివల్ల కార్మికులకు ఒరిగిందేమీలేదని, ఈ సంఘం ప్రచార ఆర్భాటం ఎక్కువ, పోరాటం తక్కువని ఎద్దేవా చేశారు. ఐఎన్టీయుసి సంఘం ప్రభుత్వం పై, యాజమాన్యం పై కార్మికుల సమ స్యల పరిష్కారం కోసం పోరాటాలు చేయరని, కేవలం ఏఐటియుసి ని విమర్శించడమే పని గా పెట్టుకుని కార్మికుల ను మోసం చేస్తున్నా రని,సింగరేణి కి రావలసిన కోట్లాది రూపాయల బకాయిలపై ఎందుకు ప్రభుత్వం పై ఒత్తిడి చేయడం లేదని విమర్శించారు. కొత్త గనులు రాక పోవడం వల్ల సింగరేణి లో అనేక సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని, దీనికి కారణం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలేనని, సింగరేణి లో కార్మికులెవరు గుర్తింపు సంఘం ఏఐ టియుసి పై చేస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మవ ద్దని వారు విజ్ఞప్తి చేశారు. కార్మికుల సమస్యలపై గుర్తింపు సంఘం పిలుపునిచ్చే పోరాటాలకు కలిసి రావాలని కార్మికుల కు పిలుపునిచ్చారు. ముఖ్యంగా మెడికల్ బోర్డు గత ఏడు నెలల నుంచి నిర్వహించక పోవడం వలన కార్మికులు అనా రోగ్య కారణాల వలన ఉద్యోగం చేయలేక పోవ డంతో ఆర్థికంగా కుటుంబాలు ఇబ్బంది పడుతు న్నాయని, వెంటనే మెడికల్ బోర్డు నిర్వహించా లని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐటి యుసి నాయకులు సంకె అశోక్, మాదన మహేష్, రంగు శ్రీను, ఎస్ వెంకట్ రెడ్డి, గండి ప్రసాద్, బోగ సతీష్ బాబు, ఆకునూరి శంకరయ్య, దొంత సాయన్న, ఎం. చక్రపాణి, సిద్దమల్ల రాజు, సిర్ర మల్లికార్జున్, సయ్యద్ సోహేల్, పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి కళోత్సవాలలో ఆల్ఫోర్స్ విద్యార్థినికి ప్రథమ బహుమతి



**ప్రజాపక్షం/కరీంనగర్:** రాష్ట్రస్థాయి కళోత్సవా లలో ప్రథమ బహుమతి సాధించడంతో పాటు జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన అల్ఫోర్స్ ఇ టెక్నో స్కూల్ విద్యార్థిని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ప్రత్యేకంగా అభినందించి మాట్లాడారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో విద్యార్థులు అన్ని రంగా లలో అగ్రగామిగా కొనసాగడం చాలా గొప్ప విష యమని, విద్యార్థులకు అన్ని వేళల్లో చేయూతని స్తున్న నరేందర్‌రెడ్డిని ప్రత్యేకంగా అభినందిం చారు. ఇటీవల రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా నిర్వ హించబడిన కళోత్సవాలలో ప్రథమ స్థానం కైవసం చేసుకోవడమే కాకుండా జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవడం గొప్ప విషయమని హర్షం వ్యక్తం చేశారు. విధ్యాసంస్థల చైర్మన్ డా.వి.నరేంద ర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు సమగ్రమైన సమాచారాన్ని ఇవ్వడమే కాకుండా ప్రత్యక్ష పద్ధ తిలో బోధనను అందిస్తూ వారిలో దాగిఉన్న ప్రతి భను వెలికి తీస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు ఇష్టమైన రంగంలో నిపు ణులైన ఉపాధ్యాయులచే శిక్షణ ఇప్పి స్తున్నామని చెప్పారు. శుక్రవారం హైదరాబాదులోని రవీంద్రభారతిలో తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన కళోత్సవ్ పటీలలో పాఠ శాలకు చెందిన వి.శ్రీనిధి (9వ) పాటల పోటీలలో అత్యుత్తమ ప్రతి భను కనరబరచడమే కాకుండా రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుని జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవడం గొప్ప విషయమని హర్షం వ్యక్తం చేశారు. కలెక్టర్ ఆధ్వర్యంలో విధ్యా ర్థులకు చాలా ప్రోత్సాహం లభిస్తుందని, విద్యార్థు లందరూ సద్వినియోగం చేసుకుని తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని కోరారు. విజేతకు పుష్పగుచ్చాన్ని అందజేసి జాతీయస్థాయిలో ప్రతిభ చాటి విజేతగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కూల్చివేసిన మైసమ్మ ఆలయాలను వెంటనే పునరుద్ధరించాలి

48 గంటలల్లో స్పందించకుంటే తీవ్ర పరిణామాలు తప్పవు

మంత్రి బండి సంజయ్ కుమార్



**ప్రజాపక్షం/కరీంనగర్:** గోధావరిఖనిలో 46 దారి మైసమ్మ ఆలయాలను అధికా రులు కూల్చివేయడంపై కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డుకు అడ్డుగా ఉన్నాయనే కారణంతో ఆల యాలను కూల్చివేసిన అధికారులు మసీదులను ఎందుకు కూల్చలేదని ప్రశ్నించారు. హైదరాబాద్ నుంచి పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, రామగుండం మున్సిపల్ కమిషనర్ అరుణశ్రీ లకు ఫోన్ చేసిన బండి సంజయ్ ఆలయాలను కూల్చివేయడంపై మండిపడ్డారు. రోడ్డుకు అడ్డంగా ఉన్నాయని విస్తర ణలో భాగంఆ కూల్చివేశా మంటూ అధికారులు చెప్పడంతో రోడ్డుకు అడ్డంగా మసీదులు సైతం ఉన్నాయి కదా? మరి వాటిని ఎందుకు కూల్చవేయలేదని ప్రశ్నిం చారు. ఎవరి మెప్పు కోసం మూకుమ్మడిగా మైసమ్మ ఆలయాలను కూల్చివేశారు? అని ప్రశ్నించారు. ఆటోడ్రైవర్ల అడ్డాల దగ్గర ప్రతి రోజు మైసమ్మ ఆలయం వద్ద మొక్కుకుంటారని, భక్తులు నిత్యం దర్శించుకుం టారని పేర్కొన్నారు. రోడ్డుకు అడ్డంగా ఉన్నా యనే నెపంతో ఇష్టమొచ్చినట్లు కూల్చివేస్తారా? భక్తుల మనోభావాలు పట్టవా? అని మండిప డ్డారు. హిందువులంటే అంత చులకనా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. 48 గంటలు సమయ మిస్తున్నానని, కూల్చివేసిన దారి మైసమ్మ ఆల యాలన్నింటినీ ఆ లోపు పునరుద్ధరించాలన్నారు. దారికి అడ్డంగా ఉన్న మసీదులన్నింటినీ కూల్చివే యాలన్నారు. లేని పక్షంలో తాను గోదావరిఖనికి వస్తానని, దగ్గరుండా మసీదులన్నింటినీ కూల్చివే యిస్తానన్నారు. జూబ్లిహిల్స ఉప ఎన్నికల పోలింగ్ అయిన వెంటనే గోదావరిఖని వస్తానని, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో సహా అధికారులం దరినీ ప్రజల ముందు నిలబెడతానన్నారు. జరగ బోయే పరిణామాలకు అధికారులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

## మైసమ్మ విగ్రహాలను కూల్చిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** గోదావరిఖని పట్టణంలో భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా మైసమ్మ ఆల యాల ను కూల్చి వేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఈ విధ్వంసం పై పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా గోదావరి పట్టణ ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ గోదావరిఖని పట్టణంలో భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా, సుమారు 48 మైసమ్మ ఆలయాలను అధికారులు కూల్చివే యడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది భక్తుల విశ్వాసాన్ని అవమా నపరచే చర్యగా మాత్రమే కాకుండా, స్థానిక ప్రజల సాంస్కృతిక, ఆధ్యాత్మిక విలువలను తాకే దురదృష్టకర సంఘటన అని, ప్రజల భావోద్వేగాలను పరిగ ణనలోకి తీసుకోకుండా, సాంప్రదాయంగా పూజించబడుతున్న దేవాలయా లను ధ్వంసం చేయడం పూర్తిగా అన్యాయమని ,ఈ ఘటనకు బాధ్యులైన అధి కారులపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యంగా జిల్లా మంత్రివర్యులు శ్రీధర్ బాబు కు విజ్ఞప్తి చేశారు. ఈ ఘటన పట్ల నిర్లక్ష్యం చూపిస్తే, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు మళ్లీ జరగకుండా ఉండవనీ,ఈ అంశాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్తామని, గోదావ రిఖని ప్రజలు చూపుతున్న ఆవేదనను అర్థం చేసుకుని, ప్రభుత్వం వెంటనే స్పందించి దోషులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## 17న సిపిఐ జాతకు ఘన స్వాగతం పలికాలి

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు లక్ష్మణ్

**ప్రజాపక్షం/ సిద్దిపేట :** ఈనెల 17న సిద్దిపేట జిల్లా కేంద్రానికి సిపిఐ జాత చేరుకుంటుందని.. జిల్లా పార్టీ నాయకులు,కార్యకర్తలు,అనుబంధ ప్రజాసంఘాల కార్మికులు వేల సంఖ్యలో పాల్గొని ఘనస్వాగతం పలకాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కిష్టపురం లక్ష్మణ్ పిలుపునిచ్చారు. శని వారం సిద్దిపేట జిల్లాకేంద్రంలో సిపిఐ నాయ కులు, కార్యకర్తలతో సిపిఐ జాత విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రాలను ఆవిష్కరిం చారు. ఈసందర్భంగా సిపిఐ నేత కిష్టపురం లక్ష్మణ్ మాట్లాడుతూ 1925 డిసెంబర్ 26న ఆవిర్భవించిన సిపిఐ పార్టీ భారత గడ్డపై వందేళ్లు పూర్తి చేసుకుందన్నారు. భారతదేశా నికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని తొలుత గర్జించింది ఏకైక పార్టీ సిపిఐ అన్నారు. సిపిఐ శత వసంత ఉత్సవాలు పార్టీ ఆవిర్భవించిన కాన్పూర్‌లో 2024 డిసెంబర్ 26న ప్రారంభ మైన దేశవ్యాప్తంగా జాతలు ఉత్సాహభరితంగా జరుగుతున్నాయన్నారు. అందులో భాగంగా సిద్ది పేట జిల్లాకు ఈనెల 17న సిపిఐ జాత చేరుకుం టుందన్నారు. 17న సిద్దిపేట జిల్లా కేంద్రంలో జరిగే సిపిఐ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. అలాగే ఖమ్మంలో జరిగే లక్ష లాది మందితో డిసెంబర్ 26న ముగింపు బహి రంగ సభ జరుపుకుంటుందన్నారు. బ్రిటిష్ వారి నుండి దేశ విముక్తి కొరకు రాజీలేని పోరాటాలు చేస్తున్నందున ఆనాడు పార్టీపై నిషేధం విధించా రన్నారు. కాన్పూర్ మీరట్ పేషవారు తదితర కుట్ర కేసులు పెట్టి నాయకులను జైల్లో బంధించి నట్లు తెలిపారు. 2004లో ప్రతి కుటుంబానికి పదిహేను లక్షల ఇస్తామని, రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని, ధరలు తగ్గిస్తామని ప్రతి యేట రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, ప్రజాఆ కర్షిక నినాదాలతో అధికారంలోకి వచ్చిన బిజెపి సర్కార్ అవేమి అమలుచేయలేదన్నారు. దేశంలో ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొ డుతూ అధికారం నిలబెట్టుకుందన్నారు. సంప న్నులు మరింత సంపన్నులు అవుతుంటే పేదలు మరింత పేదలు అవుతున్నారున్నారు. రైతులను కార్మికులను పెట్టుబడి దారులకు కట్టు బానిస లుగా మార్చే చట్టాలు తెచ్చారన్నారు. వీటి రద్దు కొరకు సిపిఐ నిరంరతం పోరాడుతుందన్నారు. ఈకార్యక్రమంలో సిపిఐ నాయకులు గంగిరాజు. నర్సింలు, రాములు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం ప్రచారం

**ప్రజాపక్షం/మెట్ పల్లి :** జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో ఉప్ప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు కోసం, శనివారం హుజురా బాద్ నియోజకవర్గం ఇంచార్జ్ బడితెల ప్రణవ్ బాబు, కోరుట్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మహమ్మద్ షకీర్ సిద్ధికి, వారు కలిసి శ్రీనగర్ కాలనీ, ఇంజనీర్స్ కాలనీలలో ఇంటింటికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ కు గెలిపించాలని ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూబ్లీహిల్స్ నియోజకవర్గం గత 10 సంవత్సరాల నుండి ఎలాంటి అభివృద్ధి జరగలేదని ఈ ఉప ఎన్నికల్లో నవీన్ యాదవ ను భారీ మెజర్టీతో గెలిపించి, నియోజకవర్గం అభివృద్ధి దశలో ముందు అడుగు వేయా లని ఈ ప్రచార సందర్భంగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు యోగేష్ పటేల్, దుర్గేష్ , గౌస్ బేగ్, ఆజమ్ అలీ, తదితరులు పాల్గోన్నారు.

## నిజాంసాగర్‌లోకి 9,570 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



ప్రజాపక్షం/నిజాంసాగర్:నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 9570 క్యూసెక్కుల నీరు ఇన్ ఫ్లోగా వస్తుందని ప్రాజెక్టు ఎఇలు శనివారం ఒక సంయుక్త ప్రకటన ద్వారా తెలిపారు. వస్తున్న నీటిని అదే మోతాదులో 9,570 క్యూసెక్కుల నీరు మంజీరాలోకి రెండు గేట్ల ద్వారా వదిలిపెడుతున్నట్లు చెప్పారు. నిజాంసాగర్ ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 14 05 00 అడుగులు, పూర్తి నీటి సామర్థ్యం 17.802 టిఎంసిలకుగాను పూర్తిస్థాయి నీటినిల్వ లు నిలకడగా ఉంచుతూ ఎగువ నుండి వస్తున్న నీటిని మంజీరాలోకి వదలుతున్నట్లు పేర్కొన్నారు.

## అయ్యో పాపం రైతన్నల కష్టాలు వర్ణనాతీతం

### నీటిలోని పత్తి తీయుటకు రైతుల తంటా



ప్రజాపక్షం/రేగోడ్:మెదక్ జిల్లా అత్యధికంగా వర్షాల వల్ల రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగించాయనిరైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సర్దార్ పాటిల్ అన్నారు. రేగోడ్ మండలంలో అత్యధికంగా పత్తి పంటను సాగు చేస్తున్నారు. ఈ సారి కురిసిన అత్యధిక వర్షాలతో పత్తి పంట పాడైపోయింది. పత్తి సాగు చేసిన దిగుబడి కూడా రాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేగోడ్ మండలంలోని మర్పల్లి గ్రామ శివారులో పత్తి పంట నీటిలోనే ఉంది. నీటిలో ఉన్నపత్తి తీయుటకు రైతులనానా తంటాలు పడుతున్నారు.పంట నష్టపోయిన రైతులకుప్రభుత్వంనష్టపరిహారంచెల్లించాలని మర్పల్లి రైతు మల్లేశం అన్నారు.

## రబీకి రైతులు సిద్ధం...

ప్రజాపక్షం/నందిపేట్:నిన్న మొన్నటి వరకు తుఫాన్ ప్రభావంతో వర్షాలు పడి ఖరీఫ్‌లో పండించిన ధాన్యం కొనలేకపోవడంతో రైతుల పరిస్థితి అతలాకుతలం అయింది. ఎండల వల్ల రబీ పనులకు రైతులు ముందుకు సాగుతున్నారు. విత్తనాలు, ఎరువులు తెచ్చుకుంటున్నారు. మరో వైపు దుక్కి దున్నడం మొదలుపెట్టారు. ముందు నాట్లు వేసిన రైతులు పంట భూమిని వదును చేసుకోవడంలో బిజీ అయ్యారు. మండలంలో వరి, మొక్కజొన్న, జొన్న, సోయాబీన్, పచ్చిమిర్చి పెరిగే అవకాశాలున్నాయి.

## కంకోల్ టోల్ గేట్ వద్ద కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా రైతు ధర్నా



ప్రజాపక్షం/మునిపల్లి :మునిపల్లి మండలం కంకోల్ టోల్ గేట్ వద్ద కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా రైతు ధర్నా చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం సిసిఐ నూతన కొనుగోలు విధానాన్ని అవలంబించడంతో పత్తి రైతులకు అన్యాయం జరుగుతుందని ఈ ధర్నా నిర్వహించారు. పత్తి రైతులకు మద్దతుగా అధికార ,ప్రతిపక్ష పార్టీలు నిలిచాయి. సిసిఐ నూతన విధానాన్ని రద్దు చేసి పాత పద్ధతిలోనే కొనుగోలు విధానాన్ని నిర్వహించాలంటూ డిమాండ్ చేశారు. కపాస్‌కిసాన్ యాప్ తో రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న కేంద్ర ప్రభుత్వం ఎల్1,2 కేటగిరీ నిబంధనలను తొలగించి పత్తి రైతులను ఆదుకోవాలని భారీ ఎత్తున రైతు ధర్నా నిర్వహించారు. ధర్నా కారణంగా సుమారు రెండు గంటల పాటు భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది.

## భవననిర్మాణ కార్మికులకు సంక్షేమ చట్టం తీసుకురావాలి

### ఎఐటియుసి జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి చిరంజీవి



ప్రజాపక్షం/సంగారెడ్డి :భవన నిర్మాణ కార్మికులకు హమాలి ,ఆటో కార్మికులకు సంక్షేమ చట్టం తీసుకురావాలని ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి చిరంజీవి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు సంక్షేమ చట్టాలు తీసుకురావాలని పనులు చేస్తూ అనేక మంది మరణిస్తున్న వారి కుటుంబానికి ఆదుకోవాలన్నారు. లేబర్ కార్డుకు సంబంధించి పెండింగ్ ఫైలు క్లియర్ చేయాలన్నారు.పనిచేస్తున్న కార్మికులకు వెంటనే ప్రభుత్వం గుర్తింపు కార్డు ఇవ్వాలని , ఉచితంగా లేబర్ కార్డు అందే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింలు, సాయిలు ,లక్ష్మణ్ ,యాకూబ్, ఫెూష, పాల్గొన్నారు.

## నాణ్యమైన చేప పిల్లలు పంపిణీ



ప్రజాపక్షం/దండేపల్లి :తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మత్స్యశాఖ ఆధ్వర్యంలో దండేపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం ఉచిత చేప పిల్లలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 3540 మిల్లీమీటర్ల పరిమాణం గల మూడు లక్షల నలభై రెండు వేల నాణ్యమైన చేప పిల్లలను దండేపల్లి, రెబ్బనపల్లి, కన్నెపల్లి, తాళ్లపేట మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలకు అందించారు. కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి నాగరాణి త్రిమూర్తి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు అక్కల వెంకటేశ్వర్లు, దండేపల్లి తాళ్లపేట మాజీ సర్పంచులు చంద్రకళ, లింగారావు, మత్స్యశాఖ ఫిషరీస్ అసిస్టెంట్ శ్రవణ్ కుమార్, నీల, రాజేష్, కన్నెపల్లి, రెబ్బనపెల్లి, తాళ్ళపేట పంచాయతీ కార్యదర్శులు సత్యనారాయణ, గంగారం, సత్తయ్య, వ్యవసాయ విస్తరణాధికారి మౌనిక పాల్గొన్నారు.

## ఇండ్ల నిర్మాణాలకు అనధికార కలప వాడొద్దు: ఎఫ్ఆర్‌ఒ



ప్రజాపక్షం/జన్నారం :ఇండ్ల నిర్మాణాలకు అనధికార కలపను వాడకూడదని కవ్వాల టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ రేంజ్ అధికారి లక్ష్మీనారాయణ తెలిపారు. కలపకు బదులుగా యుపివిసి లాంటి రెడిమేడ్ తలుపులు, ధర్వాజలు వాడుకోవాలని ఆయన సూచించారు. కవ్వాల టైగర్ రిజర్వ్ ఇందన్‌పల్లి రేంజ్ పరిధిలోని లోత్‌రె గ్రామంలో శుక్రవారం రాత్రి ఇందన్‌పల్లి, జన్నారం రేంజ్ సిబ్బంది సంయుక్తంగా దాడులు నిర్వహించి అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు రూ. 1,00,000 లు విలువ చేసే 24 దుంగలను పట్టుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఎఫ్ఆర్‌ఒ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అనధికారకర్ర వినియోగం నేరం అని, ఇంటి నిర్మాణానికి అనుమతులు లేని టేని కర్ర వినియోగించరాదని అన్నారు. పట్టుబడిన కలపపై విచారణ చేపట్టి త్వరలోనే నేరస్తులను పట్టుకుంటామని అన్నారు. ఈ దాడుల్లో జన్నారం ఎఫ్ఆర్‌ఒ మమత, డిఆర్‌ఒ విజయ్, ఎఫ్ఎస్‌ఒలు హన్మంతరావు, శివకుమార్, పురుషోత్తం, భోజ నాయక్, ఎఫ్‌బిఒలు పోచయ్య, తణ్వీర్, అమృత్ రావు, బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నా రు

# కలెక్టర్‌గారూ.. ఈ రోడ్డును పట్టించుకోరూ!

ప్రజాపక్షం/నందిపేట్:కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన పథకం కింద పల్లె పల్లెను కలుపుతు తారు రోడ్లు వేయిస్తుంది. ఇందుకోసం లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తుంది. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల రోడ్డు వేసిన కొన్నాళ్లకే తారు లేచిపోయి కంకర కనిపిస్తు గుంతల మయం అయింది. దీనికి తాజా ఉదాహరణ అయిలాపూర్ గ్రామం నుండి కంఠం సబ్ స్టేషన్ వరకు వేసిన రోడ్డు నిదర్శనం. కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన పథకంలో భాగంగా రైతు ఫారం నుండి కంఠం సబ్ స్టేషన్ వరకు 4.76 కిలోమీటర్ల దూరం తారు రోడ్డు వేయడానికి 278.85 లక్షలు మంజూరు చేసింది. ఈ పనులను నిజామాబాద్‌లోని ఒక్క కన్‌స్ట్రక్షన్ వారు దక్కించుకున్నారు. ఈ పనులు సంవత్సర క్రితం చేపట్టారు. పంట పొలాల మధ్య ఈ రోడ్డు వేయడం వల్ల పనులు నాసిరకంగా సాగాయి. కంకర చిప్స్ వేసి సరిగా నీళ్ళు పట్టించకపోవడంతో ఆరునెలలకే వేసిన కంకర తేలడం గుంతలు పడ్డాయి. ఇదిలా ఉంటే రోడ్డుకు ఇరువైపులా సైడ్ బండ్ మట్టి సరిగా పోయకపోవడంతో ఈ ఖరీఫ్‌లో కురిసిన వర్షాలకు కొట్టుకపోయి రోడ్డు మలుపు వద్ద ప్రమాదకరంగా తయారయింది. రాత్రి సమయాలలో పొలాలకు వెళ్లే రైతులు, కంఠం గ్రామానికి వెళ్ళే వాహన చోదకులు కయ్యలో పడి ప్రమాదాలు తెచ్చుకుంటున్నారు. ఈ విషయంలో గ్రామీణాభివృద్ధి శాఖ పట్టించుకోవడం లేదు. గత సంవత్సరం గుంతలు నామ్‌కే వాస్తేగా మరమ్మతు చేసి వదిలేశారు. ఎందుకంటే ఈ రోడ్డు మెయింటెనెన్సు అయిదు సంవత్సరాల వరకు చేయాల్సి ఉంది. కానీ అలా జరగడం లేదు. అదే రైతు ఫారం నుండి అయిలాపూర్ గ్రామం వరకు వేసిన రోడ్డు ఒక్కసారి కూడా మరమ్మతు కాకుండా బాగా ఉంది. కంఠం రోడ్డు విషయంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల చెడిపోతుంది. ఈ విషయంలో జిల్లా కలెక్టర్ స్పందించి వెంటనే నాణ్యమైన రోడ్డు వేయిస్తు సైడ్ బండ్ పోయించాలని రైతులు కోరుతున్నారు.







## కొల్లూరు సమస్యలు అసెంబ్లీలో ప్రస్తావిస్తా

### ముఖ్య అతిథిగా మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు



ప్రజాపక్షం/ పటాన్‌చెరు :పటాన్ చెరు నియోజకవర్గం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిదిలోని కొల్లూరు కెసిఆర్ నగర్ డబుల్ బెడ్ రూమ్‌వద్దపటాన్‌చెరు నియోజకవర్గం బిఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జీ ఆదర్శ్ రెడ్డి, తెల్లాపూర్ మాజీ సర్పంచ్ సోమిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు మాట్లాడుతూకెసిఆర్ ప్రభుత్వ కాలంలో కొల్లూరు ప్రాంతానికి ఇప్పటికి 5 ఎకరాలు స్మశాన వాటికకు ,1.5 ఎకరాలు పాఠశాలకు, 1.5 ఎకరాలు , ఆసుపత్రికి 10 గుంటలు, అగ్ని మాపక కేంద్రానికి కేటాయించామని తెలిపారు. ఇప్పుడు జుబ్లీహిల్స్ ఉప ఎన్నికల కారణంగా మాత్రమే రేషన్ షాపులు,పాఠశాలలు ,ఇతర అభివృద్ధి పనులు ప్రకటిస్తున్నారని తెలిపారు. ఎన్నో సార్లు ప్రతినిధులు ద్వారా విజ్ఞప్తులు చేసినా స్పందించడలేదన్నారు. నేను అసెంబ్లీలో మీ సమస్యలపై మాట్లాడుతాను అని భరోసా ఇచ్చారు. కొల్లూరు వంటి ఖరీదైన ప్రాంతంలో ఉచితంగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కేటాయించినదని, ఒక్క కెసిఆర్ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. జుబ్లీ హిల్స్ నియోజకవర్గ ఓటర్లను ఉద్దేశించి బ్యాలెట్ పేపర్‌లో 3వ సీరియల్ నంబర్‌లో కారు గుర్తుపై మాగంటి సునీత ఫోటో పక్కన ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. బిఆర్ ఎస్ పార్టీ గెలిస్తేనే కొల్లూరు వంటి ప్రాంత సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు మాజీ జెడ్‌పిటిసి శ్రీకాంత్ గౌడ్, రామచంద్రాపురం , మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, జిన్నారం , మాజీ జెడ్‌పిటిసిబాల్‌రెడ్డి, తెల్లాపూర్ మాజీ వైస్ చైర్మన్ రాములు గౌడ్, తెల్లాపూర్ మున్సిపాలిటీ ప్రెసిడెంట్ దేవందర్ , యాదవ్, మాజీ కౌన్సిలర్లు బిఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ,ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## బాల కార్మిక చట్టాన్ని తుంగలో తొక్కుతున్న పరిశ్రమ యజమానులు



ప్రజాపక్షం/గుమ్మడిదల: పాఠశాలకు వెళ్లి చదవాల్సిన బాల్యం వయస్సు లో పరిశ్రమకు వెళ్లి కూలి పని చేస్తున్నారు. కాంట్రాక్టర్లు వారి స్వలాభం కోసము మొన్న టి వరకు పాఠశాలకు వెళ్లి విద్యను అభ్యసిస్తున్న మైనర్ బాలికలతో పరిశ్రమలో పనిచేయిస్తున్న వైనం గుమ్మడిదల మున్సిపాలిటీ బొంతపల్లి వార్డు కెమి ప్యాక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో కనిపిస్తుంది. బాలల హక్కుల చట్టం 1 8 సంవత్సరాలు నిండని వారిని ఎటువంటి పరశ్రమలో కూలీలుగా పనిచేయరాదని చెప్పినప్పటికి విద్యను అభ్యసించే వయస్సులో పరిశ్రమ యజమానులు ,కాంట్రాక్టర్లు వారి స్వలాభాల కోసం మైనర్ బాలికలతో పని చేస్తూ వారి శ్రమను దోచుకుంటున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే మైనర్ బాలికల తో ఎటువంటి పనులు చేయించడం లేదని వారి వి ద్యాభ్యాసాన్ని కొనసాగించడానికి మేము కారణ మా అన్నట్టుగా పరిశ్రమ యజమానులు సమాధా నం ఇస్తున్నారు. ఇప్పటికైనా బాల కార్మిక వ్యవస్థ ను నిరోధించడానికి చైల్డ్ లేబర్ , అధికారులు ,బాల కార్మికులను గుర్తించి అట్టి పని చేపిస్తున్న యా జమానులపై ,కాంట్రాక్టర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలనిగ్రామప్రజలుడిమాండ్ చేస్తున్నా రు.

## పత్తి రైతుల జాతీయ రహదారి 44 దిగ్బంధం..



### ఒక గంట పాటు స్తంభించిన ట్రాఫిక్

ప్రజాపక్షం/నేరడిగొండ :అసలే ఆదివాసుల జిల్లా ఈ జిల్లాలో పండించే వాణిజ్య ప్రధాన పంట అయిన పత్తి పంటను కొనుగోలు చేయడంలో సిసిఐ అధికారులు తేమశాతాన్ని ఎనిమిది నుంచి 12 శాతం వరకే కొనుగోలు చేయడానికి నిబంధన. దానికి తోడు ఎకరానికి ఏడు క్వింటాళ్ల పరిమితి మేరకే కొనుగోలు నిబంధన విధించడంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రైతులు భారీ వర్షాలకు నదీ పరీవాహక ప్రాంత భూముల్లో పంట నష్టం జరగడంతో అన్నదాతలు అగమ్య గోచరంలో బ్రతుకు వెళ్ళదీస్తున్న సం దర్భంలో అటు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలని ఎకరానికి 20,000 నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చే స్తూ ఫసల్ బీమా పక్రియను తెలంగాణ వ్యాప్తంగా నిరంతరాయంగా కొనసాగించేందుకు ప్రణాళికలు రూపొందించుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం బోత్ నేరడిగొండ మండలాలకు చెందిన ఆయా గ్రామాల రైతులు దాదాపు 500 మంది వరకు నేరడిగొండ మండలంలోని 44 జాతీయ రహదారిపై పెద్ద ఎత్తున రాస్తారోకో కార్యక్రమం నిర్వహించారు. దీనివల్ల అటు ఇటు వైపుల ఒక కిలో మీటర్ మేరా జాతీ య రహదారిపై వాహనాలు నిలిచిపోయి ఒక గంట పాటు ప్రయాణీకులు అవస్థలు పడ్డ సందర్భం. దీం తో స్థానిక ఎస్ఐ రెవెన్యూ డిపార్ట్మెంట్ వారు రైతులను సముదాయించి పౌర సమాజానికి సహకరించాలని కోరారు .అయినా రైతులు వినకుండా రైతుల సమస్యలు పరిష్కరించడానికి కలెక్టర్ రావాలని పెద్ద ఎత్తున నినాదాలతో ఒక గంట పాటు దీక్షను చేపట్టా రు.పరిస్థితి అదుపు తప్పుతున్న సందర్భంలో మండలంలోని ఉన్నతాధికారులు జిల్లా డిప్యూటీ కలెక్టర్ శ్యామల దేవిని ఫోన్లో సంప్రదించగా ఆమె రైతులతో మాట్లాడుతూ వీలైనంత త్వరలో మీ సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తామనడంతో రైతులు శాంతించి ధర్నాను జినింగ్ ఫ్యాక్టరీలో సిసిఐ అధికారులతో వాగ్వాదానికి దిగారు.మరికొంతమంది పట్టుబట్టడంతో ఇతర జిల్లా అధికారులతో మాట్లాడించారు.ఈ సమస్యను జిల్లా ప్రత్యేక పరిస్థితులను దృష్టిలోఉంచుకొని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని తెలియపరిచారు.ఒకవేళ సమస్య పరిష్కరం కాకపోతే దశలవారీగా ప్రజాస్వామ్యయుత ఆందోళనలకు సి ద్ధమవుతామని రైతులు తెలియపరిచారు.ఈ కార్యక్రమంలో పెద్ద మొత్తంలో రైతులకు సంఘీభావంగా పాల్గొని మద్దతు తెలిపారు.ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ ఇమ్రాన్ ఖాన్ బం దోబస్తును పర్యవేక్షించారు.

## పాఠశాలల తనిఖీ డ్యూటీలు ఉపాధ్యాయులకు వేయొద్దు

### టిఎస్ యుటిఎఫ్ మండల అధ్యక్షుడు కొయ్యడ సాయి




ప్రజాపక్షం/పెంచికలపేట్:ఉపాధ్యాయులకు పాఠశాలల తనిఖీ డ్యూటీలు వేయవద్దని తెలంగాణ స్టేట్ యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ మండల అధ్యక్షుడు కొయ్యడ సాయి, ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. శనివారం ఏర్పాటు చేసిన అత్యవసర సమావేశంలో వారు మాట్లాడుతూ పాఠశాలల పర్యవేక్షణ కోసం ఇప్పటికే మండలంలో మండల విద్యాధికారి, కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లు, అదే విధంగా మండల నోడల్ ఆఫీసర్లు ఉన్నారని, ఇతర జిల్లా అధికారులు కూడా ఉన్నారని, అయినప్పటికీ పర్యవేక్షణ నిమిత్తమై ఉపాధ్యాయులను ప్రైమరీ స్కూల్స్, హై స్కూల్స్, అప్పర్ ప్రైమరీ స్కూల్స్ లెవల్లో తనిఖీ చేయడానికి కొన్ని టీములు వేయడం కోసం ఉత్తర్వులు రావడం సరైన విధానం కాదని అన్నారు. దీని ద్వారా ఉపాధ్యాయులు బడికి దూరమై బోధనేతర పనుల్లో నిమగ్నం కావడంతో ఆయా సబ్జెక్టులపై ప్రభావం పడి విద్యార్థులకు అన్యాయం జరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైమరీ స్కూళ్లలో ఉపాధ్యాయుల కొరత తీర్చకుండా పైగా డిప్యూటేషన్లు చేయడంతో విద్యార్థులకు బోధనపై అన్యాయం జరుగుతుందని, ఉపాధ్యాయులకు బోధనేతర పనులు ఏవి కేటాయించకుండా బోధన సమయాన్ని సద్వినియోగం చేసుకునేలా ఉంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. గురుకుల, ఆశ్రమ, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయ పాఠశాలలలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్స్, గెస్ట్, పార్ట్ టైం, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ మినిమం టైమ్స్ స్కేల్ వర్తింప చేయాలని, ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు సాయికుమార్, ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్, కోశాధికారి మల్లన్న, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరాంపూర్ సిఐ వేణుచందర్‌పై 'సస్పెన్షన్' వేటు



ప్రజాపక్షం/నస్పూర్:మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం ఇందారం రైస్ మిల్లులో వెలుగులోకి వచ్చిన భారీ అక్రమాల నేపథ్యంలో శ్రీరాంపూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వేణుచందర్‌పై అధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. ఇందారం రైస్ మిల్లులో వేలాది క్వింటాళ్ల ధాన్యం సిఎంఆర్ చేసినట్లు తప్పుడు రికార్డులు చూపించారు. నిజానికి మహారాష్ట్ర నుంచి తెచ్చిన ధాన్యాన్ని స్థానిక రైతుల పేర్లపై చూపించి కోట్లాది రూపాయల ప్రభుత్వ నిధులను వ్యక్తిగత ఖాతాలకు మళ్లించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపగా విజిలెన్స్ శాఖ సుదీర్ఘ విచారణ జరిపింది. విచారణలో రూ.1.39 కోట్ల అవినీతి బయటపడిన నేపథ్యంలో పౌరసరఫరాల శాఖ అధికారులు జైపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రైస్ మిల్లర్‌తో పాటు మండల వ్యవసాయ అధికారి, మండల వ్యవసాయ విస్తరణ అధికారి, డిసిఎంఎ స్ సెంటర్ నిర్వాహకులు, ఎనిమిది మంది రైతులపై కేసులు నమోదు చేశారు. ఇదే వ్యవహారంలో డీలర్ శ్రీనివాస్, ఆయన కుమారుడిని రక్షించేందుకు సిఐ వేణుచందర్ ప్రయత్నాలు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ అంశాన్ని ఉన్నతాధికారులు గంభీరంగా పరిగణించి ఆయనపై సస్పెన్షన్ చర్యలు తీసుకున్నారని విశ్వసనీయ వర్గాల సమాచారం.

## అధికారుల అలసత్వం,ఉపాధ్యాయుల నిర్లక్ష్యం !

### నర్సాపూర్‌లో మరో ప్రాణం బలి..



ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :విద్యార్థులకు భద్రత కల్పించడంలో ఉపాధ్యాయుల నిర్లక్ష్యం,అధికారుల అలసత్వం కారణంగా నిండు ప్రాణాలు బలి అవుతున్నాయి.మామడ మండలంలోని కోటికల్ గ్రామంలో గతంలో జరిగిన సంఘటన మరిచిపోయే లోపే,తాజాగా,మరో పాప మృతి చెందడం స్థానికంగా విషాదాన్ని,ఆగ్రహాన్ని నింపింది . విరాళాలు సేకరించే విధానంలో ప్రధాన ఉపాధ్యాయులు చూపే చొరవ ప్రమాద నివారణలో కొరవడింది.అలాగే,ఉపాధ్యాయుల మధ్య నిరంతరం కొనసాగుతున్న గొడవలు,ఒకరిపై ఒకరు కంప్లైంట్ చేసుకోవడం వంటి కారణాల వల్ల ఏర్పడిన సమన్వయ లోపం అత్యవసర సమయాల్లో అమాయకులను బలి చేస్తోంది.నిబంధనల ప్రకారం చిన్న పిల్లలను వంటగదిలోకి అనుమతించకూడదు,కానీ నర్సాపూర్ కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఈ నిబంధనలను ఏమాత్రం పట్టించుకోకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తుంది.ప్రమాదం జరిగిన వెంటనే ఉపాధ్యాయులు నేను సెలవు నేను లేను అంటూ బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు.నిబంధనల కట్టుదిట్టంలో అధికారులు విఫలమవుతుండగా,కేసులు నమోదు చేసి విచారణ చేపట్టి ఆ తర్వాత వాటిని విస్మరించడం పరిపాటిగా మారింది.భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు ,ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**నిర్వహణ లోపాలపై తీవ్ర విమర్శలు,విద్యార్థి భద్రతకు అందని హామీ..**

నిబంధనల ఉల్లంఘన,సమన్వయ లోపాల వెనుక పాఠశాలల నిర్వహణపై పర్యవేక్షణ కొరవడడమే ప్రధాన కారణంగా తెలుస్తోంది.కస్తూర్బా గాంధీ పాఠశాలల వంటి వసతి గృహాలున్న విద్యాసంస్థల్లో విద్యార్థుల భద్రతకు సంబంధించి త్రైమాసిక తనిఖీలు తప్పనిసరి,అయితే,ఈ తనిఖీలను నామమాత్రంగా నిర్వహిస్తున్నారన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.ముఖ్యంగా,ఉపాధ్యాయుల మధ్య అంతర్గత విభేదాలు,ఒకరిపై ఒకరు ఆధిపత్యం చెలాయించుకునే ప్రయత్నాలు విద్యార్థుల రక్షణకు ఆటంకంగా మారాయి.వృత్తిపరమైన బాధ్యతలను విస్మరించి వ్యక్తిగత అంశాలకు ప్రాధాన్యత ఇవ్వడం వల్లనే అమాయక విద్యార్థులు నిర్లక్ష్యానికి గురవుతున్నారు.ప్రమాదం జరిగిన వెంటనే బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్న ఉపాధ్యాయులపై వెంటనే సస్పెన్షన్ వే టు వేయాలని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలి

### సిర్పూర్ శాసన సభ్యుడు పాల్వాయి హరీష్ బాబు



ప్రజాపక్షం/కాగజ్ నగర్ :సిర్పూర్ శాసన సభ్యులు డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు సాగు నీటి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలిసి నియోజకవర్గంలోని పలు పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలని కోరారు. డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు శనివారం హైదరాబాద్‌లోని సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నివాసంలో వారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన జగన్నాథ్ పూర్ ప్రాజెక్టు పూర్తి, పిపిరావు ప్రాజెక్టు పునరుద్ధరణ, ఖర్జి పెద్ద చెరువు పునరుద్ధరణ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీముల నిర్వహణ పనుల కోసం నిధులు కేటాయించాలని మంత్రిని అభ్యర్థించారు. అలాగే తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు డిపిఆర్ పై కూడా చర్చించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన సాగునీటి శాఖ మంత్రి త్వరలో పెండింగ్ ప్రాజెక్టుల అంశంపై సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇరిగేషన్ ఇఇ ప్రభాకర్, డిఇలు భద్రయ్య, వెంకటరమణ పాల్గొన్నారు.

## క్రీడ

# ఐదో మ్యాచ్ వర్షార్పణం..

## టీ20 సిరీస్ టీమిండియా విజేత

ఆసియా కప్ ఛాంపియన్ భారత జట్టు మరో పొట్టి సిరీస్ పట్టేసింది. ఆస్ట్రేలియాతో జరగాల్సిన చివరి టీ20 వర్షార్పణం కావడంతో 2–1తో సిరీస్ కైవసం చేసుకుంది టీమిండియా. గబ్బాలో భారత ఇన్నింగ్స్ 4.5 ఓవర్ వద్ద అంతరాయం కలిగించిన వర్షం.. ఎంతకూ తగ్గకపోవడంతో అంపైర్లు చివరకు ఆటను రద్దు చేశారు. దాంతో.. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో రెండు విజయాలు సాధించిన సూర్యకుమార్ యాదవ్ బృందం విజేతగా నిలిచింది. పొట్టి క్రికెట్‌లో తమకు తిరుగులేదని భారత జట్టు మరోసారి చాటుకుంది. ఆస్ట్రేలియా పర్యటనలో వన్డే సిరీస్ (2–1) చేజారినా.. తమకు కొట్టినపిండి అయిన టీ20ల్లో కంగారూ టీమ్‌కు షాకిచ్చింది టీమిండియా. తొలి మ్యాచ్ వర్షార్పణం కాగా.. రెండో టీ20లో ఆతిథ్య జట్టు గెలిచి సిరీస్ ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే.. కాంబినేషన్‌లో మార్పులు చేసుకున్న టీమిండియా.. వరుసగా రెండు మ్యాచుల్లో కంగారూలకు చెక్ పెట్టింది. పేసర్ అర్ష్‌దీప్ సింగ్, ఓపెనర్ అభిషేక్ శర్మలు మెరవడంతో




మూడో మ్యాచ్‌లో.. ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ గొప్పగా రాణించడంతో నాలుగో టీ20లో మార్ష్ సేనను మట్టికరిపించింది. నిర్ణయాత్మకమైన ఐదో మ్యాచ్ వర్షార్పణం కావడంతో 2–1తో ఆధిక్యంలో ఉన్న టీమిండియాను విజేతగా ప్రకటించారు.

### 4.5వ ఓవర్లో

నాలుగో టీ20లో భారీ విజయంతో సిరీస్‌లో ముందంజ వేసిన భారత్.. ఐదో మ్యాచ్‌లోనూ ఇన్నింగ్స్‌ను దూకుడుగా ఆరంభించింది. ఓపెనర్లు అభిషేక్ శర్మ(23 నాటౌట్), శుభ్‌మన్ గిల్(29 నాటౌట్)లు బౌండరీలతో విరుచుకుపడి శుభారంభమిచ్చారు. అయితే.. 4.5వ ఓవర్లో భారీగా ఉరుములు, మెరుపులు కారణంగా మ్యాచ్‌ను నిలిపివేశారు అంపైర్లు. ఆ కాసేపటికే వర్షం పడడంతో పిచ్‌ను సిబ్బంది కవర్లతో కప్పేశారు. కొద్ది సేపటికి తగ్గినట్టే తగ్గిన వాన మళ్లీ జోరందుకోవడంతో మ్యాచ్ నిర్వహణపై సందేహాలు నెలకొన్నాయి. సిరీస్ ఆసాంతం అద్భుతంగా ఆడిన అభిషేక్ శర్మ 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా ఎంపికయ్యాడు. గత మూడేళ్లలో ఆసీస్ సొంతగడ్డపై టీ20 సిరీస్ కోల్పోవడం ఇది నాలుగోసారి. మూడు పర్యాయాలు టీమిండియా చేతిలోనూ ఆ జట్టుకు పరాభవం ఎదురవ్వడం గమనార్హం.

# ఆసియా కప్ వివాదం ముగిసినట్టే..

## పరిష్కారానికి ప్రత్యేక కమిటీని వేసిన ఐసిసి!

భారత్–పాకిస్తాన్ మధ్య తలెత్తిన ఆసియా కప్ వివాదాన్ని పరిష్కరించేందుకు ఐసీసీ ఓ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి



ఒమన్ క్రికెట్ బోర్డు చైర్మన్ పంకజ్ ఖిమ్జీ నేతృత్వం వహించనున్నారు. గతంలో పలు వివాదాల సమయంలో ఆయన మధ్యవర్తిత్వం వహించారు. ఓ నివేదిక ప్రకారం.. ఐసిసి బోర్డు సమావేశంలో బిసిసిఐ ఆసియా కప్ ట్రోఫీ వివాదాన్ని లేవనెత్తింది. దాంతో ఐసీసీ ఈ వ్యవహారంలో జోక్యం చేసుకొని కమిటీని ఏర్పాటు చేసింది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో జరిగిన ఆసియా కప్‌లో పాక్‌పై భారత్ విజేతగా నిలిచింది. అయితే, పిసిబి, ఎసిసి చైర్మన్‌గా ఉన్న మొహ్సిన్ నఖ్వీ ట్రోఫీని ప్రదానం చేసేందుకు వేదికపైకి రాగా.. టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ట్రోఫీ తీసుకునేందుకు నిరాకరించాడు. నఖ్వీ పాక్ హోం మంత్రిగా కొనసాగుతుండడంతో ట్రోఫీని అందుకునేది లేదని స్పష్టం చేశాడు. భారత్‌లో ఉగ్రవాదానికి మద్దతు ఇవ్వడంలో ఆయన పాత్రపై అభ్యంతరాలు వ్యక్తం ట్రోఫీని అందుకునేందుకు సూర్య నిరాకరించినట్లు నివేదికలు తెలిపాయి. ఏసీసీ అధ్యక్షుడిగా ట్రోఫీని ప్రదానం చేసే అధికారం తనకు మాత్రమే ఉందని నఖ్వీ స్పందించగా.. ఆ తర్వాత ట్రోఫీ లేకుండానే టీమిండియా సంబురాలు చేసుకుంది. దాంతో నొచ్చుకున్న నఖ్వీ ఆసియా కప్, మెడల్స్‌ను తీసుకెళ్లిపోయారు. ఐసిసి బోర్డు సమావేశంలో బిసిసిఐ ఈ అంశాన్ని లేవనెత్తింది. సమావేశంలో వాతావరణం స్నేహపూర్వకంగా ఉండగా.. ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, దక్షిణాఫ్రికా వంటి బోర్డులు రెండుదేశాలను శాంతింప చేసేందుకు ప్రయత్నించాయి. ట్రోఫీని వివాదాన్ని పరిష్కరించేందుకు ముగ్గురు సభ్యులతో కమిటీని వేసేందుకు అంగీకరించినట్లుగా సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ సమావేశానికి పిసిబి చైర్మన్ నఖ్వీ సైతం హాజరయ్యారు. భారత్, పాక్ రెండు క్రికెట్ ప్రపంచంలో కీలకమైన సభ్యదేశాలని.. విభేదాలను పరిష్కరించేందుకు ఐసిసి బోర్డు అంగీకరించదని మీడియా నివేదికలు తెలిపాయి. పాక్ సెనేట్ కీలక సమావేశం వాయిదా పడినందున.. నఖ్వీ చివరి నిమిషంలో దుబాయిలో జరిగిన సమావేశానికి హాజరయ్యారు. ట్రోఫీ వివాదాన్ని పరిష్కార బాధ్యతలను ఒమన్ క్రికెట్ బోర్డు చైర్మన్ ఖిమ్జీపై ఉండగా.. రెండుదేశాల బోర్డులతో ఆయనకు సత్సంబంధాలున్నాయి. దాంతో వివాదం సమసిపోతుందని ఐసిసి భావిస్తున్నది.

## ఫోకస్ బిజినెస్

# పెరుగుతున్న ఎఐ ఉద్యోగాలు!



దేశంలో కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్/ ఎఐ)కి సంబంధించిన ఉద్యోగావకాశాలు పెరుగుతున్నాయి. ఇన్డీడ్ సంస్థ తాజాగా ప్రకటించిన నివేదికను అనుసరించి, ఎఐ ఉద్యోగాలు 8.2 శాతం నుండి 11.7 శాతానికి దూసుకెళ్ళాయి. భారతదేశంలో ఎఐ నైపుణ్యాల డిమాండ్ పెరుగున్నాయనడానికి, ఈ ఏడాది సెప్టెంబర్‌లో ఎఐసంబంధిత ఉద్యోగ ప్రకటనలు మొత్తం 11.7 శాతానికి చేరడమే నిదర్శనం. ఇతర ఇన్డీడ్ మార్కెట్లతో పోలిస్తే భారత దేశం ముందంజలోనే ఉంది. భారత్ తోపాటు, కేవలం సింగపూర్ మాత్రమే ఎఐ గురించి ప్రస్తావించిన ఉద్యోగ ప్రకటనల శాతం ఎక్కువగా ఉంది. ఇది భారత్‌లో అనేక కంపెనీలు ఎఐపై పూర్తిగా ఫోకస్ పెట్టిన వైనాన్ని రుజువు చేస్తున్నది. ఇన్డీడ్ ప్లాట్‌ఫారమ్‌లోని ఉద్యోగ ప్రకటనల డేటాపై ఆధారపడి తయారైన ఈ నివేదికలో, భారతదేశంలోని ఫార్మల్ ఆర్థిక వ్యవస్థలో నిజసమయంలో జరుగుతున్న హైరింగ్ (ఉద్యోగ నియామక) కార్యకలాపాలను రియల్ టైంలో ట్రాక్ చేస్తుంది. సెప్టెంబర్ 2025 వరకు జాబ్ ప్రకటనల ట్రెండ్స్‌ని విశ్లేషించి, వాటిని గత నెలల డేటా, గత ఏడాది అదే సమయంలో ఉన్న స్థితితో పోల్చారు. దీని ద్వారా, ఎఐ వంటి ప్రత్యేక నైపుణ్యాల కోసం భారతదేశంలో ఉద్యోగ డిమాండ్ ఎలా పెరుగుతుందో, ఏ రంగాలలో ఎక్కువ అవకాశాలు ఉంటాయో స్పష్టంగా తెలుసుకోవచ్చు. రిపోర్ట్‌లో అంశాల ప్రకారం, ఎఐసంబంధిత ఉద్యోగ అవకాశాలు మొదటగా టెక్ రంగంలో ఉంటాయి. కానీ ఇతర రంగాల్లోనూ వేగంగా విస్తరిస్తున్నాయి. డేటా అండ్ అనలిటిక్స్ రంగంలో 39 శాతం ఉద్యోగ ప్రకటనల్లో ఎఐ ప్రస్తావన ఉంది. దీని తరువాత సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ (23 శాతం), ఇన్సూరెన్స్ (18 శాతం) మరియు సైన్స్ రీసర్చ్ (17 శాతం) ఉన్నాయి. ఎఐ నైపుణ్యాల డిమాండ్ అనేక ఇంజనీరింగ్ విభాగాల్లోనూ ఉంది. ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్‌లో 17శాతం, మెకానికల్ ఇంజనీరింగ్‌లో 11 శాతం, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో 9.2 శాతం ఉద్యోగ ప్రకటనల్లో ఎఐ ప్రస్తావన ఉంది. ఇలావుంటే, ఇన్డీడ్ డేటా ప్రకారం, సెప్టెంబర్‌లో భారతదేశంలోని ఉద్యోగ ప్రకటనలు 0.8 శాతం తగ్గాయి. ఇది ఈ సంవత్సరం ఆరు నెలలుగా నెలవారీగా కొనసాగుతున్న తగ్గింపులో భాగం. రిపోర్ట్ తెలిపినట్లు, భారత ఉద్యోగ శక్తి కాస్త క్రమంగా ఫార్మల్, అధికారిక విధుల వైపు మారుతోంది. అంటే, కంపెనీలు మరింత సులభంగా ట్రాక్ చేయగల, నిబంధనలతో అనుగుణంగా పనిచేసే ఉద్యోగులను తీసుకోవడానికి ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఈ మార్పు కారణంగా, ఉద్యోగ ప్రకటనలు ఫార్మల్ రంగంలో ఎక్కువగా కనిపిస్తున్నాయి.



# ఆచితూచి ఖర్చు..

గతంలో మాదిరి విచ్చలవిడిగా ఖర్చుపెట్టడానికి 'జెన్ జెడ్'లు విముఖత చూపుతున్నారు. ల్యాప్‌టాప్‌లు, కెమెరాలు, గేమ్ కన్సోల్‌లు వంటి ఎన్నో గ్యాడ్జెట్లను కొనుగోలు చేసేకంటే, కిరాయికి తీసుకోవడమే మంచిదనే అభిప్రాయం వారిలో ఉంది. ఒక రకంగా ఇది 'స్మార్ట్ స్పెండింగ్'. అత్యవసరమైనవి మాత్రమే కొనడం, సాధ్యమైనంత ఎక్కువ గ్యాడ్జెట్లను అద్దెకు తీసుకోవడం 'జెన్ జీ'లుగా పిలిచే నేటి 'జెన్ జెడ్' తరం లాభదాయకంగా భావిస్తున్నది. మారుతున్న యువత అభిప్రాయాలను ఇప్పటికే అందిపుచ్చుకుంటున్న 'రెంట్‌కర్' వంటి ప్లాట్‌ఫామ్‌లు టివిలు, మ్యాచ్‌బుక్‌లు, కెమెరాలు, మైక్రోఫోన్లు వంటి వస్తువులను అద్దెకు అందిస్తున్నాయి. మన దేశంలో ఈ విధంగా కిరాయి గాడ్జెట్స్ మార్కెట్ 2027 నాటికి రూ. 10,000 కోట్లు దాటే అవకాశం ఉందని అంటున్నారు. ప్రస్తుతం ఈ మార్కెట్ ఏటా 35 శాతం చొప్పున అభివృద్ధి చెందుతున్నది. వినియోగదారుల్లో 60 శాతం మంది 30 లేదా అంతకంటే తక్కువ వయసు ఉన్న వారే కావడం గమనార్హం. ఈ మార్కెట్ ముంబయి, బెంగళూరు, ఢిల్లీ వంటి నగరాల్లో విస్తృతంగా పెరుగుతున్నది. జెన్‌జిలు తమ డబ్బు, వనరులను అత్యంత జాగ్రత్తగా వాడుతున్నారన్న విషయం ఈ మార్కెట్ విస్తరణ నిరూపిస్తున్నది. అవసరాలు నిత్యం మారుతునే ఉంటాయి. కొత్తకొత్త మార్పులు చోటు చేసుకుంటునే ఉంటాయి. ఉదాహరణకు ఈ రోజు వచ్చిన మాక్‌బుక్ ప్రో వర్షన్ వచ్చే ఏడాదికి ఉండకపోవచ్చు. కానీ, ఇప్పుడు సుమారు రూ. 1.5 లక్షలు ఖర్చు చేసి, వచ్చే ఏడాది కొత్తది కొనడం అసాధ్యం. అందుకే, కొనుక్కునే కంటే, కిరాయికి తీసుకోవడం మంచిదన్న నిర్ణయాన్ని స్మార్ట్ ఆలోచనగా పేర్కోవాలి. కొన్ని సందర్భాల్లో కొత్త ఉత్పత్తులు కొనడం వల్ల ఖర్చులు పెరగవచ్చు. ఉదాహరణకు పిఎస్5 కొన్న తర్వాత, సరికొత్త గేమ్స్, లెన్స్, ఫిల్టర్లు కొనాల్సి వస్తుంది. కొన్ని నెలల కాలంలోనే మరో వర్షన్ మార్కెట్‌లోకి రావచ్చు. అందుకే, జెన్‌జిలు చాలా జాగ్రత్తగా అడుగులు వేస్తున్నారు. ఆధునిక సాంకేతికత అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో, ఎప్పటికప్పుడు కొత్తకొత్త వర్షన్లు మార్కెట్‌ను ముంచెత్తడాన్ని చూస్తునే ఉన్నాం. ఇలాంటి పరిస్థితుల్లో కొనదడం కంటే కిరాయికి తీసుకోవడమే మేలన్న జెన్‌జిల ఆలోచనను అభినందించి తీరాలి.

## ఎకరానికి 12 క్వింటాళ్లు కొనాల్సిందే

### సిసిఐ కేంద్రం వద్ద సిపిఐ డిమాండ్



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** నిర్మల్ జిల్లా కేంద్రంలోని కేదారినాథ్ పత్తి మిల్లులో గల సిసిఐ(కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) కొనుగోలు కేంద్రం వద్ద సీపీఐ నాయకులు,రైతు సంఘాల ప్రతినిధులు,రైతులు కలిసి నిరసన,సందర్శన కార్యక్రమం నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి భూక్యా రమేష్ మాట్లాడుతూ,కేంద్ర ప్రభుత్వ విధానాల కారణంగా పత్తి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి షరతులు లేకుండా వెంటనే కొనుగోలు ప్రక్రియను చేపట్టాలని భూక్యా రమేష్ డిమాండ్ చేశారు. తేమశాతం నిబంధనను 12 శాతం నుండి 20 శాతం వరకు పెంచాలన్నారు. తమ డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని భూక్యా రమేష్ హెచ్చరించారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్ఎన్ రెడ్డి,రాథోడ్ విట్టల్, పుండాలిక్, మునియా నాయక్, రాథోడ్ దేవుల, గాండ్ల వెంకటి తదితర రైతు నాయకులు పాల్గొన్నారు.

## సింగరేణి కార్మికుల సమస్యలపై నిరసనగళం




**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :** సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి గుర్తింపు సంఘం ఎఐటియుసి ఆధ్వర్యంలో నాయకులు శనివారం శ్రీరాం పూర్ జనరల్ మేనేజర్ కార్యాలయాన్ని ముట్టడించారు.యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కందికట్ల వీరభద్రయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె బాజీ సైదా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం వారు జిఎం శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ యాజమాన్యం మెడికల్ బోర్డును వెంటనే ఏర్పా టు చేసి, పాత విధానంలోనే ఇన్వాల్డేషన్ నిర్వహించాలని, మెడికల్ ఫిట్ అయిన డిపెండెంట్‌లకు వెంటనే నియామక పత్రాలు అందించాలని డిమాండ్ చేశారు. బ్రాంచ్ ఉపాధ్యక్షులు కిషన్ రావు, సహాయ కార్యదర్శి కొమురయ్య, సం యుక్త కార్యదర్శి చంద్రమోహన్, జిఎం కమిటీ చర్చల ప్రతినిధులు బుచ్చయ్య, నాగభూషణం, సతీష్ ప్రసాద్ రెడ్డి, నర్సయ్య, అఫ్రోజ్ ఖాన్, ఫిట్ కార్యదర్శిలు రాజయ్య, మురళి చౌదరి, లచ్చన్న, సదానందం, సారయ్య, నర్సింగ్ రావు, లక్ష్మ ణ్, నవీన్ రెడ్డి, శ్రీకాంత్, సదానందం, సమ్మయ్య, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# 'సొంతింటి' స్కీం అమలు చేయరా?

### ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్
### సింగరేణి జిఎం కార్యాలయం ముందు ధర్నా



**ప్రజాపక్షం/భూపాలపల్లి:** సింగరేణి యాజమాన్యం కార్మికుల సొంతింటి పథకాన్ని అమలు చేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ యాజమాన్యాన్ని డిమాండ్ చేసారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సింగరేణి జిఎం కార్యాలయం ముందు ఎఐటియుసి ఆధ్వర్యంలోధర్నానిర్వహించారు.రాజ్‌కుమార్ ముఖ్య అతిథిగామాట్లాడుతూ సింగరేణిలో ఎఐటియుసి సంఘంగా గెలుపొందిన సమయం నుండి కార్మిక సమస్యల కోసం స్ట్రక్చర్ మీటింగ్‌లు ఏర్పాటు చేశామన్నారు. అనేక సమస్యలకు యాజమాన్యం అంగీకరించినా అమలుకు నోచుకోలేదని అన్నారు. కార్మికుల సొంతింటి పథకం కోల్ ఇండియా మాదిరిగా పెరిక్స్‌పై ఇన్‌కంటాక్స్ యాజమాన్యం చెల్లించాలనికోరామన్నారు. వినతిపత్రాన్ని జిఎం రాజేశ్వర్‌రెడ్డికి అందజేసారు. బ్రాంచ్ కార్యదర్శి మోటపలుకుల రమేష్,వైస్ ప్రెసిడెంట్ మాతంగి రామచందర్,బ్రాంచ్‌సహాయకార్యదర్శులు ఆసిఫ్ పాష,జి శ్రీనివాస్,బురుజపల్లిసుదాకర్‌రెడ్డి, బ్రాంచ్‌కమిటీనాయకులునూకలచంద్రమౌళి ఉన్నారు.

# ఎన్నికలు తప్ప రైతుల గోస పట్టదా!

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు ఎం.బాల్‌నర్సింహ్మా, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌పార్టీకి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై ఉన్న శ్రద్ధ గతవారం రోజులుగా అకాలవర్షాలతో చేతికివచ్చిన పంటలను నష్టపోయి తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న రైతుల గోసపట్టదా అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు ఎం.బాల్‌నర్సింహ్మా, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం బిజినేపల్లి మండలం వెల్గొండలో సిపిఐ మండలసమితి సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో విపరీతంగా పత్తి, మొక్కజొన్న, వరి ఇతర పంటలు వేసిన రైతులందరూ అకాలవర్షాల కారణంగా సర్వం కోల్పోయారని, పంటచేతికి వచ్చే సమయానికి అకాలవర్షాలురావడంతో తీవ్రమైన నష్టం రైతులకు జరుగుతుందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆదుకోవాల్సిన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన బాద్యత కలిగిన ప్రధాన ప్రతిపక్షం ఈరెండుపార్టీలు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలమత్తులో మునిగి తేలుతున్నాయని రాష్ట్రంలో రైతుల



గోస వీరికి పట్టడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. సిపిఐజిల్లాకార్యవర్గ సభ్యులు చంద్రమౌళి, మండలకార్యదర్శి కృష్ణాజి, ఈర్లభూపేష్, మం డల సహాయ కార్యదర్శి మధుగౌడ్, ఈర్లగంగాధర్, శ్రీనివాస్, రవి, శివ, పురుషోత్తం పాల్గొన్నారు.

### ప్రజలపక్షాన కమ్యూనిస్టులు

**నాగర్‌కర్నూల్ :** సామ్యవాద సిద్ధాంతాల ఆధారంగా ప్రజల సమస్యలను వీధినాటకాలు, పాటలు, నృత్యాలు ఇతర సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రజలను చైతన్యపర్చడానికి కృషిచేస్తూ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగాబావుట ఎగురవేసింది ప్రజానాట్యమండలి అని కళకోసంకాదు ప్రజల సమస్యలను పరిష్కరించడంకోసం కళ అని రాష్ట్రసిపిఐ కార్యదర్శివర్గసభ్యులు ఎం.బాల్‌నర్సింహ్మా అన్నారు. పెద్దకొత్తపల్లి మండలకేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో నాగర్‌కర్నూల్ జిల్లా ప్రజానాట్యమండలి ప్రధాన కార్యదర్శి పెబ్బేటి విజయుడు అధ్యక్షతన శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా ప్రజానాట్యమండలి కళాకారుల శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈశిక్షణ తరగతులకు ముఖ్యఅతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాల్‌నర్సింహ్మా, సిపిఐజిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. బాల్‌నర్సింహ్మా మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న మూఢనమ్మకాలను నిర్మూలించుటకు ప్రజా నాట్యమండలి కళాకారులచే, వీధినాటకాలుఆటపాటలతో ఎంతో పాత్ర పోషించిందన్నారు.నర్సింహ్మా,ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు మల్లేష్, ప్రజానాట్యమండలి జిల్లా సహాయ కార్యదర్శి బిజ్జ శ్రీనివాసులు , సిపిఐమండల కార్యదర్శి బొల్లెద్దుల శ్రీనివాసులు, పెద్దకొత్తపల్లి సిపిఐ కార్యదర్శి లక్ష్మణస్వామి, కల్వకోల్ సిపిఐకార్యదర్శిసంఘం కృష్ణ, కళాకారులు తుపాకుల వెంకటేష్, చందు, ఊశన్నగౌడ్ ఉన్నారు.

# ఫీ చెల్లింపుపై మొండివైఖరి వీడండి




**ప్రజాపక్షం/అడ్డగూడూరు :** మండల కేంద్రంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ఎఐఎస్ఎఫ్ డిమాండు చేసింది. రాష్ట్ర ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తూ అడ్డగూడూరు మండల కేంద్రంలో విద్యార్థులతో కలిసి ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బిక్షాటన చేశారు. ఎఐఎస్ఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి ఉప్పుల శాంతి కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ స్కాలర్‌షిప్ విడుదల చేయకుండా ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని ఇప్పటికైనా ఫీజు బకాయి విడుదల చేయాలని లేని పక్షంలో విద్యార్థి లోకంతో మంత్రుల నివాసాలు ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు చిప్పలపల్లి వంశీ కుమార్, బెల్లి శ్రీకాంత్, ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు తరాల మధు, సాయికుమార్, బన్నీ, సన్నీ, అఖిల్, లక్ష్మీ సాయి, ముకేష్ తదితరులు పాల్గొన్నారు.

## సమసమాజస్థాపనే ఎర్రజెండా లక్ష్యం

### సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్



**ప్రజాపక్షం / హుస్నాబాద్ :** సమసమాజ స్థాపనే ఎర్ర జెండ లక్ష్యం అని, పేదలు ఉన్నంత వరకు సిపిఐ నిరంతరం పోరాటం చేస్తుందని సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ అన్నారు. శనివారం అయన హుస్నాబాద్ పట్టణం సిపిఐ కార్యాలయంలో విలేకరులు సమావేశంలో మాట్లాడుతూ సుదీర్ఘ ఉద్యమస్ఫూర్తితో పీడిత వర్గాల ప్రజల కోసం అంతరాలు లేని సమాజం కొసం భారతకమ్యూనిస్టుపార్టీ ఉద్యమిస్తుందన్నారు. రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం తమ హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందన్నారు. ని అందుకే హైద్రాబాద్‌లో జరుగుతున్న జూబ్లీ ఎన్నికల్లో సిపిఐ సంపూర్ణ మద్దతు ప్రకటించిందని తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థి 30 వేల మెజారిటీతోగెలుస్తుందని అన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన కమిటీని జిల్లా సమితి గుర్తించదని, పార్టీ నిబందనలు పాటించని నాయకులపై క్రమశిక్షణ చర్యలు ఉంటాయని తెలిపారు. అనంతరం మూడు మండలాల సిపిఐ నాయకులతో కార్యవర్గ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సిపిఐ నాయకులు కొమ్ముల బాస్కర్, వేల్పుల శ్రీనివాస్, ఎడల వనేశ్, జేరిపోతుల జనార్ధన్, రజని, బోజ్జపురి రాజు, ముంజ గోపి, , కొయ్యడ కొంరయ్య, మొండయ్య, మాడిశెట్టి శ్రీధర్, రోళ్ల భాగ్య, ప్రసన్న, గట్టుబాబు, పిట్టల శ్రీను, లక్ష్మన్, జాగీరు బాలయ్య, లు పాల్గోన్నారు.

## ఓపెన్ మార్కెట్ల ద్వారా పత్తి కొనుగోలు చేయాలి

### సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాషు మియా




**ప్రజాపక్షం / వరంగల్ :** కపాస్ కిసాన్ యాప్ రద్దు చేసి ఓపెన్ మార్కెట్ల ద్వారా పత్తి కొనుగోలు చేయాలని సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాషు మియా అన్నారు. గీసుగొండ మండలం ధర్మారంలో సిపిఐ మండల సమావేశం ఎం.ఏ. పాషా అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా షేక్ బాషు మియా మాట్లాడుతూ డిసెంబర్ 26న ఖమ్మంలో జరగబోవు 100 సంవత్సరాల చరిత్ర గల సిపిఐ పార్టీ శత జయంతి ఉత్సవాలను జయప్రదం చేసుకోవాలని ఈ వంద సంవత్సరాల శజయంతి ఉత్సవాల ముగింపు సభలో ప్రపంచ దేశాల నుండి 40 దేశాల ప్రతినిధులు పాల్గొంటున్నారని తెలియజేస్తూ ఐదు లక్షల మంది పైచిలుకు ప్రజలతో భారీ బహిరంగ సభ ను జయప్రదం చేసుకోవాలన్నారు. రైతులను మోసం చేసే విధానంగా ఉన్న కపాస్ కిసాన్ యాప్‌ను వెంటనే రద్దు చేయాలని, రైతులు తమ పత్తిని స్వేచ్ఛగా ఓపెన్ మార్కెట్‌ల ద్వారా విక్రయించుకునే అవకాశం కల్పించాలన్నారు. ఎటువంటి కండిషన్ లేకుండా 20 శాతం తేమ ఉన్న పత్తిని కూడా కొనుగోలు చేయాలి అని డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం జరిగేందుకు స్వామినాథన్ కమిషన్ సిఫార్సు చేసిన ధరల ప్రకారం పంటలను కొనుగోలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతు సంఘ నాయకులు తోట చంద్రకళ, గన్నారపు రమేష్, గుండె బద్రి, శ్వేత, రాజేష్, భారతి, సుక్క శోభ, సుక్క మొగిలి, రాజారామ్, రత్నాకర్ రెడ్డి, కమల తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం

REGIONAL NEWS

వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## దళారులను నమ్మి మోసపోవద్దు

ఎసిపి హనుమకొండ నరసింహారావు



**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్:** ఈనెల 10వ తేదీ నుండి జెఎన్ఎస్ స్టేడియంలో అగ్ని వీర్ ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీ జరుగుతున్న సందర్భంగా రాష్ట్ర నలు మూలల నుండి వస్తున్న అభ్యర్థుల ఉద్దేశించి పలు సూచనలు ఎసిపి నరసింహారావు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఎసిపి మాట్లాడుతూ ఇట్టి ఉద్యోగాల ఎంపిక ఆర్మీ రిక్రూట్మెంట్ సికింద్రాబాద్ వారి ఆధ్వర్యంలో చాలా పారదర్శకంగా జరుగుతుందని, ఉద్యోగం ఇప్పిస్తామని డబ్బులు తీసుకునే దళారుల మాటలు విని మోసపోవద్దు అని, అటువంటివారు ఎవరైనా మీకు తెలిస్తే వెంటనే డయల్ 100 కాల్ చేసి పోలీసు వారికి తెలియజేయాలని కోరారు. ఈ నెల తేదీ 10 తారీకు నుండి 23 వరకు ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీ జరుగుతున్న సందర్భంగా ప్రతిరోజు జెఎన్ఎస్ గ్రౌండ్‌లో వాకింగ్, ఇతర స్పోర్ట్స్ ప్రాక్టీస్ చేసే వారికి లోపలికి అనుమతి ఉండదని, కావున పోలీసు వారికి సహకరించాలని ఎసిపి కోరారు.

## అల్లుకున్న చెట్టు ఇబ్బందుల్లో ప్రజలు.. పట్టించుకోని అధికారులు



**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** మండలంలోని తీగారం నుంచి తిమ్మంపేటవరకు వెళ్లే దారిలో రోడ్డుకు ఇరువైపులా చెట్లు వ్యాపించి ఉండడం వాహదారులు ఇబ్బంది డుతున్నారు. రాకపోకల క్రమంలో వారానికి రెండు, మూడు సార్లు ప్రమాదాలు జరుగుతున్నాయి. తీగారం నుంచి తిమ్మంపేట, జఫర్‌గడ్ మోడల్ స్కూల్, కస్తూర్బా పాఠశాల, కళాశాలకు వెళ్లే విద్యార్థులు చాలా ఇబ్బంది పడుతున్నారు. ప్రమాదాల దృష్ట్యా ఆర్అండ్‌బి అధికారులు ఈ సమస్యను రోడ్డుకు ఇరువైపులా అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించి రోడ్డును సరి చేయగలరని అలాగే స్థానిక ఎమ్మెల్యే సైతం స్పందించడం లేదని తీగారం గ్రామానికి చెందిన కలకోట రజనీకాంత్ తెలిపారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్



**ప్రజాపక్షం/ధర్మసాగర్ :** హనుమకొండ జిల్లా పరిధిలోని పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్ ఎ.వెంకట్ రెడ్డి శనివారం పరిశీలించారు. ధర్మసాగర్ మండలం ఉనికి చర్ల, ఎల్కతుర్తి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను నిర్వాహకులను అదనపు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు అమ్మకానికి ధాన్యాన్ని తీసుకు వచ్చిన రైతులతో అదనపు కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఏర్పాట్లు, కొనుగోలు ప్రక్రియ సంబంధించిన వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యాన్ని వెంట వెంటనే కొనుగోలు చేయాలని నిర్వాహకులకు అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి సూచించారు.


## ధాన్యాన్ని దళారులకు విక్రయించొద్దు

తహసీల్దార్ గిరిబాబు



**ప్రజాపక్షం/ములుగు:** ధాన్యాన్ని దళారులకు విక్రయించకుండా కొనుగోలు కేంద్రాలకు తరలించి లబ్ధి పొందాలని తహసీల్దార్ గిరిబాబు అన్నారు. వర్షాకాలంలో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం గ్రామ గ్రామాన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే మండల కేంద్రంలోని గంగోత్రి గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ గిరిబాబు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ రైతుల ధాన్యాన్ని దళారులకు విక్రయించకుండా నేరుగా గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రానికి తరలించి లబ్ధి పొందాలని అన్నారు. కోసిన ధాన్యాన్ని తేమశాతం ఎక్కువ లేకుండా రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వారు ఆదేశించారు. ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వహన కొనసాగుతుందని అన్నారు. రైతులు పంట పొలాన్ని కోసిన వెంటనే ధాన్యాన్ని ఆరబెట్టి తేమశాతం లేకుండా చేసిన అనంతరమే ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని అన్నారు. నాణ్యమైన ధాన్యాన్ని తీసుకువచ్చిన రైతులకు మాత్రమే ప్రభుత్వ మద్దతు ధర వర్తిస్తుందని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రాజు, ఎస్ఐ చల్ల రాజు, ఎపిఎం ధర్మేందర్, సిసిలు బీమానాయక్, ఐలయ్య ఎఇఒ సుకుమార్, నాయకులు మిల్కురి ఐలయ్య, చీకుర్తి రమేష్ , మమత, సుకన్య, రాయనవేన శైలజ,సెంటర్ ఇన్‌చార్జి బుక్ కీపర్, శెట్టి రాజు, హమాలీలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి చేయూత



**ప్రజాపక్షం / వేలేరు :** వేలేరు మండలకేంద్రానికి చెందిన జిల్లెల్ల రాజు ఇటీవలే మృతిచెందగా వారి కుటుంబానికి నవచైతన్య యూత్ అసోసిషేయన్ కమిటీ సభ్యులు 25, కిలోల బియ్యం అందజేయడంతో పాటు రూ.3000లను అందించడం జరిగింది,అలాగే జైభీమ్ యూత్ కమిటీ సభ్యులు 50 కిలోల బియ్యం అందించగా కొయ్యడ కృష్ణ తన తండ్రి కొయ్యడ మొగిలి జ్ఞాపకార్థం 25 కిలోల బియ్యాన్ని అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నవచైతన్య యూత్ కమిటీ సభ్యులు అధ్యక్షుడు కోడూరి శ్రీకర్, ఉపాధ్యక్షుడు సోంపెల్లి ప్రేమ్‌కుమార్, ప్రధానకార్యదర్శి అక్కల ప్రశాంత్, కోశాధికారి గూడూరి పరమేష్, జైభీమ్ యూత్ కమిటీ సభ్యులు కొయ్యడ జీవన్, కోశాధికారి మోతె రాజు, శ్యాంకుమార్, జోగు రవి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ‘సలాం జనగాం’ పుస్తకావిష్కరణ

జనగామ పుట్టుకను చెప్పిన యాదన్నకు సలాం చేసిన ప్రముఖులు



**ప్రజాపక్షం / జనగామ :** జనగామకు చెందిన ప్రముఖ కవి, రచయిత, కళాకారుడు వ్రాసిన ‘సలాం జనగాం’ పుస్తకాన్ని పలువురు ప్రములు ఆవిష్కరించారు. శనివారం జనగామ పట్టణంలోని విజయ పంక్షన్‌హాల్‌లో ఆనందాచారి అధ్యక్షతన జరిగిన పుస్తక ఆవిష్కరణ కార్యక్రమానికి సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, చరిత్ర పరిశోదకులు ఆధ్యకళ మ్యూజియం సేకర్త ప్రొఫెసర్ జయధీర్ తిరుమల్ రావు, పద్మ శ్రీ డాక్టర్ ప్రసాదరావు, తెలంగాణ సాహితి కార్యదర్శి కె ఆనందాచారి, కవి, రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహిత డాక్టర్ పసునూరి రవీందర్, సామాజిక విశ్లేషకులు జి రాములు, జనగామ మాజీ ఎమ్మెల్యే సిహెచ్ రాజారెడ్డిలు ముఖ్యఅతిథిగా పాల్గొని ఆవిష్కరించారు. పాశం యాదగిరి చేతుల మీదుగా పుస్తకాన్ని ఆవిష్కరించగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు నల్లా నర్సింహులు కూతురు చింతకింది అరుణ, గబ్బెట రఘుపాల్ సతీమని భారతిలకు మొదటి ప్రతులను అందజేశారు. డాక్టర్ పసునూరి రవీందర్ పుస్తకాన్ని పరిచయం చేశారు. ఈ సందర్భంగా ప్రముఖులు పాశం యాదగిరి, తిరుమల్‌రావు, డాక్టర్ ప్రసాదరావు, పసునూరి రవీందర్‌లు మాట్లాడారు. జనగాం పుట్టుకను నేటి తరానికి, భవిష్యత్తు తరాలకు తెలిసే విధంగా పుస్తకాన్ని తీసుకొచ్చిన సాంబరాజు యాదగిరి నిజంగా సలాం చేయాలన్నారు. నేటి జనగామ ఎన్నో ఉద్యమాలకు కేంద్రమని, బొమ్మర పోతన, పాల్కూరి సోమనాథుడు, బహుజన రాజ్య స్థాపన లక్ష్యంగా పోరాటం చేసిన సర్దార్ సర్వాయి పాపన్న, దొడ్డి కొమురయ్య, సాకలి ఐలమ్మ, చుక్క సత్తయ్య లాంటి అనేక మంది జనగామకు చెందిన వారేనన్నారు. ఉద్యమాలకు పుట్టినిల్లే కాకుండా కవులు, కళాకారులు, రచయితలకు కేంద్రంగా జనగామ ఉందన్నారు. జనగామ పుట్టుక గురించి ఎవరు వ్రాయకపోయినా సాంబరాజు యాదగిరి మాత్రం భవిష్యత్తు తరాలకు తెలసే విధంగా చరిత్రను అక్షర రూపం చేయడం అభినందనీయమన్నారు. 296 పేజీలతో ఉన్న ఈ పుస్తకంలో జనగామ పుట్టుక చరిత్రలో పాటు మొదటి సినిమా థియేటర్, వాచ్ సెంటర్, ఫోటో స్టూడియో ఇలా అనే అంశాలు పుస్తకంలో ఉన్నాయన్నారు. పుస్తక రచయిత సాంబరాజు యాదగిరికి ఈ సందర్భంగా అభనందనలు తెలిపారు. పుస్తక రచయిత సాంబరాజు యాదగిరి మాట్లాడుతూ ఎంతో కష్టంతో కూడుకున్నా ఇష్టపడి వ్రాయడం జరిగిందని, సమాచార సేకరణలో పిట్టల కుమార్, నక్క సురేష్‌ల సహకరించారన్నారు. ఈ సందర్భంగా వారికి అభినందలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ భిక్షపతి, డాక్టర్ గోపాల్‌రెడ్డి, అబ్బాస్, చేవెల్లి సంపత్, మోకు కనకారెడ్డి, కోడెం కుమారస్వామితో పాటు పలువురు పాల్గొన్నారు. రచయిత సాంబరాజు యాదగిరిని పలువురు అభనందించ చాలువాలతో సత్కరించారు.

## పోరాటాలతోనే పెన్షనర్ల సమస్యలు పరిష్కారం




**ప్రజాపక్షం/ తొర్రూరు :** పోరాటాలతోనే పెన్షనర్ల సమస్యలు పరిష్కారం అవుతాయని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ తూపురాణి సీతారాం అన్నారు. డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో తెలంగాణ ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్(టిఎపిఆర్ఎ) ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. సంఘం మండల అధ్యక్షుడు పి.రాజయ్య, ప్రధాన కార్యదర్శి కె.వెంకటాచారిలతో కలిసి సీతారాం మాట్లాడుతూ అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్న పెన్షనర్లకు మెడికల్ బిల్లులు పెండింగ్‌లో ఉంచారని, హెల్త్ కార్డు ద్వారా నగదు రహిత వైద్య సదుపాయాలు అందించకపోవడం సరికాదన్నారు. మొదటి తేదిన పెన్షన్ మొత్తం అందించడం తప్ప మరే హామీని ప్రభుత్వ అమలు చేయడం లేదన్నారు. స్పెషల్ టీచర్ సర్వీస్‌కు ఇంక్రిమెంట్లు అందించి పెన్షనర్ బెనిఫిట్‌లను అమలు చేయాలన్నారు. 2024మార్చి నుంచి పెన్షనర్లకు రావాల్సిన ఐదు డిఎలు, బెనిఫిట్‌లు అందించకపోవడం దారుణమన్నారు. డిసెంబర్ 16న మహబూబాబాద్‌లో జిల్లా మహాసభ, డిసెంబర్ 29,30 తేదీల్లో రాష్ట్ర మహాసభలు జరుగుతాయని, ఈ మహాసభల్లో పెన్షనర్ల సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వీరయ్య, కోశాధికారి టి.నాగేశ్వర్, జిల్లా నాయకులు బి.నారాయణ, శంకరయ్య, కమలమ్మ, చంద్రప్రకాశ్, మనోహర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌సి హాస్టల్ నూతన భవన నిర్మాణం చేపట్టాలి

ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ల్యాదల్ల శరత్



**ప్రజాపక్షం/ వరంగల్ :** ఎస్‌సి హాస్టల్ నూతన భవన నిర్మాణం చేపట్టాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ల్యాదల్ల శరత్ అన్నారు. వరంగల్ పట్టణం శివనగర్‌లోని ఎస్‌సిహాస్టల్లో ఎఐఎస్ఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ వరంగల్ జిల్లా కార్యదర్శి శరత్ మాట్లాడుతూ సంక్షేమహాస్టళ్లు సమస్యలకు నిలయంగా ఉన్నాయని, మరుగుదొడ్లు మంచినీటి సౌకర్యం, హాస్టళ్లలో నాణ్యమైన భోజనం అందించాలన్నారు. విద్యార్థులు వారి సమస్యలు విన్నవించారు. శివనగర్‌లో ఉన్న ఎస్‌సి సంక్షేమ వసతి గృహంకు సొంత భవనం నిర్మించాలన్నారు. ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలతో పాటు ఖాళీగా ఉన్న వార్డెన్, వర్కర్లను నియమించి విద్యార్థులను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సాగర్, అఖిల్, రమేష్, ప్రశాంత్‌తోపాటు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కాలేజీ యాజమాన్యాల తాట తీస్తారా?

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వరంగల్ ఎంజిఎం హాస్పిటల్ సందర్శన



**ప్రజాపక్షం/హనుమకొండ :** కాలేజీ యాజమాన్యాల తాట, తోలు తీస్తారా? అంటూ సిఎం రేవంత్ రెడ్డిపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. తెలంగాణ విద్యార్థుల కోసం నిలబడిన వాళ్లపైన మీ వీరంగమా? అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి వీధి రౌడీలాంటి భాషను మార్చుకోవాలని సూచించారు. తెలంగాణ జాగృతి జనంబాట కార్యక్రమంలో భాగంగా హన్మకొండకు చేరుకున్న కల్వకుంట్ల కవితకు కాజీపేట ఫాతిమా నగర్ వద్ద జాగృతి నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇటీవల వర్షాలకు వరద నీరు చేరుకుని ఇబ్బందులు పడ్డ కాలనీలను సందర్శించి బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాము ఇక్కడకు రాగానే కాలేజ్ పిల్లలు తమ వద్దకు వచ్చారని, ఫీజు రీయింబర్స్ మెంట్ రాక ఇబ్బందులు పడుతున్నామని చెప్పారని, నేను ఈ విషయానికి సంబంధించి కౌన్సిల్‌లో గట్టిగా మాట్లాడితే సిఎం స్పందించారని అన్నారు. పాత బకాయిలతో పాటు ఈ ఏడాది బకాయిలు కూడా చెల్లిస్తామని చెప్పారని, కానీ మొన్న ప్రెస్ మీట్‌లో వీధి రౌడీలు కూడా సిగ్గు పడే విధంగా మాట్లాడారని అన్నారు.

### సరికొత్తగా వరంగల్ ఎంజిఎం హాస్పిటల్ నిర్మాణం

వరంగల్ ఎంజీఎం హాస్పిటల్ ను సందర్శించి రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవల గురించి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంజిఎం హాస్పిటల్‌లో వసతులు, సౌకర్యాలు ఎలా ఉన్నాయో తెలుసుకున్నామని, తెలంగాణ వచ్చాక ఈ హాస్పిటల్ సరిపోదని కొత్తది కట్టుకోవాలనుకున్నామని, వరంగల్ జైలు జాగాను తీసుకొని 20 ఫ్లోర్లతో నిర్మించతలపెట్టిన హాస్పిటల్ ఆగిపోయిందన్నారు. ఇప్పుడున్న ఎంజిఎంలో పేషెంట్ల సంఖ్య పెరగటంతో ఒత్తిడి పెరిగిందని,ప్రజాపాలన, ప్రజల వద్దకు పాలన అని అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం కనీసం మెయింటెన్స్ ఛార్జీలు కూడా ఇస్తలేదన్నారు. సూది ఉంటే దూది లేదు. దూది ఉంటే సూది లేదన్నట్లుగా ఉంది పరిస్థితి ఉందని, ఉచితంగా అందించే బేసిక్ మందులు కూడా లేవు అని, వరంగల్ జిల్లా నుంచి ఇద్దరు, ముగ్గురు మంత్రులున్న ఫలితం లేదన్నారు.

# తరుగు తీయకుండా ధాన్యం కొనుగోలు

సిపిఐ నాయకుల డిమాండ్



**ప్రజాపక్షం/హనుమకొండ :** జిల్లాలో రైతుల వద్ద ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఇష్టారీతిలో అమ్ముకొని సొమ్ముచేసుకుంటున్న రైస్ మిల్లుల యాజమాన్యంపై, వీరికి సహకరిస్తున్న ప్రభుత్వ జిల్లా అధికార యంత్రాంగంపై కఠిన చర్యలు తీసుకోవాలని భారత కమ్యూనిష్టు పార్టీ (సిపిఐ) జిల్లా కార్యవర్గ సభ్యులు ఏదునూరి వెంకట్రాజం, ఎన్ ఎ స్టాలిన్, వేల్పుల సారంగపాణి, జిల్లా సమితి సభ్యులు అలువాల రాజులు డిమాండ్ చేశారు. శనివారం హనుమకొండ మండల చుట్టు పక్కల గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సిపిఐ బృందం సందర్శించి రైతులతో మాట్లాడింది. కోతల సమయంలో పడ్డ భారీ వర్షాల వల్ల చేతికొచ్చిన పంటలు పెద్ద ఎత్తున దెబ్బతినడమే కాకుండా ధాన్యం కోతకు ఖర్చులు విపరీతంగా పెరిగినందున ప్రభుత్వం కొనుగోలు చేసే కేంద్రాల్లో తరుగు తీయకుండా కొనుగోలు చేయాలని ఈ సందర్భంగా నాయకులు ప్రభుత్వాధికారులను డిమాండ్ చేశారు. జిల్లాలో గత కొన్నేళ్ళుగా రైస్ మిల్లర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, అధికారుల అండతో రైతులను, ప్రభుత్వాన్ని మోసం చేస్తున్నారని వారు అన్నారు. విజిలెన్స్ వారికి చిక్కిన మిల్లర్ల పై, వారికి సహకరించిన అధికారులపైన నామ మాత్రపు కేసులు పెట్టి చేతులు దులుపుకోవడంతో మరొకరికి భయం లేకుండా పోతుందన్నారు. అలాగే ప్రభుత్వం వారు కొనుగోలు చేసి ఇచ్చిన ధాన్యాన్ని పైసా ఖర్చు లేకుండా సొంతానికి వాడుకొని సొమ్ము చేసుకుంటుంటే అధికార యంత్రాంగం ఏం చేస్తున్నట్టు అని ఈ సందర్భంగా వారు ప్రశ్నించారు. ధాన్యం నిలువ చేసుకున్నందుకు, మర ఆడించినందుకు డబ్బులు తీసుకోవడమే కాకుండా తవుడు, ఉనుక, నూకలు వంటి వాటితో మిల్లులు గతం కంటే బాగానే నడుస్తుండగా తరుగు పేరుతో అదనంగా దోపిడీ చేయడమే కాకుండా నిలువ ధాన్యాన్ని మర ఆడించి బియ్యం ప్రభుత్వానికి తగిన సమయంలో సరఫరా చేయకుండా ఫ్రీగా వచ్చిన ధాన్యాన్ని మిల్లర్లు అమ్ముకొని సొమ్ము చేసుకుంటుంటే ప్రభుత్వం చోద్యం చూస్తుందని ఎద్దేవా చేశారు. ఈ విషయంలో ప్రజల్ని సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టనున్నట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దొమ్మటి ప్రవీణ్ కుమార్, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సిఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు




**ప్రజాపక్షం/దేవరుప్పుల:** పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, టీపీసీసీ వైస్ చైర్మన్ హనుమాండ్ల ఝాన్సిరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నల్ల శ్రీరామ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో సిఎం రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా కేక్‌ను కట్‌చేసి మిఠాయిలు పంచుకుని కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. నాయకులు యాకస్వామి, రవి, మాజీ ఎంపీటీసీ జాకీర్, సజ్జన్ నాయక్, వెంకన్న, నాయకులు, భాస్కర్, యాకన్న, యాదన్, సోమన్న, నిఖిల్, సురేష్, నరస య్య, ప్రభాకర్, హరీష్, యాకన్న, మహేష్, చందర్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి యోగాసన ఛాంపియన్ పోటీలకు ఎంపికైన శర్వానంది



**ప్రజాపక్షం / వర్ధన్నపేట :** యోగాసనా పోటీల్లో వర్ధన్నపేట పుస్కోస్ స్కూల్ పాఠశాల విద్యార్థి జోగుల శ్రీ ర్వానంది ఎంపికైనట్లు శనివారం ఉపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా వ్యాయమ ఉపాధ్యాయుడు అన్నేపు రాజేంద్రం మాట్లాడుతూ రంగశాయిపేట ప్రభుత్వ పాఠశాలలో యోగ అసోసియేషన్ వరంగల్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి యోగాసనా ఛాంపియన్ షిష్ 2025లో జిల్లాలోని వివిధ పాఠశాలలనుడి 400 వందల మంది విద్యార్థులు పాల్గొన్నాని తెలిపారు. వరంగల్ నుండి 46 మంది విద్యార్థులు రాష్ట్ర సాయి యోగపోటీలకు ఎంపిక అయ్యారని అందులో వర్ధన్నపేట పుస్కోస్ హైస్కూల్ నుండి 10 మంది పాల్గొనగా 8 సంవత్సరాల నుండి 10 సంవత్సరాల బాలికల విభాగంలో జోగుల శ్రీశర్వానంది, బాలుర విభాగంలో నవ్విద్ పాషా, 10 సంవత్సరాలనుండి 12 సంవత్సరాల బాలుర విభాగంలో చిట్యాల రిత్విక్ ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి యోగ పోటీలకు ఎంపిక అయ్యారని తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులు అదివారం నేడు ఎస్, ఎం,పి, యూనివర్సల్ స్కూల్ రంగారెడ్డి జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. యోగ అసోసియేషన్ జిల్లా అధ్యక్షడు బొలిశెట్టి కమలాకర్, ప్రధాన కార్యదర్శి కృష్ణవేణి, ఉపాధ్యాయులను అభినందిచారు.

## ప్రభుత్వ ఆసుపత్రి రోగులకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్స్ పంపిణీ

ఘనంగా ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలు

ఏటూరునాగరం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు



**ప్రజాపక్షం/ములుగు:** శనివారం రోజున మంత్రి సీతక్క ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ సూచనల మేరకు టౌన్ అధ్యక్షుడు ఎండి సులేమాన్ అధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన సందర్భంగా కేక్ కటింగ్ చేసి బాణసంచాలు పేల్చి సంబరాలు జరుపుకోవడం జరిగింది. ఏటూరునాగారం ప్రభుత్వ ఆసుపత్రిలో పేషంట్స్‌కు బ్రేడ్స్ ప్యాకెట్స్ పంపిణి చేశారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా మండల అధ్యక్షుడు చిటమట రఘు, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఎండి అయూబ్ ఖాన్, జిల్లా ఉపాధయక్షుడు ఎండి ఖలీల్ ఖాన్, మాజీ జెడ్‌పిటిసి ఉపాధ్యక్షుడు ఎండి ఖలీల్ ఖాన్, మాజీ జెడ్‌పిటిసి నామ కరన్ చంద్ గాంధీ, పిఎసిఎస్ వైస్ చైర్మన్ చెన్నూరి బాల రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు చిటమట రఘు, టౌన్ అధ్యక్షుడు ఎండి సులేమాన్ మాట్లాడుతూ గత పదేండ్ల దొరల పాలన అవినీతి అక్రమాలను అంతముందించి ముఖ్యమంత్రిగా ఎదిగిన రేవంత్ రెడ్డిని అభినందించారు. ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమాలు ఫ్రీ బస్సు ఆరోగ్య శ్రీ ఉచిత కరెంటు 500 గ్యాస్ సిలిండర్ రెండు లక్షలొ రుణమాఫీ వరి క్వింటాకు 500 బోనస్ ఇందిరమ్మ ఇండ్లు సన్న బియ్యం కొత్త రేషన్ కార్డులు రైతు భరోసా మహిళ సంఘాలకు పెట్రోల్ బంకులు మహిళలకు ఆర్టీసి బస్సులు, ఇందిరా మహిళా కాంటీన్లు, సోలార్ విద్యుత్ యూనిట్లు, హైడ్రా ఈగల్ చెరువులు సుందరికరణ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ 30 సూపర్ స్పెషలిటి హాస్పిటల్స్ రూ.2 లక్షల కోట్లు విదేశీ పెట్టుబడులు 82 వేల ఉద్యోగ ఉపాధి కల్పన ఫ్యూచర్ సిటీ, సాగు నీరు త్రాగు నీరు గ్రామ గ్రామాన సిసి రోడ్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో అనేక రంగాల్లో అభివృద్ధి చెందుతుందని తెలంగాణ అని కొనియాడారు. ఇది కదా కాంగ్రెస్ ప్రజాపాలన సంక్షేమం అంటే జయహో కాంగ్రెస్ పార్టీ జయహో రేవంత్‌అన్న అంటూ నినాదాలు తెలుపుతూ సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షులు ఎండి అయూబ్ ఖాన్ ఉపాధ్యక్షులు ఖలీల్ ఖాన్, అధికార ప్రతినిధిముక్కెర లాలయ్య ,బాలరాజు,పోషయ్య, నర్సింగరావు, వలియాభి సలీం దొంగిరి మధుబాబు వినయ్ కుమార్ ,కర్నె అరుణ ,కర్నె సత్యం, రమేష్, కిషోర్, ప్రసాద్ ,నరేందర్ ,గంపల శివ, హనుమంత్ ,నాగరాజు, జనార్ధన్, రంజిత్ ,వేణు, కిరన్, మాధవ్ ,లక్ష్మీ కాంత బంటు ఉదయ హరికృష్ణ , మాధవ్, తిరుపతి, రతన్, తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## ఘనంగా సిఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్యాంపు కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ యువ నాయకులు తుమ్మల యుగంధర్ పాల్గొని జన్మదిన వేడుకల కేక్ కట్ చేశారు. అనంతరం సత్యసాయి వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, బ్రేడ్లు పంపిణీ చేశారు. ఏఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు కొత్తా సీతారాములు, నాగండ్ల దీపక్ చౌదరి, మిక్కిలినేని నరేంద్ర చౌదరి, నరాల నరేష్, మోహన్ నాయుడు, దీప్లానాయక్, దేవ్ సింగ్, బానాల లక్ష్మణ్, కార్పొరేటర్లు, పోతగాని రమణ, చంద్రిక, మంగ పాల్గొన్నారు.

## రాజమండ్రి శిక్షణకు 11 మంది ఎంపిక



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : రెషిడెన్షియల్ మల్టీ పర్పస్ అసిస్టెంట్ ఫర్నీచర్ ప్రొడక్షన్ అండ్ ఇన్‌స్టాలేషన్ కోర్సుపై రాజమండ్రిలో నిర్వహించే శిక్షణకు 11 మందిని ఎంపిక చేశారు. 3 నెలల శిక్షణలో భాగంగా ఈ మేరకు శనివారం ఐడిఓసిలో ఓరియంటేషన్, ఎంపిక పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ యువత శిక్షణా అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నైపుణ్యంతో ముందుకు సాగాలని సూచించారు. రాజమండ్రిలో సోమవారం ప్రారంభమయ్యే ఈ శిక్షణ కోసం మొత్తం 11 మంది అభ్యర్థులు ఎంపికయ్యారని, శిక్షణ పొందుతున్న వారి రిజిష్ట్రేషన్ ఫీజును ప్రభుత్వం భరిస్తుందని, వసతి, భోజన సదుపాయాలు పూర్తి ఉచితంగా కల్పిస్తారని చెప్పారు. శిక్షణ అనంతరం రూ.15 వేల వేతనంతో ఆరు నెలల అప్రెంటిస్‌షిప్ అవకాశం ఉంటుందని, అనంతరం 100 శాతం ప్లేస్‌మెంట్ అవకాశాలు ఉంటాయని కలెక్టర్ తెలిపారు. ఎన్ఎస్‌టిఐ, ఎఫ్ఎఫ్ఎస్‌సి ఆధ్వర్యంలో జరిగిన మొదటి విడతలో 8 మంది శిక్షణ పూర్తి చేసి ప్రస్తుతం అప్రెంటిస్‌షిప్‌లో ఉన్నారని, రెండవ విడతలో 19 మంది అభ్యర్థులు ఎంపికయ్యారని తెలిపారు. జిల్లా యువత ఈ శిక్షణను ఉత్సాహంగా వినియోగించుకుంటున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వెంకయ్య, ఏపిఎం సైదేష్, ఈడిఎం దిలీప్, నందు, ర్యాంపు కో ఆర్డినేటర్స్, జేఆర్‌పిలు తదితరులు పాల్గొన్నారు.

## అమర వీరుల స్ఫూర్తితో పోరాటాలు



ప్రజాపక్షం/ రఘునాథపాలెం : అమర వీరుల స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాటాలు సాగించాలని సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ నాయకులు తెలిపారు. శనివారం మండల పరిధిలోని వేపకుంట్ల గ్రామంలో సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ కార్యాలయంలో అమర వీరులకు నివాళులర్పించారు. పార్టీ గ్రామశాఖ కార్యదర్శి నర్సయ్య మాట్లాడుతూ ఎందరో అమర వీరుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ నవంబర్ ఒకటి నుంచి తొమ్మిది వరకు అమర వీరుల వర్ధంతి సభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అమర వీరుల స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాటాలు సాగించాలన్నారు.నాయకులు రామనాథం, బాబు, రాంబాబు, పిచ్చయ్య, స్టాలిన్, కళావతి, ప్రశాంత్, సునీల్, ఇజ్రాయిల్, కృష్ణ, రాయప్ప, రాజేష్ పాల్గొన్నారు.

## సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సిఫారసు మేరకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ. 27.50 లక్షల విలువ గల 75 చెక్కులను శనివారం వీడియోస్ కాలనీలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ జిల్లా యువ నాయకులు తుమ్మల యుగంధర్ చేతుల మీదుగా మండల, డివిజన్ పార్టీ అధ్యక్షులకు, కార్పొరేటర్లకు, నాయకులకు అందజేశారు.ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అనారోగ్యంతో చికిత్స పొంది ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. లబ్దిదారుల ఇంటి వద్దకే చెక్కులు పంపిణీ చేయాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ది చేకూర్చనున్నట్లు తెలిపారు.ఏఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, కార్పొరేటర్లు రాపర్తి శరత్, నాగండ్ల దీపక్ చౌదరి, పల్లెబోయిన చంద్రం, రఘునాథపాలెం మండల కన్వీనర్ వాంకుడోత్ దీప్లా నాయక్, మహ్మద్ ఆసీఫ్, ఖాదర్‌బాబాపాల్గొన్నారు.

## సౌత్ జోన్ క్రీడల్లో ఎస్‌విఎం విద్యార్థుల సత్తా



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఖమ్మం సౌత్ జోన్ క్రీడల్లో ఖమ్మం నగరం శ్రీనివాస నగర్‌లోని ఎస్‌విఎం పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. సర్దార్ పటేల్ మైదానంలో జరిగిన ఖమ్మం సౌత్ జోన్ క్రీడల్లో భాగంగా బాలికల విభాగంలో అండర్ 17 కబడ్డీ పోటీల్లో ఎస్‌విఎం పాఠశాల విద్యార్థినిలు ద్వితీయ స్థానంలో నిలిచి మెమోంటో, సిల్వర్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా శనివారం పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో డైరెక్టర్లు డా॥ కిషోర్, కొండా శ్రీధర్‌రావు, ఉమాకిషోర్ తదితరులు పాల్గొని ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. ( శారీరక వ్యాయామం ఉంటుందన్నారు. రాష్ట్ర, జాతీయ స్థా యిలో విద్యార్థులు రాణించేలా శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. తమ పాఠశాలలో చదువుతో పాటు విద్యార్థులను అన్ని రంగాలలో తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రిన్సిపాల్ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి పోటీల్లో సర్వజ్ఞ విద్యార్థుల ప్రతిభ



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఖమ్మం నగరంలోని వీడియోస్ కాలనీలో గల సర్వజ్ఞ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి కళా ఉత్సవ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపినట్లు పాఠశాల డైరెక్టర్ ఆర్‌వి నాగేంద్ర కుమార్ తెలిపారు. రాష్ట్ర స్థాయి కళా ఉత్సవ్ పోటీల్లో భాగంగా స్కిట్ విభాగంలో నాల్గవ స్థానంలో నిలిచారు. సర్వజ్ఞ విద్యార్థులు ప్రదర్శించిన స్కిట్ అద్భుతమైన ప్రదర్శనతో అందరి ప్రశంసలు అందుకుంది. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను డైరెక్టర్ ఆర్‌వి నాగేంద్రకుమార్ అభినందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయిలో విజయం సాధించి రాష్ట్ర స్థాయిలో జరిగిన కళా ఉత్సవ్ పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ చూపి నాల్గవ స్థానం సాధించడం ఎంతో హర్షణీయమన్నారు. తమ పాఠశాలో చదువుతో పాటు విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నిందితులను పట్టుకోవడంలో ప్రభుత్వ వైఫల్యం

ప్రకటనలు కాదు నిందితులను పట్టుకోండి

సామినేని సంస్మరణ సభలో బివి రాఘవులు

రాజకీయ కుట్రలో భాగమే సామినేని హత్య : తమ్మినేని


సంస్మరణ సభలో జాన్‌వెస్లీ, సిపిఐ నేత బాగం తదితరులు



ప్రజాపక్షం/ ఖమ్మం/ చింతకాని : సిపిఎం నేత సామినేని రామారావు హత్య కేసులో నిందితులను గుర్తించడంలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని దీనికి హోంమంత్రిగా రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రిగా ఉండి ఈ నియోజక వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న మల్లు భట్టివిక్రమార్క బాధ్యత వహించాలని సిపిఎం పోలిట్ బ్యూరో సభ్యుడు బివి రాఘవులు తెలిపారు. తొమ్మిది రోజులైన హత్య కేసు నిందితులను తేల్చడంతో పాటు వారిని అరెస్టు చేయడంలో పోలీస్ శాఖ పూర్తిగా వైఫల్యం చెందిందని ఆయన ఆరోపించారు. గత నెల 31న హత్యగావించబడిన సిపిఎం నేత సామినేని రామారావు సంస్మరణ సభ శనివారం చింతకాని మండలం పాతర్లపాడు గ్రామంలో జరిగింది. సంస్మరణ సభకు ముందు పెద్ద సంఖ్యలో సిపిఎం కార్యకర్తలు గ్రామంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండి సిపిఎం కార్యకర్తలు తరలి రావడంతో పాతర్లపాడు అరుణ వర్ణమైంది. సిపిఎం, సిపిఐ నాయకులు, సామినేని అభిమానులు, బంధువులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సిపిఎం మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు అధ్యక్షతన జరిగిన సంస్మరణ సభలో బివి రాఘవులు మాట్లాడుతూ రామారావును రాజకీయంగా ఎదుర్కొనలేకనే హత్య చేశారని ఆయన తెలిపారు. ముగ్గురు మంత్రులున్న ఈ జిల్లాలో హత్య జరిగిన తొమ్మిది రోజులు గడిచినా నిందితులను ఎందుకు పట్టుకోలేకపోయారో ప్రజలకు సమాధానం చెప్పా లని ఆయన డిమాండ్ చేశారు. ప్రజలను కాంగ్రెస్ పార్టీ దోచు కుంటుంటే కమ్యూనిస్టులు ప్రజలను కాపాడుతున్నారని ఆయన తెలిపారు. హత్యా రాజకీయాలతో కమ్యూనిస్టు పార్టీని లేకుండా చేయాలని కొంత మంది భ్రమపడుతున్నారని ఇది సాధ్యం కాదని సుదీర్ఘ కమ్యూనిస్టు ఉద్యమం తేల్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులే హత్య చేయించారని మేము ఆరోపిస్తున్నామని అది నిజం కాన ప్పుడు దోషులెవరో తేల్చాలని లేకపోతే తమ ఆందోళన కొనసాగిస్తామన్నారు. రామారావు ఆశయ సాధనకు పునరంకితం కావాలని బివి రాఘవులు పిలుపునిచ్చారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ కమ్యూనిస్టుల బలం ఓట్లు, సీట్లు కాదని ప్రజా ఉద్యమాలలో ఉందన్నారు. రాష్ట్రంలో కీలక నాయకులు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటూ కాలం గడుపుతున్నారని ఆరోపించారు. కమ్యూనిస్టు పార్టీ నాయకులను హతమార్చడం కొత్త కాదని రామారావు హత్యతో సిపిఎంను బలహీనపర్చాలని ప్రయత్నించారని అది సాధ్యం కాదన్నారు. గ్రామంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఎం విజయం సాధిస్తుందనే ఆలోచనతోనే రామా రావును హత్య చేశారని తమ్మినేని తెలిపారు. దోషులను మీరు తేల్చండి లేకపోతే ప్రజలే తేలుస్తారని ఆయన స్పష్టం చేశారు. అధికారం ముఖ్యం కాదని ప్రజా సమస్యల పరిష్కారమే తమ లక్ష్యమన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ మాట్లాడుతూ హంతకులకు సంబంధించి ఫిర్యాదు చేసిన ఎందుకు విచారణ చేయడం లేదని ఆయన ప్రశ్నించారు. ఖమ్మం సిపి ఇది రాజకీయ హత్య కాదని అంటున్నారని ఆయనకు ఎలా తెలుసని వెస్లీ ప్రశ్నించారు. ఆయన కూడా పోలీస్ కమిషనర్ ఉద్యోగానికి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరితే మంచిదన్నారు. అధికారం ఉంది కదా అని హత్యలు చేస్తే సిపిఎం చూస్తూ సహించబోదన్నారు. ప్రజల హృదయాలలో చెరగని ముద్ర వేసుకున్న ప్రజా నాయకుడు రామారావును హత్య చేయడం శోచనీయమన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి జీవితాన్ని అంకితం చేసిన రామారావు హత్య కేసులో నిందితులను తక్షణం అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు.ఒకరినో ఇద్దరినో హతమార్చినంత మాత్రాన కమ్యూనిస్టు ఉద్యమం ఆగదన్నారు. రైతాంగ సమస్యలపై లోతైన అవగాహన కలిగిన నాయకుడిగా రామారావు మృతి వామపక్ష ఉద్యమానికి తీరని లోటన్నారు. ఈ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వై. వెంకటేశ్వరరావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సిపిఎం రాష్ట్ర నాయకులు పాలడుగు భాస్కర్, బండారు రవికుమార్, బుగ్గవీటి సరళ, మాచర్ల భారతి, కొత్తగూడెం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, కనకయ్య, కళ్యాణం వెంకటేశ్వరరావు, బండి రమేష్, వై విక్రం, భూక్యా వీరభద్రం, సిపిఎం జిల్లా నాయకులు కోటేశ్వరరావు, సోమయ్య, రాయల వెంకటేశ్వరరావు, రామారావు సతీమణి స్వరాజ్యం, కుమారుడు విజయ్, కుమార్తె లలిత, బంధువులు పాల్గొన్నారు.

## 16న కొత్తగూడెంలో ‘మెగా జాబ్ మేళా’

కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : ఈనెల 16న కొత్తగూడెం క్లబ్‌లో సింగరేణి సంస్థ సౌజన్యంతో మెగా జాబ్ మేళాను నిర్వహించబోతున్నామని, ఈ జాబ్ మేళాను కొత్తగూడెం నియోజకవర్గ పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ తొలూత 65 కంపెనీలు జాబ్‌మేళాలో పాల్గొనేందుకు ఆహ్వానించామని, మరిన్ని కంపెనీలు శిబిరంలో పాల్గొనేవిధంగా కృషి చేస్తున్నామని అన్నారు. రిజిష్ట్రేన్ ప్రక్రియకు సంబందించి క్యూఆర్ స్కానర్‌ను సోషల్ మీడియా మాద్యమాలు, కరపత్రాలు, వాల్ పోస్టర్లు, స్టిక్కర్లు, హోర్డింగ్‌లు ద్వారా అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. నిరుద్యోగులు స్కానర్ ద్వారా రిజిష్ట్రేషన్ చేసుకుని 16న జరిగే జాబ్‌మేళా ఇంటర్వ్యూలకు హాజరు కావాలని, నేరుగా కూడా రిజిష్ట్రేషన్ చేసుకోవచ్చని చెప్పారు. ఒక్కొక్క అభ్యర్థి ఐదు కంపెనీలు నిర్వహించే ఇంటర్వ్యూలలో పాల్గొనే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను ఆహ్వానించామని, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొంటునట్లు చెప్పారు. అధికారులు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం కల్పించాలని, పెద్ద సంఖ్యలో నిరుద్యోగులు జాబ్ మేళాలో పాల్గొనేవిధంగా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు.

## శతాబ్ది ఉత్సవ ముగింపు సభకు విస్తృత ప్రచారం

గ్రామ గ్రామాన సభలు, సమావేశాలు



ప్రజాపక్షం/ ఖమ్మం : భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శత వసంతాల ముగింపు సంబరాలు డిసెంబర్ 26న ఖమ్మంలో జరగనున్న విషయం విధితమే. 1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో సిపిఐ ఆవిర్భావించగా 2024 డిసెంబర్ 26 నుంచి సిపిఐ శత వసంత ఉత్సవాలు దేశ వ్యాప్తంగా జరుగుతున్నాయి. కాన్పూర్‌లో ప్రారంభమైన ఉత్సవాలు 10 మాసాలుగా దేశ వ్యాప్తంగా ప్రతి రోజు ఏదో ఒక ప్రాంతంలో ఉత్సవాలు జరుగుతూనే ఉన్నాయి. ఖమ్మం జిల్లాలో శతాబ్ది ఉత్సవ ముగింపు సభ జరగనుండగా ఈ సందర్భంగా జరిగే బహిరంగ సభకు లక్షలాది మందిని సమీకరించాలని కమ్యూనిస్టు పార్టీ ఖమ్మం జిల్లా సమితి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమితి అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని పనిచేస్తున్నాయి. ఇప్పటికే ముగింపు సభ సమాచారాన్ని గ్రామ గ్రామానికి, ఇంటింటికి చేరవేస్తున్నారు. సిపిఐ కార్యకర్తలు, నాయకులు బృందాలుగా ఏర్పడి కరపత్ర ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. వాల్ రైటింగ్ ద్వారా డిసెంబర్ 26 ప్రదర్శన, బహిరంగ సభ సందేశాన్ని తెలియజేస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా యావత్ సిపిఐ నాయకత్వం బహిరంగ సభ ప్రచార కార్యక్రమ ంలో నిమగ్నమైంది. గ్రామస్థాయిలో సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ఒక దఫా మండల స్థాయి సమావేశాలను పూర్తి చేశా రు. సిపిఐ ఆహ్వాన సంఘ ప్రధాన కార్యదర్శులు బాగం హేమంతరావు, ఎస్‌కె సాబీర్‌పాషా, కోశాధికారి దండి సురేష్, కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, ఖమ్మంజిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, పలువురు రాష్ట్ర సమితి సభ్యులు, జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రచార కార్యక్రమాలను సమన్వయం చేస్తున్నారు. రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు నిరంతరం ఉమ్మడి జిల్లా బాధ్యులతో మాట్లాడుతూ బహిరంగ సభ, ప్రదర్శన జయప్రదం కోసం దిశా నిర్దేశం చేస్తున్నారు. ఈనెల 21న రాష్ట్ర స్థాయి జాతా ఖమ్మం జిల్లాలో పర్యటించనుంది. ఖమ్మం జిల్లా నుంచి నాలుగు విభిన్న మార్గాలలో, విభిన్న ప్రాం తాలలో భారత కమ్యూనిస్టు పార్టీ చరిత్ర, పోరాట విజయాలు తెలియజేస్తూ జాతాలను నిర్వహించనున్నారు. ఖమ్మం జిల్లా ఉద్యమ చరిత్రను వివరిస్తూ కళా రూపాలను రూపొందించనున్నారు. ఖమ్మం జిల్లాకు సంబంధించిన కవులు, కళాకారులతో పాటు రాష్ట్ర స్థాయి కవులను ఆహ్వానించి సిపిఐ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా కవి సమ్మేళనాలను నిర్వహించనున్నట్లు ఇప్పటికే ఆహ్వాన సంఘం ప్రకటించింది. మొత్తంగా భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవ ముగింపు సభను ఒక చారిత్రాత్మకంగా నిర్వహించేందుకు కమ్యూనిస్టు పార్టీ అన్ని ఏర్పాట్లను చేస్తున్నది.

# ఏజెన్సీలో రాష్ట్ర కబడ్డీ పోటీలు ఎంతో ఆనందం

ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

ఎస్‌పి రోహిత్ రాజ్



ప్రజాపక్షం/పినపాక: పినపాక మండలం ఈ బయ్యారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో అట్టహాసంగా రాష్ట్ర స్థాయి అండర్ 17 బాల బాలికల కబడ్డీ పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలను పినపాక నియోజకవర్గ ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్ రాజ్, డిఇఓ నాగలక్ష్మి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. పది జిల్లాల నుండి వచ్చిన క్రీడాకారుల చేత గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. రానున్న రోజుల్లో నేషనల్ లెవెల్ గేమ్స్ కబడ్డీ పోటీలు సైతం నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడల్లో సామర్థ్యాలను మెరుగుపరుచుకుంటూ విజయ బావుటాను ఎగురవేయాలని అన్నారు. ఆరోగ్యకరమైన జీవన శైలిని నడిపించడానికి శారీరక కార్యకలాపాల్లో విస్తృతంగా పాల్గొనాలని సూచించారు. అండర్ 17 రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించడంలో క్రీడా అధికారుల కృషిని ప్రశంసించారు. అథ్లెట్ల అవసరాలను ప్రాధాన్యత ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం నిబద్ధతను కొనియాడారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ మాట్లాడుతూ మారుమూల గిరిజన గ్రామం ఈ బయ్యారంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ క్రీడల వేదిక కావడం గర్వంగా ఉందన్నారు. క్రీడాకారులను అభినందించారు. కంది చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ కంది సుబ్బారెడ్డి మాట్లాడుతూ ట్రస్ట్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు, వసతితో పాటు భోజన సౌకర్యం సైతం కల్పించినట్లు వివరించారు. క్రీడాకారులకు దుస్తులు సైతం అందించినట్లు తెలిపారు. విద్యాబుద్ధులతో పాటు విద్యార్థులకు క్రీడలు సైతం అవసరమని అన్నారు. డిఎస్‌పి వంగా రవీందర్ రెడ్డి, తహసీల్దార్ గోపాలకృష్ణ, ఎంపీడీవో సంకీర్త్, సిఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ సురేష్, ఎంఇఓ నాగయ్య, పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, పీడీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## 48 గంటల్లో గన్నీ సంచులు సరఫరా

జిల్లాలో ఎక్కడా కొరత లేదు


అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ధాన్యం కొనుగోలుకు అవసరమైన మేర గన్నీ సంచు లు అందుబాటులో ఉన్నాయని, ప్రతిపాదనలు పంపిన 48 గంటల లోపు కొనుగోలు కేంద్రాలకు గన్నీ సంచులు సరఫరా చేస్తున్నామని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి శనివారం తెలిపారు. ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ 2025 ధాన్యం కొనుగోలుకు సంబంధించి అవసరమైన అన్ని ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేశామని అదనపు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ధా న్యం కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన మేర గన్నీ సంచులు, టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. ధాన్యం కొనుగోలు అవసరాలకు మాత్రమే గన్నీ సంచులు అందించడం జరుగుతుందన్నారు. రైతుల ఇంటి వద్దకు గన్నీ సంచులు ఇవ్వవద్దని స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ఇప్పటి వరకు 9,71,500 గన్నీ సంచులు పంపిణీ చేశామన్నారు. గన్నీ సంచుల కోసం కొనుగోలు కేంద్రాలు ఇండెంట్ పెట్టిన 48 గంటల లోగా సరఫరా చేస్తున్నామన్నారు. జిల్లాలో ఎక్కడ గన్నీ సంచుల కొరత లేదని అదనపు కలెక్టర్ తెలిపారు.

## అమ్మ పుట్టిన తేదీ రూ. 240 కోట్లు ‘లక్కీ’

లాటరీపై పాట్ కొట్టిన భీమవరం యువకుడు



ప్రజాపక్షం/సత్తుపల్లి: సామాన్య కుటుంబంలో పుట్టిన యువకుడికి ఒక్క లాటరీ టికెట్ జీవితాన్ని మార్చేసింది. అమ్మ పుట్టిన తేదీ సంఖ్యతో కొనుగోలు చేసిన ఆ టికెట్ అతనికి రూ 240 కోట్ల అదృష్టాన్ని తెచ్చి పెట్టింది. ప్రస్తుతం గొల్ల అనిల్‌కుమార్ అనే పేరు తెలుగు రాష్ట్రాలలో మారుమోగుతోంది. సత్తుపల్లి నియోజకవర్గం, వేంసూరు మండలం భీమవరం గ్రామంలోని ఒక సామాన్య కుటుంబంలో పుట్టిన యువకుడు రాత్రికి రాత్రే సెలబ్రిటీ అయిపోయాడు. చిన్నపాటి నుండి ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని, ఉన్నత చదువుల పూర్తి చేసి, ఉపాధి నిమిత్తం అబుదాబి దేశంలో ఏడాదిన్నరగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు, అక్కడ తన స్నేహితుల సూచన మేరకు లారటీ టికెట్ కొనుగోలు చేశాడు. అమ్మ భూలక్ష్మి పుట్టిన తేదీ 11వ తేదీ కావడంతో దాన్నే లక్కీ నంబర్‌గా భావించి లాటరీ టికెట్ కొనుగోలు చేయడం, ఆ నంబర్‌కి ఏకంగా రూ 240 కోట్లు తగలటంతో ఒక్క రాత్రిలోనే స్టార్ అయ్యాడు. తమ ఊరి వాడికి అబుదాబిలో రూ 240 కోట్లు లాటరీ తగిలిందంటే, మామూలు అదృష్టం కాదని, తమకు గ్వరంగా ఉందని భీమవరం గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తన కుమారుడికి లాటరీ టికెట్ ద్వారా కోట్ల రూపాయలు వచ్చాయంటే తల్లిదండ్రులు నమ్మలేకపోతున్నారు. ఆ దేవుడే తమకు ఈ మేలు చేశాడని ఆనందపడుతున్నారు.


## రిటైర్డ్ ఉదోగ్యుల నగదు చెల్లింపులో ప్రభుత్వ అలసత్వం సరికాదు

టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.వెంకట్



ప్రజాపక్షం/మధిర : ఎంతో ఒత్తిడిని జయించి ఉద్యోగులుగా, ఉపాధ్యాయులుగా నియామకమై దశాబ్దాల కాలం పాటు సేవలందించి రిటైర్డ్ అవుతున్న వారు దాచుకున్న నగదు చెల్లింపులో రాష్ట్ర ప్రభుత్వం ఆలసత్వం సరికాదని, తక్షణమే ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలను చెల్లించాలని టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ. వెంకట్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం టివిఎం ఉన్నత పాఠశాలలో మధిర కేంద్రంగా సంఘ మండల అధ్యక్షులు బండారు నాగరాజు అధ్యక్షతన జరిగిన మండల మహాసభలో ఆయనతో పాటు జిల్లా అధ్యక్షులు షేక్.రంజాన్ ముఖ్యఅతిధులుగా హాజరై మాట్లాడారు. కేంద్రం రెండేళ్ల పాటు ఆలస్యంగా ఏర్పాటు చేసిన 8వ వేతన సంఘం నియామకంలోని నిబంధనలు, పిఆర్సీ, డిఏ పెంపుదల వర్తించకపోవడం ఫెన్షనర్ల పాలిట శాపంగా మారాయని అన్నారు. ఐటి స్లాబులు సవరించాలని, టెట్ సమస్య పరిష్కారానికి విద్యకు చట్టంలోని సెక్షన్ 23ని సవరణ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. ఉన్నతాధికారులు అసంబద్ధమైన రేషనలైజేషన్ వర్క్ ఎడ్జస్టైంట్ జీవోలు, రివ్యూ మీటింగ్‌లతో తరచుగా ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురి చేయటం జరుగుతుందని అన్నారు. విద్యారంగా అభివృద్ధి, పాఠశాల అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్న ఉపాధ్యాయుల పాలిట ఈ రకమైన వైఖరి సరికాదన్నా రు. అనంతరం టిఎస్‌యుటిఎఫ్ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మనాగరాజు, ప్రధాన కార్యదర్శిగావీరయ్య, ఉపాధ్యక్షులుగా షేక్. ఇబ్రహీం, కాజా సు నీత, కోశాధికారిగా బైర్ల చెన్నయ్య, కార్యదర్శులు గా జివిఎంఎస్ రాణి, షేక్. లాల్‌అహ్మద్, ఊట్ల కొ ండలరావు, మల్లా రాజు, పఠాన్ భాజీఖాన్, లంక నాగేశ్వరరావు, రమేష్‌బాబు, దోరెడ్ల కవిత, నిమ్మగడ్డ గోపీచంద్, గద్దం విజయలక్ష్మి లను ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శులు షేక్.నాగూర్‌వలీ, అ నుమోలు కోటేశ్వరరావు, ప్రాంతీయ కార్యాల యం కన్వీనర్ ఎ.వినోద్‌రావు, జిల్లా కార్యదర్శి ఆర్ లక్ష్మణరావు, టాప్రా నాయకులు మిరాఖాన్, మండల కమిటీ సభ్యులు, మధిర మండల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# రీల్



## మత్తు వదలరా కాంబినేషన్‌లో కొత్త సినిమా షురూ

సెన్సేషనల్ మత్తువదలరా కాంబినేషన్ మరోసారి అలరించబోతోంది. కల్ట్ హిట్ అయిన మత్తు వదలరాతో తో దర్శకుడిగా పరిచయమై, ఆ తర్వాత మరో బ్లాక్‌బ్లాస్టర్ సీక్వెల్ మత్తువదలరా 2 విజయాన్ని అందుకున్న రితేష్ రానా తన నాలుగవ చిత్రానికి శ్రీకారం చుట్టారు. యూనిక్ స్టయిల్ నరేషన్ తో ఆకట్టుకునే రితేష్ రానా మరోసారి సత్యతో జతకడుతున్నారు. ఈ చిత్రాన్ని క్లాప్ ఎంటర్టైన్మెంట్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నంబర్ 4గా చిరంజీవి (చెర్రీ), హేమలత పెదమల్లు నిర్మిస్తున్నారు. నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. మిస్ యూనివర్స్ ఇండియా రియా సింఘా ఈ చిత్రంతో తెలుగు సినిమాల్లోకి ఎంట్రీ ఇస్తున్నారు. ఆమె పాత్ర కథలో కీలకంగా వుంటుంది. సత్యతో ఆమె జంటగా కనిపించడం ప్రేక్షకులకు ఒక ఫ్రెష్‌నెస్ ఇవ్వనుంది. మత్తు వదలరా ఫ్రాంచైజీలో భాగమైన వెన్నెల కిషోర్, అజయ్ ఈ ప్రాజెక్ట్‌లో కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధిన పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సంగీతం కాల భైరవ, సినిమాటోగ్రఫీ సురేష్ సరంగం, ఎడిటింగ్ కార్తిక శ్రీనివాస్, ప్రొడక్షన్ డిజైన్ నార్ని శ్రీనివాస్ పని చేస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన రెగ్యులర్ షూటింగ్ త్వరలో హైదరాబాద్‌లో ప్రారంభం కానుంది.

## 'కలివి వనం' ట్రైలర్ ఆవిష్కరణ



వృక్షో రక్షతి రక్షితః అన్నారు పెద్దలు. ఇలాంటి మంచి సందేశాన్నిస్తూ వనాలను సంరక్షించుకోవాలనే నేపథ్యంతో పూర్తి తెలంగాణ పల్లెటూరి బ్యాక్ డ్రాప్‌లో చిత్రీకరించిన అరుదైన సినిమా కలివి వనం. హీరోయిన్‌గా నాగదుర్గ పరిచయమవుతోంది. కలివి వనం సినిమాను ఏఆర్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాజ్ నరేంద్ర రచనా దర్శకత్వంలో మల్లికార్జున్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి లు నిర్మించారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న సందర్భంగా చిత్ర ట్రైలర్‌ను సీనియర్ జర్నలిస్ట్‌లు ఆవిష్కారించారు. ఈ నెల 21 విడుదల అవుతున్న ఈ సినిమా రిలీజ్ పోస్టర్‌ను కూడా విడుదల చేశారు. ఈ సందర్భంగా నటుడు సమ్మెట గాంధీ మాట్లాడుతూ అడవిలో చెట్లు మనకు ఎంత ఉపయోగపడతాయన్న దాని మీద ఈ సినిమా చాలా బాగా తీశారు. సినిమా కూడా చాలా బాగా వచ్చింది. మా చిత్ర, దర్శక నిర్మాతలు మల్లికార్జున్ రెడ్డి, విష్ణవర్ధన్ రెడ్డి డబ్బులకు ఎక్కడా వెనకాడకుండా జగిత్యాల పరిసర ప్రాంతాల్లో, అడవుల్లో రాత్రనక పగలనక ఎంతో కష్టపడి చిత్రీకరణ చేయడం జరిగింది. మంచి కాన్సెప్ట్ తో వస్తున్న ఈ సినిమాను ప్రమోట్ చేస్తారని మనస్ఫూర్తిగా నమ్ముతున్నాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో మ్యూజిక్ డైరెక్టర్ మదీన్ ఎస్.కె ,చిత్ర దర్శకుడు రాజ్ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు. రఘుబాబు, సమ్మెట గాంధీ, విజయలక్ష్మి , నాగ దుర్గ, బిత్తిరి సత్తి, బలగం సత్యనారాయణ, మహేంద్ర నాథ్, సతీష్, శ్రీ చరణ్, అశోక్ తదితరులు ఈ చిత్రంలో రఘుబాబు, సమ్మెట గాంధీ, విజయల, బిత్తిరి సత్తి, బలగం సత్యనారాయణ, మహేంద్ర నాథ్, సతీష్ శ్రీ చరణ్, అశోక్ తదితరులు కీలకపాత్రలు పోషించారు.



## అది ఒక గొప్ప అనుభూతి

**- దుల్కర్ సల్మాన్**

మలయాళ నటుడు దుల్కర్ సల్మాన్ పీరియాడికల్ డ్రామా 'కాంత' 14న విడుదల కానుంది. టీజర్, పాటలు అద్భుతమైన రెస్పాన్స్‌తో మంచి బజ్ క్రియేట్ చేశాయి. ట్రైలర్ రిలీజ్ తో ఇప్పుడు ఎక్సయిట్మెంట్ మరింత పెరిగింది. రెబెల్ స్టార్ ప్రభాస్ లాంచ్ చేసిన ట్రైలర్ అదిరిపోయింది. ఒక రైజింగ్ స్టార్, అతనికి దారి చూపిన గురువు మధ్య ఉన్న ఎమిషన్‌ని ట్రైలర్ ఆసక్తికరంగా ప్రజెంట్ చేసింది. ఈ ఇద్దరి డ్రీం ప్రాజెక్ట్ 'కాంత' దగ్గరకి వచ్చేసరికి ఇగో వార్‌గా మారుతుంది. స్నేహం, ఆశయాల మధ్య నడిచే ఈ సంఘర్షణ 'కాంత' కథపై మరింత ఆసక్తిని పెంచింది. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో హీరో దుల్కర్ సల్మాన్ మాట్లాడుతూ.. నా బెస్ట్ ఫ్రెండ్ రానాతో కలిసి పనిచేయడం చాలా ఆనందంగా ఉంది. నేను వాళ్ళింట్లో అబ్బాయిలానే ఉంటాను. మేమిద్దరం కలసి సినిమా చేయడం చాలా ఆనందంగా వుంది. సెల్వ అద్భుతమైన కథతో వచ్చాడు. సముద్రఖనితో కలిసి వర్క్ చేయడం గొప్ప అనుభూతి. ఇందులో ఆయన మెమొరబుల్ పెర్ఫార్మన్స్ చూస్తారు. కుమారి పాత్రలో భాగ్యశ్రీ చాలా డిఫరెంట్ పెర్ఫార్మన్స్ ఇచ్చారు. ఇందులో అద్భుతమైన మ్యూజిక్ వుంది. ఇది మంచి డ్రామా, థ్రిల్లర్. డెఫినెట్‌గా థియేటర్స్‌లో చూడండి. గ్రేట్ ఎక్స్పీరియన్స్ ఉంటుంది అన్నారు. హీరో రానా దగ్గుబాటి మాట్లాడుతూ.. నేను చెన్నై నుంచి హైదరాబాద్ వచ్చినప్పుడు ఇక్కడ ఏ స్టూడియోస్ లేవు. అందరూ విజయ స్టూడియో, వాహిని స్టూడియో, ఏవీఎన్ స్టూడియోలలో జరిగే పనుల గురించి మాట్లాడుకునే వాళ్ళు, స్టార్స్ గురించి చెప్పుకునే వాళ్ళు. ఇప్పుడైతే సోషల్ మీడియా ఉంది. అప్పుడు స్టూడియోలో జరిగే విషయాలు చాలా తక్కువ మందికి తెలిసేది. అలాంటి ఒక్క బ్యాక్ డ్రాప్‌లో సెల్వ కథ చెప్పడం జరిగింది. కథ విన్న వెంటనే కచ్చితంగా ఈ సినిమా చేయాలనిపించింది. ఇలాంటి పీరియడ్ సినిమాకి దుల్కర్ సల్మాన్ పర్ఫెక్ట్. 14 తర్వాత దుల్కర్‌ని మీరు అందరూ నటచక్రవర్తి అని పిలుస్తారు. భీమ్లా నాయక్‌లో సముద్రఖని అబ్బాయిగా చేశాను. ఇందులో మా రిలేషన్ చాలా కొత్తగా ఉంటుంది. దుల్కర్, సముద్రఖని లాంటి అద్భుత నటుల మధ్య నిల్చుంది భాగ్యశ్రీ. 14న మీ అందరినీ థియేటర్స్‌లో కలుస్తున్నాం అని అన్నారు.

భాగ్యశ్రీ మాట్లాడుతూ.. ఇప్పటివరకు నా సినిమాలు చూశారు. ఈ సినిమాలో నేను యాక్ట్ చేయడం చూస్తారు. కాంత నాకు చాలా చాలా స్పెషల్. ఈ సినిమాని థియేటర్స్‌లో చూసి ఎంజాయ్ చేయాలని కోరుకుంటున్నాను.

ఈ కార్యక్రమంలో నటుడు సముద్రఖని, డైరెక్టర్ సెల్వమణి, సెల్వరాజ్, ప్రొడ్యూసర్ ప్రశాంత్ పొట్లూరి తదితరులు పాల్గొన్నారు.



## 14న 'తాండవం' పాట విడుదల

నందమూరి బాలకృష్ణ, దర్శకుడు బోయపాటి శ్రీను కాంబినేషన్ లో వస్తున్న సినిమా 'అఖండ 2: తాండవం'. రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఎం తేజస్విని నందమూరి చిత్రాన్ని సమర్పిస్తున్నారు. ఇప్పటికే విడుదలై 'అఖండ 2: తాండవం' ప్రమోషనల్ కంటెంట్ కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. తాజాగా అఖండ 2: తాండవం సాంగ్ ప్రోమో రిలీజ్ చేశారు. తమన్ పవర్ ఫుల్ బీట్స్, డివోషనలో చాంట్స్‌తో ఈ సాంగ్‌ని అద్భుతంగా కంపోజ్ చేశారు. ఒక చేతిలో త్రిశూలం, మరో చేతిలో దమరుకంతో బాలకృష్ణ చేసిన అఖండ తాండవం గూస్ బంప్స్ తెప్పించింది. ప్రోమో సాంగ్‌పై అంచనాలని భారీగా పెంచింది. ఫుల్ సాంగ్ ఈనెల 14న విడుదల కానుంఈ చిత్రంలో సంయుక్త ముఖ్యపాత్రలో నటిస్తున్నారు. ఆది పినిశెట్టి ఓ పవర్ ఫుల్ పాత్రలో నటిస్తున్నారు. హర్షాలి మల్హోత్రా కీలక పాత్రలో కనిపించనున్నారు.ఈ చిత్రానికి సి.రాంప్రసాద్, సంతోష్ సినిమాటోగ్రఫీని నిర్వహిస్తుండగా, తమ్మిరాజు ఎడిటర్. ఎఎస్ ప్రకాష్ ఆర్ట్ డైరెక్టర్. అఖండ 2: తాండవం డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. సంయుక్త, హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సీనియాలో ఆది పినిశెట్టి, హర్షాలి మల్హోత్రా కీలకమైన పాత్రల్లో కనిపించనున్నారు.



## ఈ నెల 29న బిజినెస్ మ్యాన్ రీరిలీజ్

సూపర్‌స్టార్ మహేష్ బాబు హీరోగా 2012లో విడుదలై ఇండస్ట్రీ హిట్‌గా నిలిచిన బిజినెస్ మ్యాన్ సినిమా మళ్లీ థియేటర్లలోకి రాబోతోంది. ఈ చిత్రాన్ని డైనమిక్ డైరెక్టర్ పూరీ జగన్నాథ్ తెరకెక్కించగా, మ్యూజిక్ డైరెక్టర్ ఎస్ఎస్ థమన్ అందించిన బీట్స్ అప్పట్లో సెన్సేషన్ సృష్టించాయి. ఈ సినిమాను రి రిలీజ్ చేస్తున్న సందర్భంగా పోస్టర్‌ను విడుదల చేశారు. ముంబయి మాఫియా బ్యాక్ డ్రాప్‌లో నడిచే ఈ కథలో సూర్య భాయ్ పాత్రలో మహేష్ బాబు కనిపిస్తాడు. నిర్మాత డా. వెంకట్ అధ్వర్యంలోని ఆర్ ఆర్ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని అత్యంత విలువైన ప్రొడక్షన్ వాల్యూస్తో తెరకెక్కించారు. ప్రొడక్షన్స్ డిస్ట్రిబ్యూషన్ ద్వారా, పూరీ జగన్నాథ్ దర్శకత్వం వహించిన బ్లాక్‌బ్లాస్టర్ చిత్రం బిజినెస్ మ్యాన్ దేశవ్యాప్తంగా అల్ ఓవర్ గ్రాండ్ రీరిలీజ్ కానుంది.

## 'ఓం వీర నాగ' సాంగ్ షూటింగ్



యంగ్ హీరో విరాట్ కర్ణ, అభిషేక్ నామా దర్శకత్వంలో కిషోర్ అన్నపురెడ్డి, నిషిత నాగిరెడ్డి నిర్మిస్తున్న పాన్‌ఇండియా ఎపిక్ మైథలాజికల్ యాక్షన్ ఎంటర్టైనర్ నాగబంధంతో అలరించబోతున్నారు. విరాట్ తన పాత్ర కోసం ఎంతో డెడికేషన్ తో అద్భుతంగా ఫిజికల్ ట్రాన్స్ఫర్మేషన్ అయ్యారు. నాగబంధం ఆధ్యాత్మికత, యాక్షన్, విజువల్ స్ప్లెండర్ మిళితమైన ఓ మ్యాసీవ్ సినిమాటిక్ జర్నీ. అభిషేక్ నామా దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం భక్తి, యాక్షన్, మిస్టరీని సమపాళ్లలో కలిపి ప్రేక్షకులను కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్తుంది. స్కేల్, విజువల్స్, కాన్సెప్ట్.. ఇవన్నీ తెలుగు సినిమా సరిహద్దులను దాటేలా వుంటాయి. బడ్జెట్ పరిమితులూ లేకుండా, ప్రేక్షకులను అబ్బురపరిచే సెట్లు, విజువల్స్‌తో ఈ సినిమా రూపుదిద్దుకుంటోంది.

## 'సైక్ సిద్ధార్థ' టీజర్ విడుదల



హీరో శ్రీ నందు తన అప్ కమింగ్ మూవీ 'సైక్ సిద్ధార్థ'కు రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా బ్యాకింగ్‌తో వస్తున్నారు. ఈ చిత్రానికి వరుణ్ రెడ్డి దర్శకత్వం వహించారు. స్పిరిట్ మీడియా, నందునెస్ కీప్ రోలింగ్ పిక్చర్స్ బ్యానర్లపై శ్రీ నందు, శ్యామ్ సుందర్ రెడ్డి తుడి సంయుక్తంగా నిర్మించారు. మ్యాడ్ మాక్స్‌స్టైల్ మ్యాడ్‌నెస్‌తో యూత్‌ఫుల్ ఎంటర్టైనర్‌గా రూపొందిన సైక్ సిద్ధార్థలో హై ఎనర్జీ ఎంటర్టైన్మెంట్ వుండబోతుంది. ఈ చిత్రంలో యామిని భాస్కర్ కథానాయికగా నటించగా, ప్రియాంక రెబెకా శ్రీనివాస్, సాక్షి అత్రీ, మౌనిక కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్ర టీజర్ను లాంచ్ ద్వారా మేకర్స్ ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. హీరో హైపర్‌యాక్టివ్, ప్రతి చిన్న పరిస్థితికి అనూహ్యయంగా స్పందించే యువకుడు. టీజర్ ప్రారంభంలో, అతను తన స్నేహితుడితో కలిసి వైల్ కారు ప్రయాణంలో, చిన్న చిన్న విషయాలపై తన నిరాశను చెబుతుంటాడు. విజయం సాధించడంలో నమ్మకం కోల్పోయిన ఓడిపోయిన వ్యక్తిగా తనను తాను చెప్పుకుంటాడు. టీజర్ హై ఎనర్జీతో అదిరిపోయింది. ఈ టీజర్ హ్యూజ్ బజ్‌ను సృష్టిస్తుంది. డిసెంబర్ 12న సైక్ సిద్ధార్థ గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ సినిమా ఏషియన్ సురేష్ ఎంటర్టైన్మెంట్స్ ద్వారా విడుదల కానుంది. మార్కెటింగ్‌ను రానా స్పిరిట్ మీడియా నిర్వహిస్తుంది. ఈ కార్యక్రమంలో హీరో శ్రీ నందు, డైరెక్టర్ వరుణ్ రెడ్డి, హీరోయిన్ యామిని పాల్గొన్నారు.



రిషబ్ శెట్టి స్వీయ దర్శకత్వంలో హోం భలే ఫిలిమ్స్ నిర్మించిన కాంతారా ప్రీక్వెల్ సక్సెస్ అయిన సందర్భంగా సినిమా యూనిట్ సక్సెస్ సెలబ్రేట్ చేసుకున్నప్పటి చిత్రం ఇది.

# రియాజ్‌ను దారుణంగా చంపేశారు

### జాతీయ మహిళా కమిషన్‌ను ఆశ్రయించిన తల్లి



**ప్రజాపక్షం/నిజామాబాద్:** రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపిన నిజామాబాద్‌లో కానిస్టేబుల్ హత్య.. నిందితుడు రియాజ్ ఎన్‌కౌంటర్‌పై కొత్త మలుపు తిరిగింది.కానిస్టేబుల్ హత్య, రియాజ్ ఎన్‌కౌంటర్‌పై న్యాయవిచారణ జరిపించాలని రియాజ్ తల్లి జాతీయ మహిళా కమిషన్ గడపతొక్కింది. ఈ మేరకు 'నా కొడుకు మెడ విరిచేశారు..పొట్టలో నుంచి పేగులు బయటకొచ్చాయని ..రియాజ్‌ను దారుణంగా చంపేశారు' అని రియాజ్ తల్లి ఆరోపిస్తూ ఫిర్యాదు చేశారు. భావోద్వేగానికి గురయ్యారు. కానిస్టేబుల్ ప్రమోద్ ను కత్తితో పొడిచి చంపిన రియాజ్ ను పోలీసులు ఎన్‌కౌంటర్ చేసిన విషయం తెలిసిందే. కాగ శనివారం ఢిల్లీలో రియాజ్ ఎన్‌కౌంటర్ ఒక బూటకమని అతని కుటుంబ సభ్యులు ఆరోపించారు. తమ కుమారుడితో పాటు, తమ కుటుంబపై జరిగిన పోలీసుల అమానుష దాడిని సుమోటోగా స్వీకరించాలని జాతీయ మహిళా కమిషన్‌ను ఆశ్రయించిన రియాజ్ తల్లి ఇవాళ మరోసారి భావోద్వేగానికి లోనయ్యారు. తన కుమారుడు రియాజ్‌ది బూటకపు ఎన్‌కౌంటర్ అని ఆరోపించారు. ప్రమోద్ హత్యపై లోతుగా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఒకవేళ నా కొడుకే నిజంగా హంతకుడు అయితే ఆధారాలు చూపించాలన్నారు. అప్పుడే తనకు మనశ్శాంతిగా ఉంటుందని తెలిపారు. ఏ తల్లికి అయినా కొడుకు కొడుకేగా అని వ్యాఖ్యానించారు. తన కుమారుడికి జరిగినట్లుగా మరెవరికీ జరగకూడదని కంటతడి పెట్టారు. నా కొడుకు అంతిమ యాత్రలో పోలీసులు వచ్చి ఎక్కడా ఆగనివ్వకుండా పంపించేశారు. శ్మశాన వాటికలో అంత్యక్రియలు చేస్తుంటే, ఇక్కడ చేయకూడదు అని వెళ్లగొట్టారు. ఎవరి కొడుకుకైనా ఇలాంటి పరిస్థితి రాకూడదంటూ రియాజ్ తల్లి కంటతడి పెట్టారు. రియాజ్ చనిపోయినప్పుడు, అంతిమ యాత్రలో తీసుకెళ్తుంటే పటాకులు కాల్చి సంబరాలు చేసుకున్నారన్నారు.

## అమెరికా బహిష్కరణ

(మొదటి పేజీ తరువాయి)

మియామీలో 2026లో జి–20 సదస్సుకు ఆతిథ్యం ఇచ్చేందుకు తానెంతో ఆసక్తిగా ఉన్నానని చెప్పారు. ట్రంప్ ఈ ఏడాది అధికారంలోకి రాగానే ఫిబ్రవరిలో ఒక ప్రకటన చేస్తూ దక్షిణాఫ్రికాను తప్పుపట్టారు. ఆ దేశంలో ఉన్న మైనారిటీ వర్గాలు అంటే అమెరికన్ల భూములను బలవంతంగా లాక్కుంటున్నారని, వారి భూములకు కనీస నష్టపరిహారం కూడా ఇవ్వడంలేదని విమర్శించారు. ఆ దేశంలో మానవ హక్కుల దోపిడీ కొనసాగుతోందని విమర్శించారు. ఈ పరిస్థితుల్లో దక్షిణాఫ్రికాకు అమెరికా ఎలాంటి ఆర్థిక సహాయం, ఇతర రకాల సహాయం చేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. గత ఏడాది డిసెంబరు ఒకటో తేదీన దక్షిణాఫ్రికా జి–20 అధ్యక్ష బాధ్యతలను తీసుకుంది. ఈనెల 22,23 తేదీలలో జోహన్నెస్‌బర్గ్‌లో జి–20 సదస్సు నిర్వహిస్తోంది. 2022 డిసెంబరు నుండి 2023 నవంబరు వరకూ భారతదేశం జి–20 అధ్యక్ష బాధ్యతలు నిర్వహించి ఆ బాధ్యతలను దక్షిణాఫ్రికాకు అప్పగించింది. జి–20లో భారత్‌తోపాటు 19 దేశాలు సభ్యులుగా ఉన్నాయి. అర్జెంటీనా, ఆస్ట్రేలియా, బ్రెజిల్, కెనడా, చైనా, ఫ్రాన్స్,జర్మనీ, భారత్, ఇండోనేసియా, ఇటలీ, జపాన్, దక్షిణ కొరియా, మెక్సికో, రష్యా, సౌదీ అరేబియా, దక్షణి ఆఫ్రికా, టర్కీ, బ్రిటన్, అమెరికా,యూరోపియన్ యూనియన్, ఆఫ్రికన్ యూనియన్‌లు సభ్యులుగా ఉన్నాయి.

## 'విశ్వగురు' వెళ్ళడం ఖాయం

(మొదటి పేజీ తరువాయి)

విభాగాధిపతి జైరామ్ రమేశ్ ఎద్దేవా చేశారు. ఈ మేరకు శనివారం ఎక్స్ వేదికగా పోస్టింగ్ పెట్టారు. తనను తాను విశ్వగురుగా ప్రకటించుకున్న నరేంద్రమోదీ ఈనెల 22, 23 తేదీలలో జరిగే సదస్సుకు వెళతారని మేం ఖచ్చితంగా చెప్పగలమని పేర్కొన్నారు. దక్షిణాఫ్రికాలో జాతిపరంగా మైనారిటీలుగా ఉన్న అమెరికన్లు, డచ్, జర్మన్, ఫ్రాన్స్‌దేశ ప్రజలను అణచివేతకు గురిచేస్తూ మానవహక్కుల దోపిడీ చేస్తోందని, ఈ దోపిడీ ఆగేవరకు తాము ఆ దేశానికి వెళ్ళేదిలేదని ట్రంప్ ప్రకటించిన తర్వాత జైరామ్ రమేశ్ పైవిధంగా స్పందించారు. ట్రంప్ వెళ్ళినందువల్ల కౌలాలంపూర్ సదస్సుకు మోదీ భౌతికంగా హాజరుకాకుండా, దృశ్యమాధ్యమ పద్ధతిలో సదస్సును ఉద్దేశించి ప్రసంగించారు. ట్రంప్‌ను ఎదుర్కోలేక మోదీ ఆయనకు తన మొహం చూపించడంలేదని కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే పలుసార్లు విమర్శలు చేసింది. ఈ ఏడాది మే నెలలో భారత్–పాకిస్థాన్ మధ్య జరిగిన సైనిక ఘర్షణను వాణిజ్యం అడ్డంపెట్టి తానే నివారించానని డోనాల్డ్ ట్రంప్ పదే పదే ప్రపంచవ్యాప్తంగా చాటింపు వేస్తున్నారు. కానీ భారత్ మాత్రం, ఈ ఇరుగు పొరుగు యుద్ధంలో మూడోదేశం జోక్యం లేదనీ, తమ రెండు దేశాల డిజిఎంఓ (సైనిక చర్యల డైరెక్టర్ జనరల్స్)ల మధ్య ప్రత్యక్ష సంభాషణల ద్వారా సమస్య పరిష్కరించుకున్నామని స్థిరంగా తన వాదన వినిపిస్తున్నది. 'మీరు ఇలా ఘర్షణ పడితే మీ రెండు దేశాలతో నేను వాణిజ్యం ఆపేస్తాను' అని చెప్పిన తర్వాత 'మేం యుద్ధం ఆపేశాం, ఒప్పందం కుదిరింది' అని తనకు ఫోన్ కాల్ వచ్చిందని ట్రంప్ మూడు రోజుల క్రితం కూడా తాజాగా ప్రకటించడాన్ని కాంగ్రెస్‌పార్టీ దేశ ప్రజల దృష్టికి తీసుకువచ్చింది.

# అగ్గికి పత్తి ఆహుతి

**ప్రజాపక్షం/బెజ్జంకి :** ప్రమాదవశాత్తూ మంటలు అంటుకుని 300 క్వింటాళ్ల పత్తి దగ్ధమైన ఘటన సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. బెజ్జంకికి చెందిన రైతు బండి ఐలయ్య తన పది ఎకరాలతో పాటు మరికొంత భూమిని కౌలుకు తీసుకొని పత్తి సాగు చేశాడు. కొద్దిరోజులుగా పత్తి తీత పనులు కొనసాగుతుండగా.. ఇంటికి తెచ్చిన పత్తిలో తడి ఆరేందుకు ఖాళీ స్థలంలో టార్పాలిన్లు వేసి ఆరబెట్టారు. మధ్యాహ్నం ప్రమాదవశాత్తు మంటలు అంటుకొని క్షణాల్లో పత్తి మొత్తం కాలి బూడిదైంది. రైతు ఐలయ్యతో పాటు కుమారులు రమేష్, అనిల్, ఇతర కుటుంబ సభ్యులు గమనించి మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా సాధ్యం కాలేదు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. సుమారు 300 క్వింటాళ్ల మేర పత్తి కాలిపోయినట్లు బాధితులు తెలిపారు. ఇన్ని రోజుల కష్టం బూడిద పాలు కావడంతో బోరున విలపించారు. ఘటనా స్థలాన్ని సిద్దిపేట రూరల్ సిఐ శ్రీను, ఎస్ఐ సౌజన్య పరిశీలించారు. కాగా, విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షులు పాకాల మహిపాల్ రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించి బాధితుడితో మాట్లాడారు. దగ్ధమైన పత్తి రైతుకు తక్షనమే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పంట నష్ట పరిహారాన్ని అందించి ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

# హెచ్-1బి దుర్వినియోగంపై 175 కేసుల దర్యాప్తు చేపట్టిన ట్రంప్

**న్యూయార్క్:** అమెరికాలో హెచ్–1 బి వీసాలు దుర్వినియోగం జరుగుతోందంటూ భారీ ఎత్తున వీసా ఫీజు పెంచిన ట్రంప్ యంత్రాంగం ఈ విషయంలో 175 కేసులు నమోదు చేసింది. ట్రంప్ యంత్రాంగం ఈ కేసుల్లో దర్యాప్తు చేపట్టింది. చాలా తక్కువ వేతనాలకు విదేశాల నుండి ఉద్యోగులను తీసుకువచ్చి అమెరికాలో ఉద్యోగాలు చేయిస్తున్నారని, ఉద్యోగులు పని ప్రదేశాలలో ఉండకుండా దూర ప్రాంతాల నుండే పనులు నిర్వహిస్తున్నారని, అదేవిధంగా పని ఇవ్వకుండా జీతం ఇచ్చి బెంచ్ మీద కూర్చోబెట్టే సంస్కృతి కూడా బాటా అమలులో ఉందనే ఆరోపణలపై 175 కేసుల్లో దర్యాప్తు ప్రారంభించారు. అర్హులైన అమెరికన్లకు ఉద్యోగాలు ఇవ్వకుండా హెచ్–1 బి వీసాలపై ఉద్యోగులను ఇతర దేశాల్లోంచి తీసుకువచ్చి తక్కువ వేతనాలతో పనులు చేయించుకుంటున్నారన్నది ట్రంప్ ప్రభుత్వం ప్రధాన ఆరోపణ. పైగా ఈ వీసాలలో 72 శాతం మేరకు భారతీయులకే ఇస్తున్నారన్నది మరో ఆరోపణ. చాలా అత్యున్నతస్థాయి నైపుణ్యం ఉంటే తప్ప ఎవ్వరికీ వీసాలు ఇవ్వకూడదన్న నిబంధనను కూడా డోనాల్డ్ ట్రంప్ ముందుకు తీసుకువచ్చారు. ఈ నైపుణ్య ఉద్యోగాల నియామకాల్లో స్థానిక అమెరికన్లకే ప్రాధాన్యం ఇస్తామని కూడా ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పటినుండీ చెబుతూ వచ్చారు. ఈ ఏడాది సెప్టెంబరు 21న ట్రంప్ ఉత్తర్వులు జారీ చేస్తూ, ఇకమీదట కొత్తగా హెచ్–1బి వీసాలకు దాఖలు చేసుకునేవారు ఏకకాలంలో దరఖాస్తు ఫీజు కింద 1,00,000 డాలర్లు చెల్లించాలని కూడా నిబంధన విధించి టెక్ కంపెనీలకు గుండెదడ పుట్టించారు.

# ప్రజాస్వామ్యం నిలవదు

(మొదటి పేజీ తరువాయి)



రాఘవాచారి పనిచేశారన్నారు. ఐదు వేల రూపాయలతోనే జీవనం సాగిస్తూ, రిక్షాలలో ప్రయాణం కొనసాగించేవారని గుర్తు చేసుకున్నారు. సంపాదన లేదని సంపాదకుడు రాఘవాచారి అని అన్నారు. ఇది డబ్బు కంటే విలువ, నిబద్ధత, సత్యం పట్ల ఆయనకున్న అంకితభావానికి నిదర్శనం అని అన్నారు.

1939లో పాలకుర్తిలో శ్రీవైష్ణవ కుటుంబంలో జన్మించిన రాఘవాచారి, రామాయణం, మహాభారతం, భాగవతం వంటివి చదివి అర్థం చేసుకున్నారన్నారు. గుంటూరు వెల్లి సంపత్ కుమార్, చల్లా సత్యానాయరణల దగ్గర శిష్యరికం చేసి, పంచ కావ్యాలను నేర్చుకున్నారన్నారు. తమిళం, సంస్కృతం, తెలుగు ఉర్దూ భాషలలో ప్రావీణ్యత సాధించారని చెప్పారు. లాలాగూడలో హైస్కూల్‌లో చదివి, ఉస్మానియా యూనివర్సిటీలో ఇంజనీరింగ్‌లో చేరే అవకాశం వచ్చినా కాదని, బిఎస్‌సి చేశారని, అనంతరం లాకాలేజీలో చేరి, ఎల్ఎల్ఎం పూర్తి చేశారని వివరించారు. రామాయణం, మహాభారతం చదివిన రాఘవాచారి శ్రీశ్రీ కవిత్వం పట్ల ముగ్ధుడయ్యారని, మఖ్దూం మొహియొద్దీన్‌కు శిష్యుడుగా మారారని, కమ్యూనిస్టుగా కొనసాగారన్నారు. ఏది రాయకూడదు, ఏది రాయాలనే అంశాలపై ఆయన పాఠాలు నేర్పారని చెప్పారు.

**భావ ప్రకటన స్వేచ్ఛ ప్రజాస్వామ్యానికి మూలాధారం..**

పత్రికలు, యాజమాన్యాలు, సంపాదకులకు అవినాభావ సంబంధం కలిగిన అంశాలు అని జస్టిస్ సుదర్శన్ రెడ్డి అన్నారు. ప్రభుత్వాలు ఎన్ని నియంత్రణలు తీసుకురావాలని ప్రయత్నించినా, పత్రికల స్వేచ్ఛను ప్రజలు, కోర్టులు కాపాడాయన్నారు. ఆర్టికల్ 19(1)కు సవరణ ద్వారా నెహ్రూ ప్రభుత్వం సహేతుక నియంత్రణకు ప్రయత్నించిందని తెలిపారు. పత్రికల స్వేచ్ఛను కోర్టులు ఎల్లప్పుడూ కాపాడాయని జస్టిస్ సుదర్శన్ రెడ్డి గుర్తు చేశారు. 'భావ ప్రకటన స్వేచ్ఛ లేకుంటే ప్రజాస్వామ్యం ఉండదు', ఇది కేవలం న్యాయసూత్రం కాదు, జీవనసత్యం అని అన్నారు. భావ ప్రకటన స్వేచ్ఛ ప్రజాస్వామ్యానికి మూలాధారమన్నారు. దాన్ని పూర్తిగా నియంత్రిస్తే ప్రజాస్వామ్యం సారం హీనమవుతుందన్నారు. సర్క్యులేషన్ తగ్గించడానికి ఆంక్షలు విధించాలన్న ప్రభుత్వ ప్రయత్నాలను సుప్రీం కోర్టు తిరస్కరించిందని తెలిపారు. భావప్రకటనా స్వేచ్ఛ మానవ హక్కుల అంతర్భాగమని జాన్ మిల్టన్ కూడా చెప్పారని అన్నారు.

**సోషల్ మీడియాను నియంత్రిస్తున్న సంపన్నులు**

సోషల్ మీడియా ఇప్పుడు మీడియా చేతుల్లో లేదని సుదర్శన్‌రెడ్డి అన్నారు. ప్రపంచంలోని కొద్ది మంది సంపన్నులు సోషల్ మీడియాను నియంత్రిస్తున్నారన్నారు. దీన్ని ఎంతవరకు నియంత్రించవచ్చన్నదే ఇప్పుడు ముంబాయి హైకోర్టు తీర్పు నేపథ్యంలో సుప్రీం కోర్టులో చర్చ జరుగుతుందని చెప్పారు. రాఘవాచారి స్మారకోపన్యాసం ఇచ్చేందుకు నోట్ రాసుకొని వద్దామనుకున్నానని, కానీ సమయాభావం వల్ల రాయలేకపోయానని తెలిపారు. ఆయన నోట్స్ తీసుకొని చదివిన సందర్భం లేదని, ఆయనలాగే నేరుగా వచ్చి, హృదయం చెబుతున్న మాటలతోనే మాట్లాడాలని భావించానని తెలిపారు. రాఘవాచారి జీవితం మనందరికీ ఒక పాఠం అని జస్టిస్ సుదర్శన్ రెడ్డి అన్నారు.

**ప్రజల పక్షాన పనిచేసేందుకే మీడియాను రాజ్యాంగంలో చేర్చలేదు : కె.శ్రీనివాస్ రెడ్డి**

తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగంలో మీడియా ప్రస్తావన ఎక్కడ లేదనే విషయం తెల్సిందేనని అన్నారు. రాజ్యాంగంలో మీడియా ప్రస్తావనను డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ వ్యతిరేకించారని తెలిపారు. మూడు అంగాలు రాజ్యాంగం పరిధిలో ఉన్నందున, రాజ్యాంగంలో మీడియాను బంధించొద్దని అంబేద్కర్ చెప్పారన్నారు. ప్రజల పక్షాన మీడియా పనిచేయాలని అంబేద్కర్ ఆకాంక్షించారని తెలిపారు. రమేష్ థాపర్ కేసులో ఆర్టికల్ 19(1)'ఎ'లో పత్రికాస్వేచ్ఛ అంతర్భాగమని సుప్రీం కోర్టు స్పష్టం చేసిందని గుర్తు చేశారు. దేశంలో చోటు చేసుకున్న పరిణామాలు, అందరి భావాలు మీడియా చెప్పుతుందన్నారు. ఎన్ని ఆవరోధాలు వచ్చినా న్యాయ వ్యవస్థ రక్షించిందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో పత్రికా రంగ ప్రముఖులు కె.రామచంద్రమూర్తి, ఆర్.వి.రామారావు (విశాలాంధ్ర ఎడిటర్), దేవులపల్లి అమర్ (మనతెలంగాణ ఎడిటర్), టియుడబ్ల్యుజె రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్‌అలీ, ఐజెయు నాయకులు ఎం.ఎ.మాజిద్, వై.నరేందర్ రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు, ఇన్సాఫ్ జాతీయ అధ్యక్షుడు సయ్యద్ అజీజ్ పాషా, సిపిఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ పాండా, ట్రస్ట్ సభ్యులు కె.జ్యోత్స్న, వై.వి.కృష్ణ, ఎ.చందర్, టి.సురేశ్, బి.జమిందార్ తదితరులు పాల్గొన్నారు. కాగా, తొలుత ట్రస్ట్ సభ్యులు డి.సోమసుందర్ స్వాగతం పలుకగా, చివరలో డాక్టర్ సి.అనుపమ వందన సమర్పన చేశారు. వివిధ రంగాల ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com